
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 82

మంగళవారం 13-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎగవేతదారులతో సెటిల్మెంట్

నిరర్థక ఆస్తుల రికవరీకి ఆర్‌బీఐ ప్రయత్నాలు - 13లో



భారత్ మ్యాచ్ 'భాగ్యం' లేదు!

వన్డే వరల్డ్ కప్ డ్రాఫ్ట్ షెడ్యూల్‌లో హైదరాబాద్ స్టేడియానికి దక్కని చోటు - 12లో



15న తీరానికి 'బిపర్‌జోయ్'

బిపర్‌జోయ్ తుపాను ఈ నెల 15న గుజరాత్‌లోని జఖౌ పోర్టు వద్ద తీరాన్ని తాకనుందని ఐఎండీ హెచ్చరించింది.

- వివరాలు 6లో



ఇటలీ మాజీ ప్రధాని మృతి

మూడుసార్లు ఇటలీ ప్రధానిగా పనిచేసిన సిల్వియో బెర్లుస్కొనీ (89) లుకేమియాతో తుదిశ్వాస విడిచారు.

- వివరాలు 6లో



'కోవిన్' ఫుల్ సేఫ్

కోవిడ్ టీకాల కోసం తెచ్చిన కోవిన్ పోర్టల్‌లో రిజిస్టరైన లబ్ధిదారుల డేటా లీకైందన్న వార్తలను కేంద్రం ఖండించింది.

- వివరాలు 6లో



శిక్ష పడినా పోటీ చేస్తా..

రహస్య పత్రాల కేసులో తనకు శిక్ష పడినా సరే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి తీరుతానని ట్రంప్ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో





ధరణి రాకతో రాబందులు మాయం

ఇప్పుడు పైరవీకారులు లేరు, దళారులు లేరు: సీఎం కేసీఆర్

- రైతు బంధు డబ్బులు నేరుగా ఖాతాల్లో పడుతున్నాయి
- పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయి
- అలాంటి ధరణిని బంగాళాఖాతంలో వేయాలంటారా?
- చాలా రంగాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్
- రాష్ట్రంలో పుట్టుక నుంచి చావు వరకు అన్నింటా ప్రభుత్వ సాయం
- నడిగడ్డకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిన సీఎం
- జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ప్రారంభం

2లో

సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన ప్రగతి నివేదన సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

న్యూస్‌రీల్

రెరా చైర్మన్‌గా సత్యనారాయణ



టీఎస్– రెరా చైర్మన్‌గా పురపాలక శాఖ డైరెక్టర్ ఎస్. సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 14లో

సివిల్స్ ప్రిలిమినరీ ఫలితాలు విడుదల



అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన సివిల్స్–2023 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను యూపీఎస్సీ సోమవారం వెల్లడించింది. ఈ పరీక్షల్లో 14,624 మంది అర్హత సాధించారు.

- వివరాలు 6లో

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై సీబీఐకి ఫిర్యాదు



బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై విచారణ జరిపించాలని బాధితురాలు శేజల్ సీబీఐని ఆశ్రయించారు. తెలంగాణ పోలీసులపై నమ్మకం లేకనే సీబీఐకి ఫిర్యాదు చేశానన్నారు.

- వివరాలు 2లో

ఇదం జగత్



..మీ కోరికకు అనుగుణంగా మార్చుకున్నార్సార్

కట్టు తప్పితే కటువుగానే!

బీఆర్‌ఎస్‌లో అంతర్గత విభేదాలపై కేసీఆర్ దృష్టి • గీత దాటిన నేతలపై వేటుకు అధినేత సిద్ధం!

- ఎమ్మెల్సీ కూచుకుళ్ల పార్టీ మారేందుకు ప్రయత్నించడంపై ఆగ్రహం
- పొంగులేటి, జూపల్లి తరహాలో కొందరిపై చర్యలు
- కొన్నిచోట్ల బుజ్జగింపులు, దిద్దుబాటుపై కసరత్తు
- కేటీఆర్‌తో పాటు మరికొందరు మంత్రులకు బాధ్యతలు
- పార్టీ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉన్న సెగ్మెంట్లపై స్పెషల్ నజర్
- 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకు ప్రత్యామ్నాయం సిద్ధం!

సాక్షి, హైదరాబాద్: ఏడాది చివర్లో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికలు లక్ష్యంగా సన్నాహాలు ప్రారంభించిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు పార్టీలో అసమ్మతిని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అంతర్గత అసమ్మతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదనే సంకేతాలివ్వాలని భావిస్తున్నారు. ఈ మేరకు అవసరమైతే కొందరిపై వేటు వేయడానికి కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం.



హ్యాట్రిక్ విజయానికి ప్రధానంగాఅవరోధంగా భావిస్తున్న అంశాలపై ఇప్పటికే అంచనాకు వచ్చిన కేసీఆర్ దిద్దుబాటు చర్యలను సైతం వేగవంతం చేయాలని నిర్ణయించారు. పార్టీలో సంస్థాగత లోపాలను సరిదిద్దడంపైనా దృష్టి సారించారు. అవసరమైన చోట బుజ్జగింపు చర్యలు చేపట్టే బాధ్యతను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మరికొందరు మంత్రులకు అప్పగించారు.అదే సమయంలో ప్రజల్లో వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలకు చెక్ పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ఆత్మీయ సమ్మేళనాల్లో బయటపడ్డ విభేదాలు..

ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల సందర్భంగా పలుచోట్ల బీఆర్‌ఎస్ నేతల నడుమ విభేదాలు బయటపడ్డాయి. సుమారు 40 నియోజకవర్గాల్లో పార్టీ టికెట్ల కోసం సిట్టింగ్‌లు, ఆశావహుల నడుమ తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో చాలాచోట్ల నేతలు ఆత్మీయ సమ్మేళనాలకు దూరంగా ఉన్నారు. అందరినీ కలుపుకొని వెళ్లాలని కేసీఆర్ ఆదేశించినా సిట్టింగ్ ఎమ్మెల్యేలు పెద్దగా ఆసక్తి చూపలేదు. వేముల వీరేశం (నకిరేకల్), కోటిరెడ్డి(నాగార్జునసాగర్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తుమ్మల నాగేశ్వర్‌రావు (పాలేరు), శ్రీహరిరావు (నిర్మల్), పట్నం మహేందర్‌రెడ్డి (తాండూరు) తదితరులు ఆత్మీయ సమ్మేళనాలకు దూరంగా ఉన్నారు. ఆత్మీయ సమ్మేళనాల మిగతా 2వ పేజీలో ▶

ధరణి ముసుగులో రూ.వెయ్యి కోట్ల కుంభకోణం!

రేవంత్‌రెడ్డి ఆరోపణలు

- రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ గ్రామంలో గోల్‌మాల్ చేశారు
- నిషేధిత జాబితాలోని భూములు రియల్ వ్యాపారులకు కట్టబెట్టారు..
- ధరణి రద్దుపై సీఎం కేసీఆర్ పెడబొబ్బలు అందుకే..
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే టైటిల్ గ్యారంటీ విధానం..



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని రూ.1,000 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ గ్రామ పరిధిలో ఉన్న 146 ఎకరాల భూదాన్ భూములను ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి తొలగించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టారని అన్నారు. ఇందులో మంత్రి కేటీఆర్ అనుచరులు, రంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలది కీలకపాత్ర అని ఆరోపించారు. ఈ కుంభకోణంలో కేసీఆర్ కుటుంబ సభ్యుల పాత్ర లేకపోతే వెంటనే దీనిపై విచారణకు ఆదేశించాలని, ఇందుకు కారణమైన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కిసాన్‌సెల్ మిగతా 2వ పేజీలో ▶

దేశవ్యాప్తంగా బీసీ పోరు!

డిమాండ్ల సాధన కోసం సుదీర్ఘ కార్యాచరణ చేపట్టనున్నాం
ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీసీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే మండల్ కమిషన్ నిర్దేశించినట్టుగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో, పదోన్నతుల్లో తప్పకుండా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సూరజ్ మండల్ డిమాండ్ చేశారు. దేశంలో బీసీలు సహా కులాల వారీగా జనాభా ఎంత ఉందన్న స్పష్టత వచ్చేలా జనగణన చేయాలని.. ఈ

- వచ్చే నెలాఖరులోగా హైదరాబాద్‌లో మహాధర్నా
- మండల్ కమిషన్ సిఫార్సుల అమలు కోసం పట్టుబడతాం
- కేంద్ర ప్రభుత్వం బీసీల హక్కులతో ఆటలాడుతోంది
- అగ్రవర్ణ జనాభా తేల్చకుండా 10శాతం రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్న

రెండు అంశాల అమలు కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని తెలిపారు. ఆ దిశగానే ఈ నెల 11న హైదరాబాద్‌లో బీసీ సదస్సును నిర్వహించి, అందులో లేవనెత్తిన అంశాలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని.. వచ్చే నెలలో హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో బీసీ సదస్సు కోసం వచ్చిన సూరజ్ మండల్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. బిహార్ సీఎంగా పనిచేసి బీసీల కోసం ఉద్యమించిన నేత బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) మనవడిగా బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తాను కృషి చేస్తున్నట్టు చెప్పారు. సూరజ్ మండల్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఏపీ తరహా స్ఫూర్తిని అనుసరించాలి..



''చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో ఉన్నా ఆచరణలోకి రాలేదు. అయితే ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపుల్లో వైఎస్సార్‌సీపీ తీసుకున్న నిర్ణయం హర్షించదగినది. బీసీ ల్లోని పలు సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కేలా ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పంథా అనుసరిస్తానని, బీసీలకు ప్రత్యేక ప్రాధా న్యత ఇస్తానని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించడం శుభపరిణామం. ఇదే స్ఫూర్తిని దేశ ప్రధాని సహా ఇతర రాష్ట్రాల సీఎంలు, అన్ని రాజకీయ పార్టీలు అనుసరిస్తే బీసీలకు తగిన న్యాయం జరుగుతుంది.

బీసీలకు శాపంగా జాతీయ విద్యా విధానం

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం బీసీల పాలిట శాపంలా మిగతా 2వ పేజీలో ▶

నల్లగొండలో నీళ్ల మంటలు!

- ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మాటల యుద్ధం
- ఎస్ఎల్‌బీసీ, డిండిని పూర్తి చేయడం లేదేమని భట్టి నిలదీత
- ఉమ్మడి జిల్లాకు చెందిన గుత్తా, జగదీశ్‌రెడ్డిలపై విమర్శలు
- భట్టికి తోడుగా బీఆర్‌ఎస్ నేతలపై కోమటిరెడ్డి, ఉత్తమ్ ఫైర్
- ఏఎమ్మార్పీని పూర్తి చేయించానన్న మండలి చైర్మన్ గుత్తా
- సాగర్ నుంచి నీళ్లు ఇస్తున్నామన్న మంత్రి జగదీశ్‌రెడ్డి
- జిల్లా అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్





సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల అంశం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య మంటలు పుట్టిస్తోంది. నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లు, ఆరోపణలు, విమర్శలతో రాజకీయం వేడెక్కుతోంది. ఓవైపు సీఎల్పీ నేత భట్టి తన పాదయాత్రలో చేస్తున్న వ్యాఖ్యలు.. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రతిగా చేస్తున్న విమర్శలు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

నక్కలగండి నుంచి మొదలు..: ఈ నెల 8న నల్లగొండ జిల్లాలో ప్రవేశించిన భట్టి మిగతా 10వ పేజీలో ▶

ఆగస్టు 2న స్టాఫ్ నర్స్ పరీక్ష

- కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించాలని నిర్ణయం
- 3 సెషన్లలో పరీక్ష... 5,204 పోస్టులకు 40,926 మంది దరఖాస్తు

- వివరాలు 3లో





వార్ధాపై 'మహా' మెలిక !

- ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం జరపాలన్న మహారాష్ట్ర
- గతేడాది మేడిగడ్డకు వరదలతో తమ రాష్ట్రంలోని సిరోంచా ప్రాంతం ముంపునకు గురైందని వెల్లడి

- 5లో

హరిరామజోగయ్యకు తెలంగాణ హైకోర్టు అక్షింతలు

- ఏపీ సీఎం జగన్‌పై దాఖలు చేసిన పిల్‌లో ప్రజాప్రయోజనం ఏముందని ధ్వజం
- పబ్లిక్ న్యూసెన్స్ పిటిషన్ అంటూ ఆగ్రహం
- వ్యక్తిగత కక్షతోనే పిల్ వేశారని వ్యాఖ్య

14లో





మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం హైస్కూల్ దుస్థితి ఇది.. రేకుల షెడ్ల గదులు ఇప్పటికే శిథిలావస్థకు చేరుకోగా, ఇటీవలి గాలివానకు రేకులు ఎగిరిపోయాయి. అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో సోమవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు మొండిగోడలు దర్శనమిచ్చాయి. నిలువ నీడ లేకపోవడంతో ఎక్కడ కూర్చోవాలో విద్యార్థులకు అర్థం కాలేదు. ఆఫీస్ కార్యాలయం కూడా శిథిలావస్థలో ఉండటంతో ఉపాధ్యాయులు కూడా చెట్లకిందనే కూర్చున్నారు. - మరిపెడ రూరల్

తెరుచుకున్న బడి - వివరాలు 3లో

ఐఐటీ విద్యార్థులకు విదేశాల రెడ్ కార్పెట్



ఏటా మూడో వంతు మంది విదేశీబాట	మేధో వలసలో ఐఐటీ విద్యార్థులదే అగ్రస్థానం	చెన్నై, ఖరగ్‌పూర్, ముంబై,ఢిల్లీ, కాన్పూర్ ఐఐటీలు టాప్	ఐఐటీ హోదా పొందాక ప్లేస్‌మెంట్స్‌లో దూసుకుపోయిన బీహెచ్‌యూ

అత్యధికంగా 65% మంది అమెరికాకే.. ఎన్‌బీఈఆర్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) అంటే ప్రపంచంలోనే పేరెన్నికగన్న సాంకేతిక విద్యా సంస్థల్లో ఒకటి. ఐఐటీలో సీటు వస్తే ఆ విద్యార్థి అతను ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గం ఏర్పడినట్టే. అత్యున్నత శిక్షణలో రాటు దేలే ఐఐటీ విద్యార్థులంటే విదేశీ సంస్థలకూ క్రేజే. అందుకే భారత ఐఐటీ విద్యార్థులకు విదేశాలు రాచబాట పరుస్తున్నాయి. వారికి విదేశీ సంస్థలు ఉద్యోగ, ఉన్నత విద్యాభ్యాసం అందించేందుకు పోటీ పడుతున్నాయి. తత్ఫలితంగా దేశం నుంచి మేధో వలసలో ఐఐటీ విద్యార్థులే అత్యధిక శాతం ఉంటున్నారు. దేశంలో ఐఐటీల నుంచి ఏటా పట్టా పొందుతున్న విద్యార్థుల్లో మూడోవంతు విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఐఐటీల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షల ద్వారా దేశంలో అత్యంత ప్రతిభావంతులను ఎంపిక చేస్తారు. అక్కడ శిక్షణ పొందిన వారిని అత్యుత్తమ మానవ వనరులుగా ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు భారత ఐఐటీ విద్యార్థులకు పెద్దపీట వేస్తున్నాయని అమెరికాకు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్ రిసెర్చ్ (ఎన్‌బీఈఆర్) తాజా నివేదిక వెల్లడించింది. దేశంలోని 23 ఐఐటీలలోని 16,598 సీట్ల భర్తీ కోసం ఈ ఏడాది నిర్వహించిన పరీక్ష కోసం 1,89,744 మంది విద్యార్థులు పోటీ పడ్డారని ఆ నివేదిక పేర్కొంది. దేశంలోని ఐఐటీలలో కూడా చెన్నై, ముంబై, ఖరగ్‌పూర్, ఢిల్లీ, కాన్పూర్ ఐఐటీల విద్యార్థులకు మల్టీ నేషనల్ కంపెనీలు మరింత పెద్దపీట వేస్తున్నాయని తెలిపింది. ఎన్‌బీఈఆర్ నివేదికలోని ప్రధాన అంశాలు సంక్షిప్తంగా..

- భారత్‌లో ఐఐటీల నుంచి ఏటా పట్టా పొందుతున్న విద్యార్థుల్లో 35 శాతం విదేశాలకు వెళ్లిపోతున్నారు
- ఐఐటీలలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో టాప్–1000లో నిలుస్తున్న విద్యార్థుల్లో 36 శాతం మంది

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

17న నగరానికి రాష్ట్రపతి

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో పరేడ్‌కు ముఖ్యఅతిథిగా..



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించనున్న ఫ్లైట్ కేడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (సీజీపీ) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. పరేడ్ రివ్యూయింగ్ ఆఫీసర్‌గా హాజరవుతున్న రాష్ట్రపతి యువ కేడెట్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. శిక్షణ పూర్తి చేసిన యువ కేడెట్లను భారత వాయుసేనలోని వివిధ విభాగాల్లో విధుల్లో చేరుతున్న వారితో ప్రతిజ్ఞ చేయించనున్నారు. శిక్షణ కాలంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫ్లైట్ కేడెట్‌కు రాష్ట్రపతి గౌరవ కరవాళాన్ని ద్రౌపదీముర్ము బహూకరిస్తారు. అనంతరం భారత వాయుసేనతోపాటు భారత నేవీ, ఇండియన్ కోస్టుగార్డ్, భారత్‌తో మైత్రి బంధంలో ఉన్న దేశాల నుంచి ఈ బ్యాచ్‌లో శిక్షణ పొందిన ఫ్లైట్ కేడెట్లకు సైతం రాష్ట్రపతి అవార్డులను అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణకు 2,486 కోట్లు.. ఏపీకి 4,787 కోట్లు

రాష్ట్రాలకు మూడో విడత పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు మూడో విడత పన్నుల వాటాను సోమవారం విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు కలిపి మొత్తంగా రూ.1,18,280 కోట్ల మేర నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. ఇందులో తెలంగాణకు రూ.2,486 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.4,787 కోట్ల నిధులను విడుదల చేసింది. రాష్ట్రాలు తమ మూలధనం, అభివృద్ధి వ్యయాలను వేగవంతం చేసేందుకు, ప్రాధాన్యతా ప్రాజెక్టులకు నిధులు అందుబాటులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది.

కట్టు తప్పితే కటువుగానే!

▶ మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలోనే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేశారు. కాగా ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లోనూ కొందరు అసమ్మతి నేతలు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో వరుస భేటీలు జరుపుతుండగా, తాజాగా నిర్మల్‌కు చెందిన కీలక నేత కూచాడి శ్రీహరిరావు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరికొందరు నేతలు కూడా పార్టీని వీడే అవకాశముందని ఇప్పటికే కేసీఆర్ ఓ అంచనాకు వచ్చారు. వారి కదలికలపై ఇప్పటికే నిఘా వేసిన అధినేత.. బుజ్జగింపుల వంటి దిద్దుబాటు చర్యలకు, అవసరమైతే కొందరిపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అధికార పదవులు అనుభవిస్తూనే కొందరు, అవకాశాలు దక్కలేదని మరికొందరు అసమ్మతి గళం వినిపించడాన్ని కేసీఆర్ సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ నుంచి వచ్చిన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినా ఆయన పార్టీ మారేందుకు ప్రయత్నించడంపై అధినేత ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ఓడినా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా అవకాశమిచ్చిన విషయాన్ని కేసీఆర్ పార్టీ నేతల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. ఇలాంటి నేతలను వదులుకోవడం ద్వారా పార్టీపై వ్యతిరేకతను ఉపేక్షించబోమనే గట్టి సంకేతాలు ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రజా వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలకు చెక్!

సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత నెలకొన్న నియోజకవర్గాల్లో వీలైనంత మేర పరిస్థితిని చక్కదిద్దాలని కేసీఆర్ భావిస్తున్నారు. జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే లోతైన సమాచారంతో కూడిన నివేదికలు కేసీఆర్‌కు సర్వే, నిఘా సంస్థలు అందజేశాయి. గ్రామ, మండల స్థాయి వరకు పార్టీల వారీగా ప్రభావం చూపే నాయకులు, క్రియాశీల వ్యక్తులకు సంబంధించిన వివరాలు ఈ నివేదికల్లో ఉన్నట్లు సమాచారం. ఈ నివేదికల్లో బీఆర్‌ఎస్‌తో పాటు విపక్ష పార్టీల బలాబలాలకు సంబంధించిన అంచనాలు కూడా ఉన్నట్లు తెలిసింది. ఆత్మీయ సమ్మేళనాల్లో పార్టీ ఎమ్మెల్యేలతో పాటు నేతల వ్యవహార శైలికి సంబంధించిన అన్ని అంశాలను ఇప్పటికే పార్టీ ఇన్‌చార్జీలు నివేదికలు అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్యేలందరికీ టికెట్లు ఇస్తామని పార్టీ సమావేశాల్లో చెబుతూనే.. మరోవైపు పనితీరు మెరుగుపర్చుకోవాలని, ప్రజల్లో ఉండే నాయకులకే టికెట్లు ఇస్తామని కేసీఆర్ అంతర్గతంగా హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు సమాచారం. తద్వారా దిద్దుబాటుకు అవకాశం ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రత్యామ్నాయం తప్పదని భావిస్తున్నట్లు తెలిసింది. కేటీఆర్ కూడా అందరికీ టికెట్లు ఇస్తామని ఆరు నెలల ముందే ఎలా చెబుతామని ప్రశ్నించడం చూస్తుంటే.. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలకు చెక్ పెట్టడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుమారు 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయాన్ని కేసీఆర్ సిద్ధం చేశారని బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి.



వాహనాల నుంచి పరిశ్రమల దాకా.. వంటింటి నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రాల దాకా.. ఎక్కడ చూసినా వాయు కాలుష్యమే. ఈ పొగ, దుమ్ము, ధూళితో ఊపిరాడని పరిస్థితి. శ్వాసకోశ సమస్యలు పట్టిపీడిస్తున్న దుస్థితి. ఎక్కడో ఒక చోటే అని కాదు.. ప్రపంచవ్యాప్తంగా 99 శాతం ప్రజానీకం పీలుస్తున్న గాలి స్వచ్ఛమైనది కాదు. వాయు కాలుష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 67 లక్షల మందికిపైగానే బలవుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా వెల్లడించిన నివేదికలోని అంశాలే ఇవి. స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ చేసిన అధ్యయనం ఆధారంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నివేదికను విడుదల చేసింది. అందులో మన దేశానికి సంబంధించిన కొన్ని దారుణమైన వాస్తవాలనూ వెల్లడించింది. ప్రపంచంలో వాయు కాలుష్యం అత్యధికంగా ఉన్న టాప్–20 నగరాల జాబితాలో ఏకంగా 14 నగరాలు భారతదేశం నుంచే ఉండటం ఆందోళనకరం. ఇందులో దక్షిణాది రాష్ట్రాలేవీ లేకపోవడం కాస్త ఉపశమనం. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాల్లో దానిని తగ్గించే చర్యలు చేపడుతుంటే.. వాటి స్థానంలో కొత్త నగరాలు వచ్చి చేరుతున్నాయి.

-సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

కాలుష్యం కాటేస్తోంది!

ప్రపంచంలో టాప్-20 వాయు కాలుష్య పట్టణాల్లో 14 భారత్‌లోనే..
కాలుష్యంతో విజృంభిస్తున్న శ్వాసకోశ సంబంధ వ్యాధులు

దీనితో ప్రపంచవ్యాప్తంగా ఏటా 67 లక్షల మంది మృతి
ఇందులో 32 లక్షల మంది మరణాలకు వంటింటి పొగే కారణం!

ప్రపంచంలో 99 శాతం ప్రజలకు స్వచ్ఛమైన గాలి లభించని పరిస్థితి
వాయు కాలుష్య డేటాను వెల్లడించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

117 దేశాల్లోని 6 వేల పట్టణాల్లో వాయు నాణ్యతను పరిశీలించి నివేదిక

ఆరు వేల నగరాల్లో పరిశీలించి..

2022 సంవత్సరానికి సంబంధించి మొత్తం 117 దేశాల్లోని ఆరు వేల నగరాల్లో వాయు నాణ్యతను పరీక్షించామని.. మరికొన్ని దేశాల్లో వాయు నాణ్యతను పరీక్షించేందుకు సరైన పరికరాలు లేని కారణంగా పరీక్షించలేకపోయామని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. అలాంటి వాటిలో చాలా వాయు కాలుష్యం ఉన్న నగరాలూ ఉండి ఉంటాయని తెలిపింది.

తగిన జాగ్రత్తలు తీసుకోలేక..

కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సూక్ష్మ ధూళి కణాలు వంటి వాయు కలుషితాలు తీవ్రంగా ప్రభావం చూపిస్తున్నాయి. వేగంగా అభివృద్ధి చెందే క్రమంలో అటవీ సంపదను నాశనం చేస్తుండటం, పరిశ్రమల ఏర్పాటుతో కాలుష్యం పెరుగుతోంది. పరిశ్రమలు విడుదల చేసే వాయు, జల, భూకాలుష్యాలను అరికట్టే చర్యలపై ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతున్నాయి. ఏదో భోపాల్ దుర్ఘటన వంటివి జరిగినప్పుడు హడావుడి చేయడం, ఆ తర్వాత మిన్నకుండిపోవడం సాధారణమైపోయింది. భద్రతా ప్రమాణాలను 'గాలి'కి వదిలేయడం వల్ల వాయు కాలుష్యం ప్రజల ప్రాణాలకు అపాయకరంగా మారుతోంది.

వంటింటి పొగ ప్రాణాలు తీస్తోంది

వాయు కాలుష్యం కారణంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారిలో మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 32 లక్షల మందికిపైగా వంటింటి పొగకు బలవుతున్నట్టు డబ్ల్యూహెచ్‌వో నివేదికలో పేర్కొంది. ప్రపంచ జనాభాలో మూడో వంతు కుటుంబాలు వంట కోసం కలప, బొగ్గు, పేడ, పంటల వ్యర్థాలను వాడుతున్నాయని.. తద్వారా వెలువడే వాయు కాలుష్యంతో ఊపిరితిత్తులు దెబ్బతిని శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నట్టు వెల్లడించింది. పరిశ్రమలు, వాహన, వంటింటి వాయు కాలుష్యం వల్ల మొత్తంగా ఏటా 67 లక్షల మంది శ్వాసకోశ వ్యాధులతో మృత్యువాత పడుతున్నట్లు తెలిపింది.



ఏయే సమస్యలు వస్తున్నాయి?

కలుషిత గాలిలోని సూక్ష్మ ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస సంబంధిత వ్యాధులు తలెత్తుతున్నాయి. వాయు కాలుష్యంతో మరణిస్తున్న వారిలో 32శాతం మంది ఇస్కామిక్ హార్ట్ డిసీజ్‌తో, 23 శాతం మంది గుండెపోటుతో, 21 శాతం లోయర్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్, 19 శాతం క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్‌తో, ఆరు శాతం మంది ఊపిరితిత్తుల కేన్సర్‌తో మరణిస్తున్నట్టు డబ్ల్యూహెచ్‌వో నివేదికలో పేర్కొంది.

వాయు కాలుష్యం నివారణకు ఏం చేయాలి?

- వాయు కాలుష్యాన్ని నివారించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ పలు సూచనలు కూడా చేసింది. తగిన వాయు నాణ్యతా ప్రమాణాలను అనుసరించాలని స్పష్టం చేసింది.
- వాయు కాలుష్య కారక అంశాలను గుర్తించాలి. వాటి నియంత్రణ చర్యలను ప్రభుత్వ యంత్రాంగం నిత్యం పర్యవేక్షించాలి.
- వంటకు అవసరమైన కాలుష్య రహితమైన, నాణ్యమైన ఇంధనాన్ని సమకూర్చాలి. సురక్షితమైన, సామాన్యులకు అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. పాదచారులకు, సైక్లింగ్ ఫ్రెండ్లీ నెట్‌వర్క్ కల్పించాలి.
- వాహన కాలుష్యాన్ని అరికట్టేలా కఠిన చట్టాలు తీసుకుని రావాలి. వాటి అమలును నిత్యం పర్యవేక్షించేలా అధికారయంత్రాంగం పనిచేయాలి.
- పరిశ్రమల వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాల యాజమాన్య నిర్వహణను మరింత పెంచాలి.
- పంట వ్యర్థాలను తగలబెట్టడం ఆపేయాలి. అటవీ అగ్నిప్రమాదాలను అరికట్టాలి.

ఉత్తరాది రాష్ట్రాల్లో సమస్య తీవ్రం



సూక్ష్మరూపాల్లోని కాలుష్యాలు మనుషుల ఆరోగ్యంపైనే కాకుండా పర్యావరణం, జీవవైవిధ్యం, పశుపక్ష్యాదులు, జంతుజాలం, పొలాలు, వ్యవసాయ ఉత్పత్తులపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం మన దేశంలో ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. కానీ దక్షిణాది రాష్ట్రాలు కూడా ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విష వాయువులతోపాటు పీఎం 2.5, పీఎం 10 సూక్ష్మరూపాల్లోని కాలుష్య వ్యాప్తి మనుషుల ఆరోగ్యాన్ని కుంగదీస్తోంది. వాయు కాలుష్యాన్ని తగ్గించే దిశలో ఎవరికి వారు వ్యక్తిగత స్థాయిలో, ప్రభుత్వం, స్వచ్ఛందసంస్థల పరంగా పరిష్కారమార్గాలు ఆలోచించాలి.

\- ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త

హైదరాబాద్‌లోనూ పెరుగుతున్న కాలుష్యం



ఇటీవల సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డేటాను విశ్లేషిస్తూ గ్రీన్‌పీస్ ఇండియా విడుదల చేసిన నివేదికలో.. హైదరాబాద్‌లో పీఎం 10 స్థాయిలు నిర్దేశిత ప్రమాణాల కంటే ఆరేడు శాతం అధికంగా ఉన్నాయి. పరిశ్రమల విస్తరణ, రవాణా పెరగడం, చెత్త తగలబెట్టడం, భారీగా నిర్మాణ కార్యకలాపాల వల్ల వాయు కాలుష్యం పెరుగుతోంది. పర్టిక్యులేట్ మేటర్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, పీఎం 2.5, పీఎం 10 వంటివి ఎక్కువ అవుతున్నాయి. ఇవి ఊపిరితిత్తులపై ప్రభావం చూపి.. శ్వాసకోశ సమస్యలకు కారణమవుతున్నాయి.

\- హరికిషన్ గోనుగుంట్ల, చీఫ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద ఆస్పత్రి

గాలి నాణ్యతను ఎలా నిర్ధారిస్తారు?

గాలి నాణ్యతను 'ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ)'తో కొలుస్తారు. వాతావరణంలో ఒక క్యూబిక్ మీటర్ గాలిలో కెమికల్స్ రియాక్షన్స్‌తో ఏర్పడిన, లేదా దుమ్ము, ధూళి కణాలు, నిర్మాణ ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో వెలువడే కాలుష్యాల (పర్టిక్యులేట్ మేటర్)ను లెక్కించి కొలుస్తారు. గంటకోసారి లేదా 8 గంటలకోసారి కొలవడం ద్వారా సగటు ఏక్యూఐని గుర్తిస్తారు.

టాప్-20 వాయు కాలుష్య నగరాలు

లాహోర్ (పాకిస్తాన్), హోటన్ (చైనా), భివండి, ఢిల్లీ (భారత్), పెషావర్ (పాకిస్తాన్) ఎన్ డీజమేనా (చాద్), దర్భంగా, అసోపూర్, పట్నా, ఘజియాబాద్, ధరెహారా (భారత్), బాగ్దాద్ (ఇరాక్), ఛాప్రా, ముజఫర్‌నగర్ (భారత్), ఫైసలాబాద్ (పాకిస్తాన్), గ్రేటర్ నోయిడా, బహదూర్‌ఘర్, ముజఫర్‌పూర్, ఫరీదాబాద్(భారత్)

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై సీబీఐకి ఫిర్యాదు

- తెలంగాణ పోలీసుల దర్యాప్తుపై నమ్మకం లేదు
- అందుకే సీబీఐని ఆశ్రయించానన్న బాధితురాలు శేజల్



సాక్షి, న్యూఢిల్లీ: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై విచారణ జరిపించాలని బాధితురాలు శేజల్ సీబీఐను ఆశ్రయించారు. గతంలో ఎమ్మెల్యే చిన్నయ్యపై లైంగిక ఆరోపణలు చేసి ఢిల్లీలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ శేజల్ సోమవారం సీబీఐకు ఫిర్యాదు చేశారు. అనంతరం తెలంగాణభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ పోలీసులపై తమకు నమ్మకం లేని కారణంగానే సీబీఐకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అధికారం అడ్డుపెట్టుకుని దుర్గం చిన్నయ్య తమను వేధించారని, ఎమ్మెల్యే వ్యవహారానికి సంబంధించిన ఆధారాలు, ఆడియో టేప్స్, అగ్రిమెంట్ పేపర్లు సీబీఐకు అందించామని తెలిపారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు అయి.. తనకు ఎమ్మెల్యే అనుచరుల నుంచి రక్షణ కల్పించాకే హైదరాబాద్‌కు వెళ్తామని స్పష్టం చేశారు. ఆరిజన్ డెయిరీలో ఎమ్మెల్యే చిన్నయ్య అనుచరులకు వాటా ఇచ్చామని, రైతులను మోసం చేస్తే ఢిల్లీకి ఎందుకు వస్తామని ప్రశ్నించారు. మోసపోయిన రైతులు ఉంటే ముందుకు రావాలని కోరుతున్నా ఎవరూ రావడం లేదన్నారు. చిన్నయ్య తన అధికారం ఉపయోగించి తెలంగాణలో తమపై కేసు పెట్టించారని శేజల్ ఆరోపించారు.

దేశవ్యాప్తంగా బీసీ పోరు!

▶ మొదటి పేజీ తరువాయి

మారబోతోంది. ఆ పాలసీ పేరిట ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫీజులను అడ్డగోలుగా పెంచేశారు. అరకొర ఆదాయ కేటగిరీలో ఉన్న బీసీలు ఈ పెరిగిన ఫీజులతో కేంద్ర విద్యా సంస్థల్లో చదువుకోవడం కష్టమే. ఆ సీట్లు చివరికి అగ్రవర్ణాలకే అందుతాయి. అందుకే ఎన్‌ఈపీలో మార్పులు చేయాలని, ఫీజులు తగ్గించాలని కోరినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం అత్యంత మూర్ఖంగా నిర్ణయం తీసుకుంది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక బీసీలు అన్ని విధాలా నష్టపోయారు. కేంద్రంలో కనీసం బీసీ మంత్రిత్వ శాఖ లేదు. ఎన్‌సీబీసీ చైర్మన్, సభ్యులను సకాలంలో నియమించకుండా కాలయాపన చేసి బీసీల హక్కులతో ఆటలాడుతున్నారు.

కులాల వారీగా జనగణన అవసరం

జనగణనలో కులాల వారీగా లెక్కలు తేల్చాలని ఏళ్లుగా ఉద్యమిస్తున్నాం. అన్ని వర్గాల నుంచి ఈ డిమాండ్ వస్తుండటంతో కేంద్రం జనగణన ప్రక్రియనే వాయిదా వేసింది. జనాభాలో కులాల వారీగా సంఖ్య తేలితే రిజర్వేషన్లు, ఇతర సంక్షేమ పథకాల అమలుకు మార్గం సుగమం అవుతుంది. ఈ అంశం కేంద్ర ప్రభుత్వానికి నచ్చడం లేదు. జనాభాలో అగ్రవర్ణాల సంఖ్య ఎంతో తేల్చకుండానే 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేసింది. బీజేపీ పాలనలో అగ్రవర్ణాలకు ఒక విధంగా, అణగారిన వర్గాలకు ఒక విధంగా న్యాయం ఉంటుందనిపిస్తోంది.



కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ క్రాంతికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, అబ్రహం, కృష్ణమోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత తదితరులు

ధరణితో రాబందులు మాయం

ఇప్పుడు పైరవీకారులు లేరు, దళారులు లేరు: సీఎం కేసీఆర్

సాక్షి, నాగర్‌కర్నూల్/గద్వాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులను దోచుకునే రాబందులు మాయమయ్యాయని.. అలాంటి ధరణిని తీసేస్తామంటూ మళ్లీ దళారులు మొపయ్యారని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రైతుబంధు కింద డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో పడేందుకు కారణమైన ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తారా? అని మండిపడ్డారు. అప్పట్లో దళారుల దయతో వాళ్లు రాసిందే లెక్క, గీసిందే గీతగా సాగేదని.. ధరణితో దళారులు, పైరవీకారులు, పట్వారీలు లేకుండా పోయారని చెప్పారు. మూడేళ్లపాటు కష్టపడి రూపొందించిన ధరణిని బంగాళాఖాతంలో వేయడమంటే ప్రజలను వేసినట్టేనని వ్యాఖ్యానించారు. గతంలో పంట డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూసేవాళ్లమని, ఇప్పుడు రోజుల్లోనే ఖాతాల్లో పడుతున్నాయని చెప్పారు. రిజిస్ట్రేషన్లు సైతం పది నిమిషాల్లో పూర్తయి పట్టా చేతికందుతోందన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నిర్వహించిన ప్రగతి నివేదన సభలో కేసీఆర్ ప్రసంగించారు.

పాలమూరు కళకళలాడుతోంది

గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎందరో మంత్రులుగా పనిచేశారని.. వారు ఎన్నో మాటలు చెప్పినా ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని కేసీఆర్ విమర్శించారు. ఉద్యమ సమయంలో నడిగడ్డ పరిస్థితులను చూసి కన్నీళ్లు పెట్టుకున్నానని గుర్తు చేసుకున్నారు. తుంగభద్ర, కృష్ణా నదుల మధ్య ఉన్నా తాగు, సాగు నీటికి కష్టాలు ఉండేవన్నారు. ఒకప్పుడు ఎండిపోయి ఎడారిని తలపించిన పాలమూరు.. ఇప్పుడు ధాన్యపు రాశులు, కొనుగోలు కేంద్రాలు, హార్వెస్టర్లతో కళకళలాడుతోందన్నారు. గతంలో ఇక్కడ బతకలేక, బతుకులేక వలసపోయారని.. అలాంటిది ఈ రోజు రాయచూర్, బిహార్, జార్ఖండ్ నుంచి మిర్చి, పత్తి ఏరేందుకు మన దగ్గరికి వలస వస్తున్నారని చెప్పారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 14 రోజులకు ఒకసారి మంచినీళ్లు వచ్చేవని.. అలాంటిది ఇప్పుడు రాష్ట్రం వచ్చాక ప్రతి ఇంటికి నల్లా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో పుట్టుక నుంచి చావు వరకు ప్రతి అంశంలో, ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సాయం అందుతోందన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా 20 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నామని చెప్పారు.

గద్వాల జిల్లాకు ప్రత్యేక నిధులు

జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున, 12 మండల కేంద్రాలకు రూ.15 లక్షల చొప్పున, గద్వాల మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, మిగతా మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. జిల్లా సరిహద్దుల్లో మరో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సభలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, రవీందర్‌రావు, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

13 నిమిషాలే ప్రసంగం

గద్వాల బహిరంగ సభలో సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని త్వరగా ముగించారు. సాయంత్రం 6.10 గంటలకు బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్న ఆయన.. 6.13 గంటలకు మాట్లాడటం ప్రారంభించి 6.26 గంటలకు ముగించారు. కాసేపటికే హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయల్దేరారు.

సీఎం సభలో కూచుకుళ్ల

గద్వాల బీఆర్‌ఎస్ సభలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఆయన రెండు రోజుల క్రితం కాంగ్రెస్ నేత మల్లు రవి ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. దీనితో కూచుకుళ్ల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరిగింది. అయితే సోమవారం ఆయన సీఎం కేసీఆర్‌తో కలసి వేదిక పంచుకోవడం గమనార్హం.

ఉద్యోగులు పట్టు వదలొద్దు.. జట్టు చెదరొద్దు..

దేశంలో చాలా రంగాల్లో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని.. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులంతా పట్టు వదలకుండా, జట్టు చెదరకుండా పనిచేయాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతోపాటు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. తర్వాత కలెక్టరేట్‌లో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా తలసరి ఆదాయంతో పాటు విద్యుత్ వినియోగంలో రాష్ట్రం మొదటిస్థానంలో నిలిచిందని వివరించారు. రాష్ట్రంలో మానవీయ కోణంలో పాలన సాగుతోందని.. ఓట్ల కోసం, చిల్లర రాజకీయాల కోసం పథకాలను రూపొందించలేదని చెప్పారు. దేశంలో 90 లక్షల ఎకరాల్లో వరి పండిస్తే.. అందులో తెలంగాణ వాటానే 50 శాతానికిపైగా 56 లక్షల ఎకరాలు అని వివరించారు.

... వెయ్యి కోట్ల కుంభకోణం!

▶ మొదటి పేజీ తరువాయి

వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు హర్కర వేణుగోపాల్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు.

లావాదేవీలు వద్దన్న భూదాన్ బోర్డు

'తిమ్మాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లలో 146 ఎకరాల భూదాన్ భూములున్నాయని అప్పటి కందుకూరు ఎమ్మార్వో 2007లో కలెక్టర్‌కు రాసిన లేఖలో వెల్లడించారు. ఈ భూములను కాపాడాలని అప్పుడు ఎమ్మెల్యే హోదాలో ఇప్పటి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారు. భూదాన్ బోర్డు కూడా ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించవద్దని మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాసింది. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సదరు గ్రామంలోని సర్వే నంబర్లన్నింటినీ నిషేధిత జాబితాలో చేర్చింది..'అని రేవంత్ తెలిపారు.

ధరణి వచ్చిన తర్వాతే...

'2020లో ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిన తర్వాత ఈ భూములను నిషేధిత కేటగిరీ నుంచి తొలగించారు. 2021లో ఎం.శివమూర్తి పేరిట బదిలీ చేశారు. వాటి విలువ రూ.1,000 కోట్లు ఉంటుంది. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో ఉన్నప్పుడు నిషేధిత జాబితాలో ఉన్న భూములు ధరణిలో నిషేధిత జాబితాలో ఎందుకు లేవు? ఈ భూములను కొల్లగొట్టింది కేటీఆర్ అనుచరులే. ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెస్ అంటుంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఎలా రద్దు చేస్తారని ప్రశ్నిస్తోంది అందుకే. తమ వ్యవహారాలు బయటకు వస్తాయనే ఆలోచనతోనే తమకు బంగారు బాతు లాంటి ధరణిని వెనకేసుకు వస్తున్నారు..' అని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు.

ధరణి బాధితులు 20 లక్షల మంది

'రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ధరణి బాధితులయ్యారు. తండ్రి చనిపోతే కొడుకు పేరిట భూమి బదిలీకి కూడా అవకాశం లేకుండా పోయింది. ధరణి రద్దయితే రైతుబంధు, రైతుబీమా రాదంటూ సీఎం హోదాలో కేసీఆర్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. 2018లో ఈ ప్రభుత్వమే రైతుబంధు, రైతుబీమా మొదలుపెట్టింది. అప్పటి నుంచి 2020 వరకు ఈ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. ఆ మూడేళ్లపాటు వచ్చిన రైతుబంధు, బీమా ఇప్పుడు ధరణిని రద్దు చేస్తే ఎందుకు రావు? కాంగ్రెస్ పార్టీ ధరణి లేనప్పుడే 2009–10లో రూ.74 వేల కోట్ల రైతు రుణమాఫీని చేసింది.

విదేశీ కంపెనీ చేతుల్లోకి రైతుల సమాచారం!

కేసీఆర్ రైతులను బెదిరించేలా చేస్తున్న వ్యాఖ్యల వెనుక పెద్ద కుట్ర ఉంది. రాష్ట్రంలోని భూముల వివరాలు, రైతుల సమాచారం అంతా విదేశీ కంపెనీకి వెళ్లింది. ఇలా చేయడం క్రిమినల్ చర్యల పరిధిలోనికి వస్తుంది. ఇప్పుడు ధరణిని రద్దు చేస్తే ఈ బాగోతమంతా బయట పడుతుందనే కేసీఆర్ తదితరులు పెడబొబ్బలు పెడుతున్నారు..'అని రేవంత్ అన్నారు.

కిషన్‌రెడ్డి సెంట్రల్ విజిలెన్స్‌కు లేఖ రాయాలి

'స్వగ్రామంలో భూములు అన్యాక్రాంతమవుతుంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదు? ఆయన వెంటనే సెంట్రల్ విజిలెన్స్ విచారణ కోరుతూ లేఖ రాయాలి. మేము అధికారంలోకి వచ్చాక రంగారెడ్డి, మేడ్చల్, నల్లగొండ జిల్లాల్లో జరిగిన భూలావాదేవీలపై విచారణ జరిపిస్తాం, తప్పులు చేసిన కలెక్టర్లు, సీసీఎల్‌ఏను ఊచలు లెక్కపెట్టిస్తాం.

కేసీఆర్‌కు చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా ధరణిని రద్దు చేసి ప్రజలకు ఉపయోగపడే నూతన సాంకేతిక విధానంతో మరో విధానాన్ని తీసుకువస్తాం. టైటిల్ గ్యారంటీ విధానాన్ని తెస్తాం. రిజిస్ట్రేషన్ చేసి ఫీజు తీసుకుంటున్నప్పుడు ప్రభుత్వం ఆ భూముల విషయంలో జవాబుదారీతనంగా ఉండాలనేది మా విధానం..'అని రేవంత్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు వస్తాయని అంటున్న కేసీఆర్‌కు ఊచలు లెక్కపెట్టే కష్టాలు మాత్రం వస్తాయని, చర్లపల్లి జైల్లో ఆయనకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని, బిడ్డ, అల్లుడు, కొడుకు అందరూ అక్కడే ఉండవచ్చని ఎద్దేవా చేశారు.

ఐఐటీ విద్యార్థులకు విదేశాల రెడ్ కార్పెట్

▶ మొదటి పేజీ తరువాయి

విదేశాల బాట పడుతున్నారు.

- భారత ఐఐటీయన్ల ప్రధాన గమ్యస్థానం అమెరికా. విదేశాలకు వెళుతున్న ఐఐటీయన్లలో 65 శాతం అమెరికాకే వెళ్తున్నారు. వారిలో 85 శాతం మంది అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి అక్కడే ప్రముఖ కంపెనీల్లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి సీఈవోల వరకు బాధ్యతలు చేపడుతున్నారు.
- ప్రపంచంలో 50 విదేశీ విద్యా సంస్థల విద్యార్థులకు బ్రిటన్ హైపొటెన్షియల్ ఇండివిడ్యువల్ వీసాలు జారీ చేస్తోంది. వారిలో భారత ఐఐటీ విద్యార్థులే మొదటి స్థానంలో ఉన్నారు.
- భారత ఐఐటీ అంటే విదేశీ సంస్థలకు ఎంతటి క్రేజ్ ఉందో చెప్పడానికి వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయమే (బీహెచ్‌యూ) తార్కాణం. బీహెచ్‌యూకు ఐఐటీ హోదా కల్పించిన తరువాత ఆ సంస్థలోని విద్యార్థులకు విదేశాల్లో ప్లేస్‌మెంట్స్ ఏకంగా 540 శాతం పెరగడం విశేషం.

ఎడ్‌సెట్‌లో 98.18 శాతం అర్హత

బాలికలదే పైచేయి
- వినీషకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్
- ఫలితాలు విడుదల చేసిన ప్రొఫెసర్ లింబాద్రి

సాక్షి, హైదరాబాద్, తాండూరు టౌన్: వివిధ యూనివర్సిటీల పరిధిలోని రెండేళ్ళ బీఈడీ కోర్సులో ప్రవేశానికి గత నెల నిర్వహించిన తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలను ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఇందులో 98.18 శాతం మంది అర్హత సాధించినట్టు ఆయన ప్రకటించారు. అర్హత పొందిన వారిలో చాలా మందికి సీటు లభించే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18,350 బీఈడీ సీట్లున్నాయని, గత ఏడాది 13,756 మంది మాత్రమే చేరారని లింబాద్రి వివరించారు. ఈ ఏడాది ఎడ్‌సెట్‌కు 31,725 మంది రిజిస్టర్ చేసుకోగా, 27,495 మంది పరీక్ష రాశారని, వీరిలో 26,994 మంది అర్హత సాధించారని వివరించారు. ఎడ్‌సెట్‌లోనూ మహిళలదే పైచేయి కావడం విశేషమన్నారు. బాలురు 5,059 మంది అర్హత పొందితే, బాలికలు 21,935 మంది ఎడ్‌సెట్‌లో క్వాలిఫై అయినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు అర్హత మార్కులు 25 శాతం, ఇతరులకు 38 శాతంగా నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. మొత్తం 150 మార్కులకు పరీక్ష జరిగిందనీ త్వరలోనే ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ చేపడతామని చెప్పారు.


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి

తాండూరు విద్యార్థినికి ఫస్ట్ ర్యాంక్



ఎడ్‌సెట్‌లో తాండూరు పట్టణం గ్రీన్‌సిటీకి చెందిన విద్యార్థిని గొల్ల వినీష స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. 150 మార్కులకు గాను 117.4 మార్కులు (హాల్ టికెట్ నంబర్ 2335105050) సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. స్థానిక సింధూ డిగ్రీ కళాశాలలో ఎంపీసీ (కంప్యూటర్ సైన్స్) తృతీయ సంవత్సరం చదువుతోంది. కూతురుకు స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడంపై తండ్రి మొగులప్ప(ప్రభుత్వ ఉపాధ్యాయుడు) సంతోషం వ్యక్తం చేశారు. తనకు టీచర్ వృత్తి అంటే చాలా ఇష్టమని ఫస్ట్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందని వినీష తెలిపింది.

టాపర్స్ వీరే...

పేరు	జిల్లా	మార్కులు
గొల్ల వినీషా	వికారాబాద్	117.453624
నిషాకుమారి	హైదరాబాద్	117.011152
ఎం. సుషీ	హైదరాబాద్	114
విశాల చంద్రశేఖర్	జగిత్యాల	113
ఆకోజు తరుణ్‌చంద్	పెద్దపల్లి	112.389165
తంపుల ప్రశాంత్	ఆదిలాబాద్	112.382837
మహ్మద్ షరీఫ్	రంగారెడ్డి	111
కుసుమ వినయ్‌కుమార్	కోనసీమ, ఏపీ	110.825309
ఎం. అరుణ్‌కుమార్	ములుగు	110.289165
ఎ. లక్ష్మీ గాయత్రి	హైదరాబాద్	110.389165

ఎడ్‌సెట్ అభ్యర్థుల అర్హత ఇలా...

	పురుషులు	మహిళలు	మొత్తం
దరఖాస్తులు	6009	25716	31725
పరీక్ష రాసింది	5095	22400	27495
అర్హత సాధించింది	5059	21935	26994
అర్హత శాతం	99.29	97.92	98.18

క్లుప్తంగా...

రేపట్నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి, హైదరాబాద్: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 14 నుంచి 22 వరకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.20 గంటల వరకు జరుగుతాయని విద్యాశాఖ తెలిపింది. సైన్స్ సబ్జెక్టుకు మరో 20 నిమిషాల అదనపు సమయం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 71,681 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం మొత్తం 259 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇంటర్ 'సప్లిమెంటరీ'కి 8 వేల మంది గైర్హాజరు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి మొదలయ్యాయి. తొలిరోజు పరీక్షకు 93,008 మంది హాజరుకావాల్సి ఉండగా, 84,835 మంది హాజరయ్యారు. 8,173 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది. మహబూబ్‌నగర్‌లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ముగ్గురు పట్టుబడినట్టు పేర్కొంది.

టీవీవీపీ జేఏసీ చైర్మన్‌గా డాక్టర్ వినయ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) జేఏసీ చైర్మన్‌గా డాక్టర్ వినయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఆ పదవిలో డాక్టర్ రవూఫ్ ఉండగా, అతను రాజీనామా చేయడంతో వినయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఆయన వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యునిగా పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని ఈ సందర్భంగా జేఏసీ సమావేశం తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.

తెరుచుకున్న బడి..

హాస్టళ్లు తెరవకపోవడంతో రాని దూరప్రాంత విద్యార్థులు
- రాష్ట్రంలో ఇంకా మండుతున్న ఎండలు
- 49% హాజరు నమోదు
- మరో రెండు, మూడురోజులు ఇదే పరిస్థితి!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. విద్యార్థులు బ్యాగులు భుజాన వేసుకుని బడిబాట పట్టారు. అయితే హాస్టళ్లు ఇంకా పూర్తి స్థాయిలో తెరవకపోవడంతో దూర ప్రాంతాల విద్యార్థులు చాలావరకు స్కూళ్లకు హాజరు కాలేదు. ఎండలు ఇంకా తీవ్రంగా ఉండటం, ఊళ్లకు వెళ్లినవారు తిరిగి రాకపోవడంతో తరగతులు పలుచగా కన్పించాయి. తొలిరోజు 49 శాతం హాజరు నమోదైనట్టు విద్యాశాఖ గుర్తించింది. మరో రెండు, మూడురోజుల వరకూ ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

20న పుస్తకాల పంపిణీ, రాగిజావ షురూ

ఈనెల 20 నుంచి స్కూళ్లలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే రోజున అన్ని పాఠశాలల్లో కొత్త పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని కూడా నిర్ణయించినట్లు సమాచారం. కొత్తగా రాగిజావను కూడా విద్యార్థులకు అందించనున్నారు. ఈ నేపథ్యంలో 20వ తేదీ నాటికి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని హెచ్‌ఎంలకు అధికారులు అంతర్గత ఆదేశాలిచ్చారు. మరోవైపు ఈనెల 1వ తేదీ నుంచే చాలావరకు ప్రైవేటు స్కూళ్లు తెరుచుకున్నాయి. ప్రాథమిక తరగతుల్లో బోధన కూడా మొదలైనట్లు చెబుతున్నారు. ప్రైవేటు స్కూళ్ల వాహనాలు మారుమూల గ్రామాలకు సైతం వెళ్ళడం, విద్యార్థులను తీసుకురావడం కన్పించింది.



సంఘాల తప్పుడు ప్రచారంపై ఆరా...

ప్రభుత్వ స్కూళ్ళకు విద్యార్థులు హాజరుకాకుండా కొన్ని టీచర్ల సంఘాలే అడ్డంకులు కల్పించినట్టు విద్యాశాఖ గుర్తించింది. వాస్తవానికి ఎండలు ఇంకా తీవ్రంగానే ఉన్నాయని, సెలవులు పొడిగించాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో సెలవులు పొడిగించినట్టు ఆదివారం తప్పుడు జీవోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. గత ఏడాది భారీ వర్షాల కారణంగా ప్రత్యేక సెలవులు ఇచ్చిన జీవోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టడంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఈ ప్రచారం వెనుక ఎవరున్నారనే విషయాన్ని ఆరా తీస్తున్నారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాలను ఇప్పటికే గుర్తించామని, వారిపై కఠిన చర్యలు ఉంటాయని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారని, ఇందుకు బాధ్యులైన వారి వివరాలు ఇవ్వాలని ఆమె ఆదేశించినట్లు తెలిసింది. దీంతో విద్యాశాఖ అదనపు డైరెక్టర్ దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిసింది.

రాష్ట్ర బీజేపీలో గందరగోళం!

ఎన్నికల ముంగిట పరిణామాలపై నేతలు, కేడర్‌లో అయోమయం
- అన్ని విషయాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్న నాయకులు
- ఇటీవలి సమావేశాలపై జాతీయ నాయకత్వం ఆరా



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాష్ట్ర బీజేపీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, కొందరు ముఖ్య నేతలు వ్యవహరిస్తున్న తీరుతో అయోమయ పరిస్థితులు తలెత్తుతున్నాయని పార్టీ నేతలు, కేడర్ వాపోతున్నారు. మరో నాలుగైదు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా కొందరు నేతలు ప్రత్యేకంగా సమావేశం కావడం గందరగోళానికి గురిచేస్తోందని అంటున్నారు. ముఖ్యంగా గత 2, 3 ఏళ్ల కాలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన నేతలు ఎక్కువగా కంగారు పడుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ నియామకం, ఇతర సంస్థాగత మార్పులు జరుగుతాయంటూ విస్తృత ప్రచారం జరగడంతో సెగ రాజుకుంది. ఈ నేపథ్యంలో కొందరు సీనియర్లు భేటీ కావడం పార్టీ రెండు వర్గాలుగా చీలిందన్న అభిప్రాయానికి తావిస్తోందని పలువురు నేతలు, కార్యకర్తలు అంటున్నారు. పార్టీకి సంబంధించిన వరుస పరిణామాలపై వెంటనే స్పష్టతనిచ్చి గందరగోళానికి తెరదించాలని నాయకులు కోరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కార్యకర్తలు అయోమయానికి గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రూపు సమావేశాలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని కూడా కొందరు జాతీయ నాయకత్వాన్ని కోరినట్లు సమాచారం. కాగా ఈ నెల 15న ఖమ్మంలో అమిత్ షా బహిరంగ సభ ఉన్నందున ఆలోగా జాతీయ నాయకత్వం స్పష్టతనిస్తుందా? అన్నది పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీలు సునీల్ బన్సల్, శివప్రకాశ్, తరుణ్ చుగ్, అరవింద్ మీనన్ లాంటి వారికి కొందరు ఫోన్లు చేసి ప్రచారంలో వాస్తవికతపై స్పష్టత కోరినట్టు కూడా తెలుస్తోంది.

ఆ సమావేశాల వెనుక ఎవరున్నారు?

రాష్ట్ర పార్టీలో పరిణామాలు, కొన్నిరోజుల క్రితం అసంతృప్త నేతలు, తాజాగా కొందరు ముఖ్యనేతలు వేర్వేరుగా సమావేశం కావడంపై జాతీయ నాయకత్వం ఆరా తీసినట్టు పార్టీవర్గాల సమాచారం. ఈ సమావేశాల నిర్వహణ వెనుక ఎవరెవరున్నారు? వారు ఏ విషయంలో అసంతృప్తితో ఉన్నారు? రాష్ట్ర పార్టీలో కీలక సంస్థాగత మార్పులు జరగవచ్చనే ప్రచారంపై వారి అభిప్రాయాలు ఏమిటి? అనే అంశాలపై సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది.

రంగారెడ్డితో డీకే అరుణ చర్చలు

ఇదిలా ఉంటే పార్టీలో చేరికలకు సంబంధించి మాజీ ఎమ్మెల్సీ మాఖం రంగారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలతో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ చర్చలు జరిపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి సన్నిహితుడైన రంగారెడ్డితో పాటు మరికొందరు బీజేపీలో చేరే అవకాశాలున్నాయని అంటున్నారు.



ధ్రువీకరణ కోసం పోటెత్తారు!

రూ.లక్ష ఆర్థిక సాయంకోసం 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో అందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయాలకు పోటెత్తారు. ఇందుకోసం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక మీ సేవ కేంద్రం ఏర్పాటుచేసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం కిటకిటలాడింది. ఒకేరోజు 350కిపైగా కుల, 650కి పైగా ఆదాయ ధ్రువీకరణ పత్ర దరఖాస్తులు అందాయి. 300కి పైగా సర్టిఫికెట్లు జారీ కోసం అప్‌లోడ్ చేసినట్లు తహసీల్దార్ ఎం.శైలజ వెల్లడించారు. ప్రజలతో కార్యాలయం కిక్కిరిసిపోవడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాల్సి వచ్చింది. – ఖమ్మం అర్బన్ / స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

'లక్ష'కు అర లక్ష దరఖాస్తులు

- కులవృత్తిదారులకు సర్కారు రూ.లక్ష ఆర్థిక సాయం
- ఈ నెల 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడి తరగతుల్లోని కులవృత్తి దారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు 53 వేల మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించినట్లు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బీసీ కులవృత్తిదారుల ఆర్థిక సాయంపైన సోమవారం సచివాలయంలో మంత్రి గంగుల సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కులవృత్తికి ఉపయోగపడే ముడిసరుకు, పనిముట్లు కొనుగోలు చేసేందుకు గానూ ఎలాంటి బ్యాంకు లింకేజీ లేకుండా, తిరిగి చెల్లించే అవసరం లేకుండా ప్రభుత్వం రూ.లక్ష సాయం ఇస్తోందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ పథకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. https://tsobmms.cgg.gov.in/ వెబ్‌సైట్ తెరిచి నేరుగా దరఖాస్తు సమర్పించవచ్చని చెప్పారు. ఈ పథకం కింద లబ్ధి కోసం ఎవరినీ ప్రత్యక్షంగా, పరోక్షంగా సంప్రదించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆదాయ పత్రాలు 2021 ఏప్రిల్ నుంచి జారీ చేసినవి చెల్లుబాటవుతాయని, జిల్లా కలెక్టర్లు సైతం అవసరార్థుల ఇన్‌కం సర్టిఫికెట్ల జారీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి ఆదేశించారు. చాలా సరళంగా ఉన్న ఈ దరఖాస్తు ఫారంను దరఖాస్తుదారులు తమ స్మార్ట్ ఫోన్ల నుంచి కూడా సమర్పించవచ్చన్నారు.

బీసీ వసతిగృహాల్లో అడ్మిషన్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వసతిగృహాల్లో అడ్మిషన్‌కు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి గంగుల కమలాకర్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 703 బీసీ ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయని, ఈ హాస్టళ్లలో సీట్ల భర్తీ ఆన్‌లైన్ పద్ధతిలోనే చేపడతామన్నారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ https://bchostels.cgg.gov.inను మంత్రి సోమవారం సచివాలయంలో ప్రారంభించారు. వెబ్‌సైట్‌లో సూచించిన ఆన్‌లైన్ అడ్మిషన్ ఫారాన్ని పూరించి దరఖాస్తు సమర్పించగానే ఎవరి ప్రమేయం లేకుండా వివరాలు వెరిఫికేషన్ చేసుకొని ప్రవేశానికి అవకాశం ఏర్పడుతుందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, టాడీ టాపర్స్ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి, బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సంధ్య ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 2న స్టాఫ్‌నర్స్ పరీక్ష

- కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించాలని నిర్ణయం
- హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌లో సెంటర్లు
- 3 సెషన్లలో పరీక్ష...
- 5,204 పోస్టులకు 40,926 మంది దరఖాస్తు



సాక్షి, హైదరాబాద్: స్టాఫ్‌నర్స్ పోస్టులకు ఆగస్టు రెండో తేదీన కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించాలని మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నిర్ణయించింది. ఈ మేరకు బోర్డు సభ్యకార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. 5,204 స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ రిక్రూట్‌మెంట్ కోసం ఓఎంఆర్ ఆధారిత పరీక్షకు బదులుగా సీబీటీ పద్ధతిలో నిర్వహిస్తారు. ఈ పరీక్షలో 80 బహుళ ఎంపిక ప్రశ్నలు ఉంటాయి. 80 నిమిషాల గడువు విధించారు. పరీక్ష ఇంగ్లిష్‌లో మాత్రమే జరుగుతుంది. 5,204 పోస్టులకు 40,926 మంది దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ సెంటర్లలో పరీక్ష జరుగుతుంది. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సామర్థ్యంకంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నందున, పరీక్షను మూడు షిఫ్టులలో నిర్వహిస్తారు. వివిధ షిఫ్టులలోని ప్రశ్నపత్రాల క్లిష్టత స్థాయిలలోని వైవిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల స్కోర్‌లను సాధారణీకరించిన తర్వాత మెరిట్ జాబితాను తయారు చేస్తారు. కంప్యూటర్ ద్వారా అభ్యర్థులకు షిఫ్టుల కేటాయింపు జరుగుతుంది. ఒక్కో షిఫ్టులో 13,642 మంది పరీక్ష రాస్తారు. దరఖాస్తుదారులు వచ్చే నెల 23వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాంట్రాక్ట్/ఔట్‌సోర్స్ సర్వీస్ కాలానికి వచ్చిన వెయిటేజ్ పాయింట్లు, సీబీటీ పరీక్షలో పొందిన మార్కులను ఆధారం చేసుకుని మెరిట్ జాబితా తయారుచేస్తారు.

ఇతర ముఖ్యాంశాలు...

- → ప్రతి షిఫ్ట్‌కి ప్రశ్నపత్రం వేర్వేరుగా ఉన్నందున, ప్రశ్నపత్రాల క్లిష్టత స్థాయిలు కొద్దిగా మారే అవకాశం ఉంది. అయితే అన్ని షిఫ్టులలోని ప్రశ్నపత్రాలు ఒకే ప్రమాణంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు.
- → మల్టిపుల్ షిఫ్టుల వల్ల ఏ విద్యార్థికి ప్రత్యేకంగా ప్రయోజనం జరగకుండా చూసుకోవడం సాధారణీకరణ ప్రధాన లక్ష్యం. సాధారణీకరణ ప్రక్రియ అన్ని షిఫ్టులలో అభ్యర్థులందరినీ తులనాత్మక స్థాయిలో తీసుకువస్తుంది. ఈ ప్రక్రియ కారణంగా, ఈజీ షిఫ్ట్ మార్కులు స్వల్పంగా తగ్గవచ్చు. హార్డ్ షిఫ్ట్ మార్కులు స్వల్పంగా పెరగవచ్చు.
- → దరఖాస్తుదారులు ఇచ్చిన ప్రాధాన్యం ఆధారంగా పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారు. → అభ్యర్థులకు పరీక్ష పద్ధతిపై అవగాహన రావడం కోసం మాక్ టెస్టులు అందుబాటులో ఉంటాయి. వచ్చేవారం నుంచి మాక్ ప్రశ్నపత్రాలు వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటాయి.
- → మొదటి సెషన్ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 10.20 గంటల వరకు జరుగుతుంది. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.50 వరకు జరుగుతుంది. మూడో సెషన్ పరీక్ష సాయంత్రం 4 గంటల నుండి 5.20 గంటల వరకు జరుగుతుంది.

స్టాఫ్‌నర్సు రాత పరీక్ష సిలబస్ ఇదీ..

- ఫస్ట్ ఎయిడ్, సైకాలజీ, సోషియాలజీ
- ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్
- కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్
- ఎన్విరాన్‌మెంటల్ హైజీన్
- హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్
- న్యూట్రిషన్, మెడికల్ సర్జికల్ నర్సింగ్
- మెంటల్ హెల్త్ నర్సింగ్
- చైల్డ్ హెల్త్ నర్సింగ్
- మిడ్ వైఫరీ గైనకాలజికల్ నర్సింగ్
- గైనకాలజికల్ నర్సింగ్
- కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్
- నర్సింగ్ ఎడ్యుకేషన్
- ఇంట్రడక్షన్ టు రీసెర్చ్
- ప్రొఫెషనల్ ట్రెండ్స్ అండ్ అడ్జస్ట్‌మెంట్
- నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వార్డ్ మేనేజ్‌మెంట్

గవర్నర్ లక్ష్మణరేఖ దాటుతున్నారు: నారాయణ

సత్తుపల్లిటౌన్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై బీజేపీ నాయకురాలిగా వ్యవహరిస్తూ లక్ష్మణరేఖ దాటి రాజకీయాలు మాట్లాడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. కొత్తగూడెం నుంచి విజయవాడ వెళ్తున్న ఆయన సోమవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాదర్బార్లు నిర్వహించడం, పరిధిని మించి పెత్తనం చెలాయించాలని ప్రయత్నం చేస్తూ అతిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

తన నోటినీ, నాలుకనూ కాచుకున్నవాడు
సమస్యల నుంచి తనను తాను కాపాడుకుంటాడు.
– జుడాయిజం

సాక్షి

మంగళవారం, 13 జూన్ 2023

ఉపేక్షించలేని ప్రదర్శన!

చూడడానికి అది ఆరు సెకన్ల వీడియోనే కావచ్చు. కానీ, సోషల్ మీడియాలో చక్కర్లుకొట్టిన ఆ వివాదాస్పద వీడియో ఇప్పుడు రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించే పరిస్థితి తెచ్చింది. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీని స్వయంగా ఆమె అంగరక్షకులే పొట్టనపెట్టుకున్న ఘట్టాన్ని సమర్థిస్తూ రూపొందించిన ప్రదర్శన శకటం ఒకటి కెనడాలోని బ్రాంప్టన్ నగరవీధుల్లో తిరిగిన వైనం భారత్, కెనడాల్లో విస్తృత చర్చ రేపింది. వేర్పాటువాద ఖలిస్తాన్ మద్దతుదారుల ఈ శకట ప్రదర్శన ఏ రకంగా చూసినా ఆక్షేపణీయమే. భారత వ్యతిరేక వేర్పాటువాద, తీవ్రవాద శక్తులు బలం పుంజుకుంటున్న వైనానికి ఈ ప్రదర్శన మరో ఉదాహరణ. మన దేశ రాజకీయ పక్షాలన్నీ ముక్తకంఠంతో కెనడా ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టాయి. క్షమాపణ కోరాయి. కెనడా సైతం వెంటనే విచారం వ్యక్తం చేసింది కానీ, ఆ మాట సరిపోతుందా? భారత్‌తో సత్సంబంధాలు కొనసాగాలని ఆ దేశం నిజంగా కోరుకుంటే, చేయాల్సింది చాలానే ఉంది.

అమృత్‌సర్ స్వర్ణదేవాలయంలో దాగిన సిక్కు తీవ్రవాదుల ఏరివేత కోసం 1984లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ వివాదాస్పద సైనిక చర్య 'ఆపరేషన్ బ్లూస్టార్'కు దిగడం, అనంతరం కొన్నాళ్ళకు సొంత బాడీ గార్డ్‌లే విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఆమెను పొట్టనపెట్టుకోవడం చరిత్రలో మహా విషాదం. ఆపరేషన్ బ్లూస్టార్ 39వ వార్షికోత్సవ సందర్భాన రెండు రోజుల ముందే జూన్ 4న కెనడాలో ఈ 5 కిలోమీటర్ల ప్రదర్శన శకటాల కవాతు జరిగింది. ప్రదర్శనలు జరిపే స్వేచ్ఛ కెనడా ప్రభుత్వం తన పౌరులకు ఇవ్వవచ్చు. కానీ, ఆ శకటంపై సిక్కు గార్డులు తుపాకీలు ఎక్కుపెట్టగా, చేతులు పైకెత్తి, తెల్లచీరలో ఎర్రటి రక్తపు మోడుగా మారిన మహిళ (ఇందిర) బొమ్మ పెట్టి, 'దర్బార్ సాహిబ్‌పై దాడికిది ప్రతీకారం' అంటూ వెనకాలే పోస్టర్ ప్రదర్శించడం సహించరానిది. దారుణహత్యను సైతం ప్రతీకారంగా పేర్కొంటున్న ఈ ప్రదర్శనను అనుమతించే సరికి పొరుగుదేశ ప్రధాని హత్యను సమర్థిస్తున్నవారిని కెనడా వెనకేసుకొస్తోందని అనిపిస్తుంది.

పంజాబ్‌లో తీవ్రవాదం తారస్థాయిలో ఉన్నరోజుల్లో కెనడా, అమెరికా తదితర దేశాలు ఈ వేర్పాటువాదులకు ఆశ్రయం కల్పించాయి. విదేశాల్లో స్థిరపడ్డ వేర్పాటువాదులు అక్కడ నుంచి భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్నే సవాలు చేస్తున్నారు. అక్కడ నుంచి రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ, వేర్పాటువాదానికి నిధులు సమకూరుస్తూ, ఖలిస్తాన్ ఉద్యమానికి ఊపిరులూదుతున్నారు. అదే ఇప్పుడు పెద్ద సమస్య అయింది. భారత వ్యతిరేక రిఫరెండమ్‌లు, కార్యక్రమాలు జరపడమే కాదు... హిందూ ఆలయాలపై దాడులు, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్ లాంటి దేశాల్లో భారతీయులపై హింసాకాండ ఇటీవల తరచూ సంభవిస్తున్నాయి. ఈ ఏడాది బ్రిటన్‌లో భారత హైకమిషన్ కార్యాలయంలో ఖలిస్తానీలు పాల్పడ్డ భద్రతా ఉల్లంఘన ఘట్టం లాంటివి ఆందోళన పెంచుతున్నాయి. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో తాజా శకట ప్రదర్శన పరాకాష్ఠ.

చిత్రం ఏమిటంటే – భారత్‌లో, మరీ ముఖ్యంగా అమృత్‌సర్‌లో ఆపరేషన్ బ్లూస్టార్ స్మరణోత్సవాలు ఏళ్ళు గడిచేకొద్దీ హేతుబద్ధంగా మారాయి. పంజాబీలు పాత చేదు జ్ఞాపకాలను వెనక్కినెట్టి, చాలా ముందుకు వచ్చారు. శాంతిని కోరుకుంటున్నారు. అకాల్‌తఖ్త్ సైతం ఈ ఏడాది మాదక ద్రవ్యాలు, ఇతర సామాజిక రుగ్మతలతో సతమతమవుతున్న గ్రామాల్లో సంస్కరణ ఉద్యమానికి పిలుపునిచ్చింది. పంజాబ్‌లో పరిస్థితులు ఇలా ఉంటే, పరాయిగడ్డ మీది సిక్కులు వేర్పాటువాద ఉగ్రవాదానికి నారుపోసి, నీరు పెట్టాలనుకోవడం శుద్ధ తప్పు. కెనడాలో దాదాపు 2 శాతం జనాభా (దాదాపు 8 లక్షలు) ఉన్న సిక్కుల్ని ఓటు బ్యాంకుగా చూస్తున్న ఆ దేశ నేతలేమో ఖలిస్తానీల్ని లాలించి, బుజ్జగిస్తున్నారు. సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సైతం సిక్కు ఓటర్లను ఆకట్టుకొనేందుకు గతంలో అధికారిక నివేదికల నుంచి ఖలిస్తానీ తీవ్రవాద ప్రస్తావనలను సైతం తొలగించిన రకం. 2018లో భారత పర్యటనకు వచ్చినప్పుడు గతంలో భారత మంత్రిపై హత్యాయత్నం చేసిన ఖలిస్తానీ నిందితుడితోనే కలసి ఫోటోలు దిగడం వివాదాస్పదమైంది.

1985 ప్రాంతంలో టొరంటో నుంచి బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని ఖలిస్తానీ తీవ్రవాదులు పేల్చివేయగా, అందులోని 329 మందీ మరణించిన ఘటనను కెనడా నేతలు మర్చిపోయారా? ఆ మృతుల్లో అత్యధికులు కెనడియన్లే అయినా, ఓటుబ్యాంక్ లెక్కలతో దాన్ని ఇప్పటికీ భారతదేశానికి సంబంధించిన విషాదంగానే పరిగణిస్తున్న వైనాన్ని ఏమనాలి? పాలు పోస్తున్న పాము రేపు తమ చేతినే కాటు వేయదన్న నమ్మకం ఏముంది? ఇప్పటికైనా కెనడా కళ్ళు తెరవాలి. ప్రజాస్వామ్యం, బహుళ జాతీయతలకు తమ దేశం ప్రతీక అని జబ్బలు చరుచుకొంటూ ప్రజాస్వామ్యం, శాంతి, సౌభ్రాత్రం, చట్టబద్ధ పాలనపై భారత్‌కు తరచూ ఉపదేశాలిచ్చే ట్రూడో ముందు తమ పెరట్లో జరుగుతున్నదేమిటో తెలుసుకోవాలి. బోలెడంత భవిష్యత్తున్న భారత, కెనడా వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాల్లో కాలిముల్లుగా తయారైన ఖలిస్తాన్ లాంటి అంశాలపై నిర్ద్వంద్వమైన అవగాహనకు రావాలి. భారత విచ్ఛిన్నాన్ని కోరుతున్న శక్తులపై కఠినంగా వ్యవహరించాలి. మన ప్రభుత్వం కూడా ఈ విషయంలో కెనడాపై దౌత్య, రాజకీయ ఒత్తిడి పెంచాలి. విద్వేషం వెదజల్లే వారిని నయానో, భయానో వంచాలి. ఒక్క కెనడాలోనే కాక వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న ఖలిస్తానీ నిరసనలపై దృష్టి సారించి, విస్తృత దౌత్య వ్యూహంతో వాటిని మొగ్గలోనే తుంచాలి. ఇంటా, బయటా మరో ఆపరేషన్ బ్లూస్టార్ అవసరం రాకుండా చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.దశమి ప.11.45 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** రేవతి ప.3.55 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.55 వరకు, తదుపరి రా. 10.54 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** ప.1.40 నుండి 3.12 వరకు.

సూర్యోదయం: 5.28
సూర్యాస్తమయం: 6.30
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

తప్పిన రుతువులు

నైరుతి రుతు పవనాల్ని ఎందుకు ఆహ్వానిస్తాం? దేశంలో వ్యవసాయ పనులకు ఈ సాధారణ వర్షపాతం అత్యంత కీలకం కాబట్టి. మన నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం పైగా దీనిపైనే ఆధారపడి ఉంది కాబట్టి. అందుకే 'స్వాతివానకు ముచ్చెపు చిప్ప' ఎదురుచూసినట్టే పంట పొలాలు నైరుతి రుతుపవనాల కోసం పడిగాపులు పడతాయి. కానీ రుతువులు గతి తప్పాయి. ఏది శరత్కాలమో, ఏది హేమంతమో, ఏది వసంతమో వెతుక్కోవలసిన పరిస్థితిలో ఉన్నాం.

రెండోమాట



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ఆ రోజులు ఏమైపోయాయో? వందేళ్లలోనే రుతువులన్నీ తారుమారై పోయాయి. వేసవి కాలానికీ, వర్షాకాలానికీ భేదం కనుమరుగైంది. ఏది శరత్కాలమో, ఏది హేమంతమో, ఏది వసంతమో వెతుక్కోవలసిన పరిస్థితిలో ఉన్నాం. శ్రీనాథుడు 'కాలచక్రం' స్తంభించిపోతే లోకం ఎలా ఉంటుందో చెబుతూ– ''ఇది సంజ, ఇది రాత్రి, ఇది పగలు అనే సమయాలే క్రమంగా గాడి తప్పిపోయి కొన్ని దేశాలు ఎండలతో కుమిలితే, కొన్ని చలితో కుంగిపోతాయి'' అన్నాడు. వసంతం ఆనందదాయకమైతే, ఆ తర్వాత వచ్చే వర్ష రుతువు సకల ప్రాణికోటికి జీవనాధారం. అందుకే అనేది – వేసవి నుంచి జనాలను కాపాడి రక్షించేది వర్ష రుతువు అని! బహుశా అందుకే, పల్నాటి చరిత్రలో బ్రహ్మనాయుడు కార్యంపూడి యుద్ధరంగాన్ని పవిత్రం చేయడానికే శ్రీనాథుడు వర్షం కురిపించాల్సి వచ్చింది.

నైరుతి రుతుపవనాల్ని మనం ఎందుకు ఆహ్వానిస్తాం? దేశంలో వ్యవసాయ పనులకు ఈ సాధారణ వర్షపాతం అత్యంత కీలకం కాబట్టి. మన నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం పైగా దీనిపైనే ఆధారపడి ఉంది కాబట్టి. దేశవ్యాప్తంగా విద్యుచ్ఛక్తి ఉత్పత్తికీ, తాగునీటికీ అవసరమైన జలాశయాల్ని (రిజర్వాయర్లు) నింపడానికి ఈ వర్షపాతం కీలకం. అందుకే నైరుతీ రుతుపవనాలను దేశ ఆహార భద్రతకూ, ఆర్థిక స్థిర జీవితానికీ కీలకంగా భావిస్తాం. 'స్వాతివానకు ముచ్చెపు చిప్ప' ఎదురు చూసినట్టే పంట పొలాలు నైరుతి రుతుపవనాల కోసం పడిగాపులు పడతాయి. గత వందేళ్లలో లేని గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ ఏడాది పొడవునా సగటున 45 డిగ్రీలకు పైగానే నమోదయ్యాయి. ఇదిగో, రేపోమాపో నైరుతీ రుతుపవనాలు కేరళకు తాకి జీవకోటికి ప్రాణధారలు అందిస్తాయని ఆశతో ఎదురుచూస్తున్న క్షణాల్లోనే 'బిపర్‌జాయ్' తుపాను భీకరంగా దూసుకువచ్చి రుతుపవనాలను మరి కొన్ని రోజులు వెనక్కి నెట్టేసింది.

ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల్ని మన ప్రాచీనులు చవి చూడలేదా, తట్టుకోలేదా అంటే, తట్టుకున్నారు. చివరకు మనం నిత్యం కొలిచే శివుడు సహితం ఎంతగా కైలాసాన్ని జీవన కేంద్రంగా మలచుకున్నా మంచుకు తట్టుకోలేక భూమిమీద ఉన్న చెట్ల నీడనే ఆశ్రయించాల్సి వచ్చింది. వేసవి పగళ్లు దీర్ఘములవడం వల్ల 'సర్వ జనులకు అసహ్యములయెయ్యను దారుణంబులై' అని మొత్తుకున్నాడు నన్నయ. పింగళి సూరన తన కాలంనాటి 'ఉరుముల భీషణ ఘోషణ'ను వినిపించాడు. అయితే రుతువుల రాణి అయిన వసంత కాలాన్ని రుతురాజుగా పరిగణించిన ప్రాచీన కవి 'ఋతుసుహార'మనే కావ్యంలో వసంతాన్ని రుతురాజని తను ఎందుకు పిలవాల్సి వచ్చిందో శృంగారపరంగా వర్ణించి తృప్తి చెందాడు. ఆ సమయంలో తామరపూవులో ఉన్న మగతేటి తన ప్రియురాలికి ఇష్టమైన శృంగార చేష్టలలో మునిగిపోయిందట.

ప్రకృతి వన సంపదను మానవులు విధ్వంసం చేయడాన్ని జానపద సాహిత్యంలోని 'జొన్నవాడ కాటమరాజు' కథల్లో నిరసించడాన్ని ఆహ్వానించకుండా ఉండలేము. ఈ విధ్వంసకాండకు మానవులే ఎలా 'పురోహితులు'గా ఉంటారో చూడండి:

''పోక వనములు నరికించి
దూడలకు వేయించిరి
నిమ్మ చెట్లు నరికించి నీడలు వేయించిరి
పనస చెట్లు నరికించి పొర వేయించిరి
ఖర్జూర వనాలు నరికించి దొడ్లు వేయించిరి
నాగమల్లి తోటలు నరికించి కలయతొక్కించిరి
ఆ వనము ఈ వనము అనకుండా
ఆకుతోటలను తొక్కించిరి.''

ప్రకృతి సహజ వాతావరణాన్ని చెడగొట్టడంలో మానవుడి విధ్వంసక పాత్ర తక్కువైనది కాదు. కనుకనే జానపద సాహిత్యాన్ని మనం ప్రసాదప్రాయంగా పరిగణించుకుని కాపాడుకోవాలి. జ్ఞానోదయం కలగడానికి పోతన, తన భాగవత రచనలో అజామీళుడు ఏ దుఃస్థితిలో ఉన్నాడో చెబుతూ ఇలా వర్ణించి బుద్ధి చెప్పాల్సి వచ్చింది:

''చదువు చట్టుపడియె, శాస్త్రంబు
బుద్ధిపురుగు మేసె పుణ్యమడుగంటె
నీతిమట్టుపడియె, నిర్మల జ్ఞానంబు
మొదలికుడిగిపోయె.''

భౌతిక సత్యాల్ని విడిచి శాస్త్రకారులు కానీ, కవులుగానీ పరిణామాల్ని పరిశీలించకూడదన్న సత్యాన్ని చాటుతూ పోతన 'మందార మకరందాన్ని చవిచూసిన కోయిల మరొక చోటికి' పోనట్టే,



హేతువాదాన్ని ఆశ్రయించినవారు మరొక దారికి మళ్లరన్నాడు. అడవి బాపిరాజు పల్లెజీవనంలో జానపదులకు జరిగే మోసాల్ని నిర్మొహమాటంగా చెప్పారు:

''మోసము చేసెను మునసబుగారు
కక్షలు కట్టును కరణంగారు
కలిమి కలిగినా కాపులు వీరు
దూదూ దూదూ యెంకన్నా
చెట్టు కదిలినా పుట్టపాదలదూ
నీరుపోయినా నాచు కదలదూ
గుడిపాడైనా గూబవదలదూ
గుడి పొలాలు పూజారి వదలదూ.''

అయినా తిరిగి ఈ మానవుడే 'కాలానికి క్లోం వేస్తాం, ప్రేమానికి గ్లోం తీస్తాం' అని చాటగలిగాడు. అథర్వణ వేదంలోని 'భూమి సూక్తం'లో ఎంతటి భౌతిక సత్యాన్ని అందజేశారో చూడండి:

''అసంఖ్యాకమైన కొండలు, నదులు, ఓషధులు, ఈ భూమంత గర్భంలోనే ఉన్నాయి. ప్రజలకు అవసరమైన ఆహారం అంతా ఎక్కడి నుంచి వస్తోందనుకుంటున్నారు, అక్కడి నుంచే వస్తోంది. ఓ భూదేవీ! నీ శరీరం ఎక్కడో, నీ కటి భాగం ఏదో, నీ బొడ్డు ఏదో నాకు ఆ వివరాలు తెలియవు సుమా. కానీ నీవు నా తల్లివి. నేను నీ కొడుకుని, నా తండ్రి పర్జన్యుడు. అతడు నాకు క్షేమం కలిగించుగాక!''


ఇలా ప్రకృతిని ఆలంబనగా చేసుకుని, ఈ చరాచర సృష్టి ఆది నుంచి ఉన్నదేననీ, దానికి మనిషి కల్పిస్తే తప్ప చావు పుట్టుకలంటూ లేవనీ నాస్తికులే కాదు, ఎందరో సామాజికవాదులు, శాస్త్రవేత్తలు భావించారు. అందుకే సామాజిక శాస్త్రవేత్త సంజీవదేవ్ 'మన పుట్టుక ప్రకృతిలో, మన మనుగడ ప్రకృతిలో, మన చావు ప్రకృతిలో' అన్నారు. ఈ ధర్మానికి ఏదీ భిన్నం కాదని చాటేది ప్రకృతి, పురుషుల శాసనం. నవీన విద్యాలయాల్లో పురాణ శ్రవణానికి ఇక కాలం చెల్లింది.

abkprasad2006@yahoo.co.in

అక్కర్లేని విమర్శలు


చంద్రబాబు ప్రభుత్వ అవినీతి కారణంగానే కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వడం లేదని బీజేపీ నేతలు అంటుండేవారు. అలాంటిది జగన్ విజ్ఞప్తి మేరకు ఇరవై నాలుగు వేల కోట్ల సాయం చేయడానికి కేంద్రం ఎందుకు ముందుకొచ్చింది? అప్పుడు ఎందుకు అమిత్ షా, నడ్డాలు ఏపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారన్న ప్రశ్న వస్తుంది. ఆయా రాష్ట్రాలకు వెళ్లినప్పుడు బీజేపీయేతర ప్రభుత్వాలపై కొన్ని విమర్శలు చేయకతప్పదు. అందులో భాగంగానే వీరు కూడా చేశారనుకోవాలి.

అభిప్రాయం



కొమ్మినేని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, శ్రీకాళహస్తిలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన ప్రసంగాలలో ఒక విషయం స్పష్టం. ఏపీలో అభివృద్ధి జోరుగా సాగుతోందనీ, సంక్షేమ కార్యక్రమాలు బాగా అమలు అవుతున్నాయనీ! అమిత్ షా, నడ్డా ఏపీ ప్రభుత్వంపై కొన్ని విమర్శలు చేసినా, వాటిలో పస లేదు. ఫలానా ప్రాజెక్టులో అవినీతి జరుగుతోందనో, ఫలానా చోట అక్రమాలు జరిగాయనో ఆధారాల సహితంగా చెప్పకపోవడం గమనించదగ్గ విషయం. పైగా ఇటీవలే కేంద్రం రాష్ట్రానికి రెవెన్యూ లోటు కింద పదకొండు వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు నిమిత్తం పదమూడు వేల కోట్లు మంజూరు చేసింది. నిజంగానే



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏవైనా స్కామ్‌లకు పాల్పడి ఉంటే కేంద్రం అడ్డుపడదా!

ఆనాటి టీడీపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంను ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఎన్నికల ప్రచార సభలో ఆరోపించారు. మరుగుదొడ్ల నిర్మాణం మొదలు అనేక అంశాలలో అక్రమాలు జరిగాయని బీజేపీ అధ్యక్షుడిగా ప్రస్తుతం ఉన్న సోము వీర్రాజు అప్పట్లోనే ఆరోపించేవారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వం ఓటమి చెందిన తర్వాత ఆయన 'పీఎస్' ఇంటిలో సోదాలు చేసి రెండువేల కోట్ల రూపాయల అక్రమాలు గుర్తించినట్లు కేంద్రం ప్రకటించింది. అవినీతికి దూరంగా ఉంటామని చెప్పుకొనే బీజేపీ ప్రభుత్వ పెద్దలు వీటి గురించి ఏమి చేసింది ఇంతవరకూ వెల్లడించలేదు. టీడీపీ, బీజేపీ కలిసి ప్రభుత్వంలో ఉన్నప్పుడే అమరావతి లాండ్ స్కామ్, స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్ వంటివి జరిగాయని వైసీపీ ప్రభుత్వం కనుగొంది. వాటిపై సీబీఐ విచారణకు సిద్ధం అని చెప్పినా, ఇంతవరకూ కేంద్రం కిమ్మనలేదు. అవినీతిని దునుమాడు తామనే మోదీ, అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు?

అప్పట్లో చంద్రబాబు తరచూ ఒక మాట చెప్పేవారు. కేంద్రం తనకు సహకరించడం లేదనీ, ఇరవై తొమ్మిది సార్లు ఢిల్లీ వెళ్లినా ఆశించిన నిధులు ఇవ్వడం లేదనీ పదే పదే వాపోయేవారు. చంద్రబాబు ప్రభుత్వ అవినీతి కారణంగానే కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వడం లేదని కొందరు బీజేపీ నేతలు అంటుండేవారు. మరి అలాంటిది ఇప్పుడు జగన్ విజ్ఞప్తి మేరకు రెవెన్యూ లోటు, పోలవరం ప్రాజెక్టులకు ఇరవై నాలుగు వేల కోట్ల సాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చిందంటే, దాని అర్థం జగన్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు లేనట్లే కదా! అయినా ఎందుకు అమిత్ షా, నడ్డాలు జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారన్న ప్రశ్న వస్తుంది.

నిజానికి ఇది ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రచారం కోసం ఏర్పాటు చేసిన సభ. ఆయా రాష్ట్రాలకు వెళ్లినప్పుడు బీజేపీయేతర ప్రభుత్వాలు ఉంటే ఏవో కొన్ని విమర్శలు చేయక తప్పదు. అందులో భాగంగానే వీరు ఏపీపై కూడా చేసినట్లు అనిపిస్తుంది. ఇసుక మాఫియా అని ఆరోపించారు. చంద్రబాబు టైమ్‌లో మాఫియాలు విజృంభించి ప్రజలను అగచాట్ల పాలు చేస్తే, జగన్ ప్రభుత్వం కొత్త విధానం తెచ్చి, అటు ప్రజలకు అందుబాటులో ఉంచుతూ, ఇటు ప్రభుత్వానికి ఆదాయమూ సమకూర్చగలుగుతోంది. మాజీ మంత్రి పేర్ని నాని అన్నట్లు ఇసుక ద్వారా ఏపీకి నాలుగువేల కోట్ల ఆదాయం వచ్చిందంటే అవినీతి జరిగినట్లు ఎలా అవుతుంది? మైనింగ్ రంగంలో కూడా గతంలో కన్నా కొన్ని వేల కోట్ల ఆదాయం పెరిగింది. విశాఖలో భూమాఫియా అని దుష్ప్రచారం చేస్తున్నారు. నిజానికి కొందరు టీడీపీ నేతలు ఎకరాలకు ఎకరాలు ఆక్రమించిన విషయాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్న సంగతి అమిత్ షాకు ఏపీ బీజేపీ నేతలు చెప్ప లేదేమో తెలియదు. అదే బీజేపీ, టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు జరిగిన భూ కబ్జాలపై చంద్రబాబు ప్రభుత్వమే సిట్ వేసింది కదా! అప్పుడు మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడే ఆనాటి కబ్జాలపై ఫిర్యాదు చేశారు కదా! నడ్డా, షాలకు ఆ విషయాలు చెప్పి ఉండకపోవచ్చు.

ఏపీలో జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, ఫార్మా హబ్ వంటివాటిని ప్రస్తావించారు. వాటన్నిటినీ కేంద్రం ఖాతాలో వేసుకునే యత్నం చేశారు. తప్పు లేదు. కేంద్రం, రాష్ట్రం కలిసి ఈ ప్రాజెక్టులను చేస్తాయి తప్ప కేంద్రం ఒక్కటే చేయగలిగింది తక్కువే అన్న సంగతి అందరికీ తెలుసు. ఒకపక్క రాష్ట్రంలో అసలు ఏమీ జరగడం లేదని చెబుతారు. మరో పక్క తాము చాలా చేసేస్తున్నామని అంటారు. సోము వీర్రాజు తన ప్రసంగంలో చాలా విషయాలు చెప్పారు. అవన్నీ వింటే జగన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. ఒకరకంగా ఇది విమర్శలకు కనువిప్పు కూడా.

జగన్ సంక్షేమ కార్యక్రమాల కింద రెండు లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని ప్రజలకు అందించారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా వారి ఖాతాలలోకి వెళ్లేలా కంప్యూటర్ బటన్ నొక్కడం ద్వారా చేశారు. ఇలా ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేయగలుగుతున్నాయి? కర్ణాటకలో నలభై శాతం కమిషన్ ఆరోపణతోనే కదా బీజేపీ ప్రభుత్వం పరాజయం చెందింది. ఆ విషయం ఏపీ ప్రజలకు తెలియదనుకుంటే బీజేపీ వారు అమాయకులే అనుకోవాలి. కేంద్రంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని అమిత్ షా అంటున్నారు. రఫేల్ కుంభకోణం ఎంత పెద్ద ఆరోపణో వారికి తెలియదా! అది నిజం కాదని వీరు చెప్పవచ్చు... అది వేరే సంగతి. కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి పరిశ్రమల గురించి తెలుగుదేశం భాషలో మాట్లాడకుండా ఉంటే ఆమెకే గౌరవంగా ఉండేది.

చివరిగా ఒక మాట. ఏపీ నుంచి బీజేపీకి ఇరవై లోక్‌సభ సీట్లు ఇవ్వాలని అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ఇది ఈ మధ్యకాలంలో వేసిన పెద్ద జోక్‌గా కనిపించడం లేదా? అమిత్ షా విశాఖ సభకు జనం పెద్దగా రాకపోవడం కూడా వారికి కాస్త నిరాశ కలిగించి ఉండవచ్చన్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వచ్చాయి. వీటన్నిటి ప్రభావంతో ఏపీ ప్రభుత్వంపైన కొన్ని విమర్శలు చేస్తే చేసి ఉండవచ్చు. వాటిని పెద్ద సీరియస్‌గా తీసుకోనవసరం లేదు.

వ్యాసకర్త ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్

ఈ ర్యాంకుల పాపం పాలకులదే!

రాష్ట్రంలోని గవర్నమెంట్ కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ పడిపోతున్నాయని జాతీయ ప్రమాణాల ర్యాంకులు చెబుతున్నాయి. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) కింద కేంద్ర ఉన్నత విద్యాశాఖ–2023 సంబంధించి విడుదల చేసిన ర్యాంకుల్లో మన రాష్ట్ర యూనివర్సిటీలు ఆశించినంత స్థాయిలో లేవు. టీచింగ్, లెర్నింగ్, రీసోర్సెస్, రీసెర్చ్, ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్ కమ్స్, అడ్మిషన్స్ వంటి అంశాల ఆధారంగా 13 కేటగిరీల్లో ర్యాంకులు ప్రకటించారు. ఓవ రాల్ కేటగిరిలో టాప్ 100లో తెలంగాణ నుంచి నాలుగు విద్యా సంస్థలే చోటు దక్కించుకున్నాయి, అందులో రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలలో ఉస్మానియా ఒక్కటే ఉంది. జాతీయ సంస్థలైన ఐఐటీహెచ్ 14వ స్థానంలో, హెచ్‌సీయూ 20వ స్థానంలో నిలిచాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ 53, ఉస్మానియా యూనివర్సిటీ 64 స్థానాల్లో నిలిచాయి.



దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థగా తమిళనాడులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), మద్రాస్ నిలిచింది. యూనివర్సిటీ కేటగిరీలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు మొదటి స్థానంలో, కాలేజీల కేటగిరీలో ఢిల్లీకి చెందిన మిరాండ హౌస్ ప్రథమ స్థానంలో నిలిచాయి.

ఈ సంవత్సరం ర్యాంకుల పరంగా ఉస్మానియా, కాకతీయ, జేఎన్టీయూలు క్షీణించాయి. ఓవరాల్ కేటగిరీలో టాప్ వందలో స్టేట్ వర్సిటీ ఓయూ మాత్రమే ఉంది. గతేడాది ఓయూ 46వ ర్యాంకు పొందగా, ఈసారి 64కు దిగజారింది. యూనివర్సిటీ కేటగిరీలో లాస్టియర్ ఓయూ 22వ స్థానంలో ఉంటే, ఈ ఏడాది 36వ స్థానానికి పడి పోయింది. హెచ్‌సీయూ పదో స్థానంలో నిలవగా, ఐఐటీహెచ్ 84వ స్థానంలో నిలిచింది. కాలేజ్ లెవెల్లో తెలంగాణ నుంచి ఒక్క గవర్నమెంట్ కాలేజీ కూడా లేదు. కేవలం 'సెయింట్ ఫ్రాన్సిస్ ఉమెన్స్ కాలేజీ' 98వ ర్యాంకు పొందింది. ఇంజినీరింగ్ కేటగిరీలో గత ఏడాది జేఎన్టీయూహెచ్ 76వ స్థానంలో ఉంటే, ఈ ఏడాది 83కు దిగజారింది. న్యాయ శాస్త్రం కేటగిరీలో 'నల్సార్ లా యూనివర్సిటీ' మూడో స్థానంలో నిలవగా, ఇన్నోవేషన్ కేటగిరీలో ఐఐటీహెచ్ మూడవ స్థానంలో నిలిచింది.

తెలంగాణలోని పలు విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు అధికంగా శాశ్వత అధ్యాపకుల నియామకాలకు బదులు, తాత్కాలికంగా ఒప్పంద లేదా అతిథి అధ్యాపకులను నియమించి దశాబ్దకాలంగా కొనసాగుతున్నాయి. వీరికి సరైన వేతనాలు లేక పోవడం, పరిశోధనలో వారు పాల్గొనే అవకాశాలు లేకపోవడంతో ప్రమాణాలు పడిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే మన ఉన్నత విద్యా సంస్థల ప్రమాణాలను పెంచడానికి కావలసిన అన్ని చర్యలూ తీసుకోవాలి. లేకపోతే పరిస్థితి మరింత దిగజారుతుంది.

– డాక్టర్ కందగట్ల శ్రవణ్ కుమార్

నడవాల్సింది... మన ధర్మమా? మనుధర్మమా?

సందర్భం



ఎ.ఎం. ఖాన్ యజ్దానీ

గర్భస్రావం చట్టబద్ధమో కాదో న్యాయస్థానాలు తేల్చి చెప్పేస్తే చాలు. దాన్ని నిర్ణయించడానికి మనుస్మృతి, జ్యోతిష్యాలనూ కోర్టులే ఆశ్రయించడం చూసి ప్రజాస్వామికవాదులు ఆందోళనకు గురవుతున్నారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సమీర్ దావె ఒక విడ్డూరానికి పాల్పడితే, అలహాబాద్ హైకోర్టు ఇంకో విడ్డూరానికి పాల్పడింది. రెండు కేసుల్లోనూ ఫిర్యాదిదారులు అత్యాచారానికి గురైన బాధితులు కావడం విశేషం.

భారతీయ జనతా పార్టీకీ, దానికి పూర్వీకులయిన 'జన సంఘ్', 'హిందూ మహాసభ'లకూ వీటికి తాత్విక గురువు అయిన రాష్ట్రీయ 'స్వయం సేవక్ సంఘ్'కూ ప్రాథమికంగా ప్రజాస్వామ్యం అంటే పడదు. రాజ్యాంగ సభ 1949 నవంబరు 26 భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు నుండే దానిమీద మనువాదులు దాడిని ఆరంభించారు. ఆరెస్సెస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' 1949 నవంబర్ 30 నాటి సంచికలో మనుస్మృతిని కొనియాడుతూ, రాజ్యాంగాన్ని విమర్శిస్తూ ప్రధాన వ్యాసాన్ని ప్రచురించింది. 'పురాతన కాలంలోనే భారత గడ్డ మీద పుట్టిన ఒక గొప్ప దార్శనికునిగా, న్యాయవేత్తగా మనువును ప్రపంచం మొత్తం కొనియాడుతోంది. ఆయన రూపొందించిన స్మృతి సూత్రాలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ఇవేవీ మన రాజ్యాంగ పండితులకు పట్టలేదు' అంటూ అక్కసు వెళ్ళగక్కింది. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మానికి ప్రాధాన్యం ఇవ్వాలని సంఘ్ పరివార్ శక్తులు తరచుగా అంటున్నాయి.

ఇక కోర్టు కేసుల విషయానికి వస్తే, ఉత్తర ప్రదేశ్ అలహాబాద్‌లో ఒక మ్యారేజ్ బ్యూరో ద్వారా ఓ అబ్బాయి, అమ్మాయికి మధ్య పరిచయం ఏర్పడింది. పెళ్ళి సాకుతో అతను ఆమె మీద అత్యాచారం చేశాడు. ఆమె తక్షణం పెళ్ళి చేసుకోమంది. అతను కుదరదన్నాడు. ఆమె కేసు వేసింది. అత్యాచారం నేరం కింద అరెస్టు చేశారు. హైకోర్టులో బెయిల్ విచారణ సందర్భంగా మంగళదోషం ఉన్నామెను పెళ్లాడితే తనకు తీవ్ర అనారోగ్యం, ఆర్థిక సమస్యలు వచ్చిపడతాయని వాదించాడు. అత్యాచారం బాధితురాలికి మంగళదోషం ఉందో లేదో 15 రోజుల్లో తేల్చాలంటూ లక్నో విశ్వవిద్యాలయంలోని జ్యోతిష్య శాస్త్ర విభాగాన్ని



కోరుతూ అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

అలహాబాద్ హైకోర్టు ఉదంతాన్ని మీడియాలో చూసి సుప్రీం కోర్టు నివ్వెర పోయింది. జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్ జూన్ 3న తనంతట తాను (సుమోటో)గా కేసును స్వీకరించి విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఆర్డర్ 'పూర్తిగా అసందర్భంగా' ఉందని గమనించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా హైకోర్టు ఆదేశాలు తనను కలవర పెడుతున్నాయి అనడం విశేషం. నిందితుల తరఫు న్యాయవాది అజయ్ కుమార్ సింగ్ మాత్రం జ్యోతిష్యం ఒక విజ్ఞానశాస్త్రమనీ, అనేక విశ్వవిద్యాలయాలలో దీనిని ఒక శాస్త్రంగా బోధిస్తున్న విషయాన్ని న్యాయస్థానం గమనించాలనీ కోరారు. అంతిమంగా, లక్నో విశ్వవిద్యాలయంలోని జ్యోతిష్య శాస్త్ర విభాగానికి అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మీద సుప్రీంకోర్టు స్టే విధించింది.

అహ్మదాబాద్ హైకోర్టులో ఇంకో విచిత్రం జరిగింది. ఇది కూడా అత్యాచారం బాధితురాలి కేసే. ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి. గర్భం ధరించి ఆరునెలలు దాటితే గర్భస్రావానికి డాక్టర్లు కోర్టు అనుమతి తీసుకోవాలి. బాధితురాలి తండ్రి గర్భస్రావానికి అనుమతి ఇమ్మంటూ హైకోర్టును ఆశ్రయించాడు.

బాధితురాలి పక్షాన వాదిస్తున్న అడ్వకేట్ సికందర్ సయ్యద్ ఆమెకు ఇంకా 17 సంవత్సరాలు కూడా నిండలేదనీ, ప్రసవించి బిడ్డను సాకే శారీరక మానసిక ఆరోగ్యం లేదనీ, సమాజం కూడ సానుకూలంగా లేదనీ కోర్టుకు విన్నవించుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న జస్టిస్ సమీర్ దావె గర్భస్రావానికి ససేమిరా అన్నారు. తల్లీ, గర్భస్థ శిశువుల ఆరోగ్య స్థితి మీద ఒక నివేదికను కోరారు. 'స్త్రీలు పద్నాలుగేళ్లకే పెళ్ళిచేసుకోవాలనీ, 17 ఏళ్ళు రాక ముందే తల్లి కావాలనీ మనుస్మృతిలో చెప్పారు. ఇది 21వ శతాబ్దం కనుక మనం ఇలాంటివి చదవం. మీరు మీ ఇంటికి వెళ్ళి మీ అమ్మనో, అమ్మమ్మనో అడగండి. వాళ్ళకు పెళ్ళి ఏ వయసులో అయిందో చెబుతారు' అని వ్యాఖ్యానించారు.

బాధితురాలి పక్షాన అడ్వకేట్‌గా ఉన్న సికందర్ సయ్యద్ కూడా గతంలో ముస్లిం సమాజంలోనూ 13 సంవత్సరాల వయసులోనే వివాహాలు చేసేవారని చెప్పడం ఈ కేసులో కొసమెరుపు. ఆధునిక అవసరాలను బట్టి ఆధునిక విలువలూ, చట్టాలూ వస్తాయి. వాటిని పాటించక తప్పదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 90107 57776

బీఆర్‌ఎస్‌కు శ్రీహరిరావు గుడ్‌బై

- ఆత్మాభిమానం చంపుకోలేకే రాజీనామా చేశానని వెల్లడి
- కాంగ్రెస్‌లో చేరే ఆలోచనలో ఉద్యమనేత



నిర్మల్: బీఆర్‌ఎస్ అగ్ర నేతలు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చూపిన వివక్ష కారణంగానే పార్టీ వీడుతున్నట్లు ఉద్యమ నేత, బీఆర్‌ఎస్ అసమ్మతి నాయకుడు కుచాడి శ్రీహరిరావు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్‌కి రాజీనామా లేఖ పంపించనున్నట్లు వెల్లడించారు. అనుచరులు, ఉద్యమకారుల సూచన మేరకు ఏ పార్టీలో చేరనున్నది త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. నిర్మల్‌లోని తన నివాసంలో అనుచరులతో సోమవారం సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..'ఆత్మాభిమానాన్ని చంపుకుని కేసీఆర్, కేటీఆర్, మంత్రి ఐకేరెడ్డి దగ్గరికి వెళ్తే నేను పనులు చేసుకోవచ్చు.. కానీ నన్ను నమ్ముకున్న ఉద్యమకారుల కోసం అలా చేయలేను' అని వ్యాఖ్యానించారు. తనకు ఎమ్మెల్సీ ఇవ్వలేదన్న బాధ కంటే, ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వలేదన్న ఆవేదనే ఎక్కువగా ఉందన్నారు. మరోవైపు శ్రీహరిరావు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైందని అనుచరులు చెబుతున్నారు.

వార్ధాపై 'మహా' మెలిక!

- ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేయాలన్న మహారాష్ట్ర
- గతేడాది మేడిగడ్డకు వరదలతో తమ రాష్ట్రంలోని సిరోంచా ప్రాంతం ముంపునకు గురైందని వెల్లడి
- స్థానికంగా, రాజకీయంగా ఇబ్బందులెదుర్కొన్నట్లు లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో ప్రతిపాదించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 'వార్ధా'ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలిపే విషయంలో మహారాష్ట్ర కొత్త మెలిక పెట్టింది. 155–160 మీటర్ల నిడివిలో వేర్వేరు పూర్తి స్థాయి నిల్వమట్టాల (ఎఫ్‌టీఎల్)తో వార్ధా బ్యారేజీ నిర్మిస్తే ఉండనున్న ముంపు ప్రభావం, ప్రభావితం కానున్న గ్రామాలపై ఇప్పటికే మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ఇంజనీర్ల బృందం సర్వే నిర్వహించి నివేదిక సమర్పించింది. అయితే గతేడాది జూలైలో గోదావరికి వరదలు పోటెత్తడంతో మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్ కారణంగా తమ రాష్ట్రంలోని సిరోంచా ప్రాంతం ముంపునకు గురైందని, ఈ నేపథ్యంలో వేర్వేరు ఎఫ్‌టీఎల్ స్థాయిల వద్ద వార్ధా బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో ఉండనున్న ముంపుపై మళ్లీ అధ్యయనం జరపాలని మహారాష్ట్ర స్పష్టం చేసింది. ఈ మేరకు మహారాష్ట్ర జలవనరుల శాఖ అంతర్రాష్ట్ర విభాగం సహాయ చీఫ్ ఇంజనీర్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖకు లేఖ రాశారు. మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన వరదతో స్థానికంగా, రాజకీయంగా మహారాష్ట్రలో తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని, బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ సర్వే జరపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. రెండు రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్ల స్థాయిలో ఈ అంశాన్ని పరిష్కరించుకున్న తర్వాతే అంతర్రాష్ట్ర బోర్డు సమావేశం నిర్వహించాలని కోరింది.

అంతర్రాష్ట్ర ఒప్పందానికి మరింత జాప్యం!

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించడానికి పరస్పర అంగీకారం తెలుపుతూ 2016 ఆగస్టు 23న జరిగిన అంతర్రాష్ట్ర బోర్డు సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు సంతకాలు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని పక్కనపెట్టింది. దీనికి బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. ఈ కారణంగా నష్టపోయిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించడానికి తుమ్మిడిహట్టికి బదులు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గుండాయిపేట వద్ద వార్ధా నదిపై బ్యారేజీ నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రూ.4,550.73 కోట్లతో ప్రాజెక్టు నివేదికను అనుమతుల కోసం ఇటీవల కేంద్ర జలసంఘానికి (సీడబ్ల్యూసీ) సమర్పించింది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి గతంలో చేసుకున్న ఒప్పందాన్ని సవరించడం ద్వారా వార్ధా బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి తెలపాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసింది. ఇందుకోసం అంతర్రాష్ట్ర బోర్డు సమావేశం నిర్వహించాలని కోరింది. అయితే దీనికి ముందే బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం జరపాలని తాజాగా మహారాష్ట్ర కోరడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్టు అయింది. వార్ధా ప్రాజెక్టు కింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,34,880 ఎకరాల ఆయకట్టుకు, మరో 5,868 ఎకరాల స్థిరీకరణకు ప్రభుత్వం ప్రతిపాదించింది.

రాష్ట్రాన్ని తిరోగమనంవైపు తీసుకెళుతున్నారు

- బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి



బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలోని పేజీని కాల్చేస్తున్న ఇంద్రసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన నిరుద్యోగ భృతి హామీని నేటికీ అమలు చేయలేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి హామీని పొందుపరచిన పేజీని చించేసి తగులబెట్టారు. ప్రభుత్వం ఆ హామీని అమలు చేయకపోవడంతో, ఆ పేజీని తగులబెట్టామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్లుగా దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుంటే, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏం సాధించారని తెలంగాణ రన్ నిర్వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ యూనివర్సిటీలను మూసివేసే దిశగా తీసుకెళ్తున్నారని ధ్వజమెత్తారు. రోజురోజుకు విద్యార్థులకు, యూనివర్సిటీలకు కేటాయిస్తున్న నిధులు తగ్గిపోతున్నాయన్నారు. కాగా, ఉద్యోగ కల్పన విషయంలో మంత్రి కేటీఆర్ చెప్పేదానికి.. వాస్తవానికి మధ్య చాలా తేడా ఉందని, దీనికి సంబంధించి ప్రభుత్వం వద్ద అసలు డేటానే అందుబాటులో లేదని విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉద్యోగాలు రాక రాష్ట్రంలో అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జిల్లాల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తెలంగాణ ఏర్పడ్డాక ఉపాధ్యాయ పోస్టులే భర్తీ చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను మార్చే ప్రసక్తే లేదని, ఆయనను మారుస్తారంటూ జరుగుతున్న ప్రచారం సరికాదని ఒక ప్రశ్నకు ఇంద్రసేనారెడ్డి బదులిచ్చారు.

రాష్ట్రం ఇచ్చినందుకు ముక్కు నేలకు రాయాలా?

- నల్లగొండ ప్రజలకు జగదీశ్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- యాదాద్రి పవర్ ప్లాంటు పూర్తి చేయకుండా మంత్రి గాడిదలు కాస్తున్నారా?
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

గుర్రంపోడు: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎందుకు ముక్కు నేలకు రాయాలి.. నాగార్జున సాగర్ కట్టినందుకా, పార్లమెంట్‌లో మెజార్టీ లేకున్నా తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకా.. అని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ప్రశ్నించారు. భూస్వామ్య, గడీల మనస్తత్వం ఉన్న వారే ముక్కు నేలకు రాయాలన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఆయన సోమవారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని గుడిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మీడియాతో మాట్లాడారు. ఎస్‌ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల ద్వారా సాగునీరు ఇవ్వలేని మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండ జిల్లా ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పథకాల గురించి తాను అడిగితే వారు ఏదేదో మాట్లాడుతున్నారని, ముక్కు నేలకు రాయాలంటూ తన పంచె, దోవతి గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

వైఎస్సార్ పేరెత్తే అర్హత జగదీశ్‌రెడ్డికి లేదు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ఎత్తే అర్హత మంత్రి జగదీశ్‌రెడ్డికి లేదని భట్టి స్పష్టం చేశారు. కరెంటు ఇస్తున్నామని చెప్పుకుంటున్న మంత్రి.. ఏ పవర్ ప్రాజెక్టుల నుంచి కరెంటు ఇస్తున్నారని, యాదాద్రి పవర్ ప్లాంటు పూర్తి చేయకుండా గాడిదలు కాస్తున్నారా అని ప్రశ్నించారు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడ చేరే గుత్తా సుఖేందర్‌రెడ్డి గత ఆస్తులకు.. ఇప్పటి ఆస్తులకు పొంతన ఉందా అని ప్రశ్నించారు.



పాదయాత్రలో ప్రజలతో మాట్లాడుతున్న భట్టి

సాక్సులకు, చెప్పులకు తేడా తెలియదా?

- జవదేకర్ చెప్పులేసుకుని ఆలయంలోకి వెళ్లలేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సాక్సులకు, బూట్లకు తేడా తెలియని కొందరు ఫాల్తుగాళ్లు ప్రకాశ్ జవదేకర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో స్మార్ట్ సిటీ పనులను పరిశీలించిన అనంతరం సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ చెప్పులేసుకుని వేములవాడ రాజన్న ఆలయంలోకి వెళ్లారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని సంజయ్ ఖండించారు. 'జవదేకర్ దైవభక్తుడు. చెప్పులేసుకుని ఆలయంలోకి వెళ్లేంత మూర్ఖుడు కాదు. చెప్పులు విడిచి సాక్సులతో ఆలయంలోకి వెళ్లారు. నేను వారితోనే ఉన్నా'అని స్పష్టం చేశారు. సాక్సులకు, చెప్పులకు తేడా తెలియని ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని, వేములవాడ రాజన్న ఆలయ పూజారులను అడిగితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. కాగా, దీనిని రాజరాజేశ్వర ఆలయ పూజారులు కూడా ఖండించారు.

శిరీషది హత్యా.. ఆత్మహత్యా?

- అన్ని కోణాల్లో కొనసాగుతున్న దర్యాప్తు
- మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం
- కాల్ డేటా ఆధారంగా మరో ఇద్దరిని విచారిస్తున్న పోలీసులు
- హత్యను సుమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్





గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు. (ఇన్‌సెట్‌లో) శిరీష (ఫైల్)

పరిగి, సాక్షి న్యూఢిల్లీ: పారా మెడికల్ విద్యార్థి శిరీష మృతిపై మిస్టరీ వీడలేదు. యువతిది హత్యా.. ఆత్మహత్యా.. అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కాళ్లాపూర్ శివారులోని నీటి కుంటలో ఆదివారం మధ్యాహ్నం శిరీష (19) మృతదేహం లభ్యమైంది. ఒంటిపై పలు చోట్ల గాయాలు ఉండటం, రెండు కళ్లనూ పొడిచి ఉండటంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేసిన విషయం విదితమే. పలువురు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వివరాలు ఆరా తీసే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా సోమవారం గ్రామానికి చేరుకున్న వైద్యులు శిరీష మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం నిర్వహించారు. యువతి శరీరంపై గాయాలు ఉన్నట్లు ధ్రువీకరించారు. ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు. శిరీషది ముమ్మాటికీ హత్యేనని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మృతురాలి తండ్రి జంగయ్య, బావ అనిల్‌పై వారు మండిపడ్డారు. శిరీష మృతికి వారే కారణమంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు కల్పించుకుని త్వరలోనే పూర్తి వాస్తవాలు తెలుస్తాయని, అప్పటివరకు ఓపిక పట్టాలని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. తన చెల్లిని చంపిన వారు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని మృతురాలి తమ్ముడు శ్రీకాంత్ కోరాడు.

పోలీసుల అదుపులో మరో ఇద్దరు

శిరీష అంత్యక్రియలు ముగిసిన తర్వాత తండ్రి జంగయ్య, బావ అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాల్ డేటా ఆధారంగా గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా.. కేసు దర్యాప్తులో ఉందని, ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్ట్ వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు.

మూడు రోజుల్లో రిపోర్టు పంపండి

- తెలంగాణ డీజీపీకి మహిళా కమిషన్ ఆదేశం

శిరీష దారుణ హత్యను జాతీయ మహిళా కమిషన్ సుమోటో కేసుగా స్వీకరించింది. స్క్రూ డ్రైవర్‌తో బాలిక కళ్లు పీకి, బ్లేడ్‌తో గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటనపై ఢిల్లీలోని ఎన్సీడబ్ల్యూ సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. అంతేగాక మూడు రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను పంపించాలని తెలంగాణ డీజీపీకి సూచించింది. తెలంగాణలో బాలికలు, యువతులు, మహిళలపై పెరిగిపోతున్న నేరాలపై జాతీయ మహిళా కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

సర్పంచ్, ఉపసర్పంచ్‌ల కాళ్లు, చేతులు నరికేస్తాం..

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో గనులు తెరిచేందుకు సహకరిస్తే సర్పంచ్, ఉపసర్పంచ్‌ల కాళ్లు, చేతులు నరకడమే కాకుండా, హతమారుస్తామని మావోయిస్టులు హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా బ్లాక్‌లో నదీ నీటిని నిల్వ చేసేందుకు కరకట్ట నిర్మిస్తున్నారు. దీనిని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న మావోయిస్టులు పనులు నిలిపివేయాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఓర్చా సమీపంలోని ప్రధాన రహదారి వెంట వాల్‌పోస్టర్లు వేయడంతో పాటు బ్యానర్లు కట్టారు. నదిలో కరకట్ట నిర్మాణ పనులతో పాటు, ఈ ప్రాంతంలో గనుల్లో తవ్వకాలను నిలిపివేయాలని, సర్పంచ్‌లు ఈ పనులకు సహకరించవద్దని హెచ్చరించారు.

ఉద్యమ నేతకు కడసారి వీడ్కోలు



జగదీశ్ కూతురు, కుమారుడిని ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్



పాడె మోస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత తదితరులు

- ములుగు జిల్లా మల్లంపల్లిలో జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు
- మంత్రి కేటీఆర్ సహా పాల్గొన్న పలువురు ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ ఉద్యమ నాయకుడు, ములుగు జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం ములుగు జిల్లా మల్లంపల్లిలో సోమవారం జరిగాయి. జగదీశ్ ఆదివారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హఠాన్మరణం పొందిన విషయం తెలిసిందే. ఆయనకు కడసారి వీడ్కోలు పలకడం కోసం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. గంటన్నరపాటు జరిగిన జగదీశ్ అంతిమయాత్రలో మంత్రి కేటీఆర్, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రముఖులు, శ్రేణులు పాల్గొన్నారు. కేటీఆర్‌ను చూడగానే జగదీశ్ తల్లి సులోచన, భార్య రమాదేవి, కుమార్తె హరిచందన, కుమారుడు సత్యదేవ్ బోరున విలపించారు. కేటీఆర్ వారిని ఓదార్చారు. ఆయన మరణం జిల్లా ప్రజలకు, పార్టీకి తీరనిలోటని కేటీఆర్ అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందన్నారు. అంతిమయాత్రలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ కవిత జగదీశ్ పాడె మోశారు.

క్లుప్తంగా...

రూ.10 అడిగితే ప్రాణం తీశాడు

టీనేజీ కుమారుడి పట్ల తండ్రి కర్కశత్వం

ఛత్రా(జార్ఖండ్): కేవలం రూ.10 అడిగిన కుమారుడి పట్ల తండ్రి కాలయముడైన ఘటన జార్ఖండ్‌లో చోటుచేసుకుంది. తాగిన మత్తులో ఉన్న తండ్రి.. కుమారుడిని ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ఛత్రా జిల్లాలోని వశిష్ఠనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరేలీబర్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. స్టేషన్ ఇన్‌చార్జ్ గులామ్ సర్వర్ వెల్లడించిన వివరాల ప్రకారం .. 48 ఏళ్ల బిలేశ్ భుయాన్ తన భార్య, 15 ఏళ్ల కుమార్తె, 12 ఏళ్ల కుమారుడు పప్పు కుమార్‌తో కలిసి జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం తొమ్మిదిగంటలకే భుయాన్, అతని భార్య ఇద్దరూ పూటుగా తాగి ఇద్దరూ తీవ్రంగా గొడవ పడ్డారు. అదే సమయంలో ఓ పది రూపాయలు ఇవ్వు నాన్నా అంటూ బాలుడు పప్పు కోరాడు. అప్పటికే కోపంతో ఉన్న భుయాన్ మరింత ఆగ్రహంతో రగిలిపోయాడు. తీవ్ర ఆవేశంతో కుమారుడిని ఊపిరాడకుండా చేసి చంపేశాడు. అదే సమయానికి ఇటుక బట్టీలో పనిచేసే కూతురు పని ముగించుకుని ఇంటికి వచ్చింది. తమ్ముడి మరణం చూసి పొరుగువారిని కేకలేసి పిలిచింది. విషయం తెల్సుకున్న పోలీసులు వెంటనే తండ్రిని అరెస్ట్‌చేశారు.

మధ్యప్రదేశ్‌లో 220 నెలల్లో 225 కుంభకోణాలు

- బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది: ప్రియాంక



జబల్పూర్: మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ సోమవారం శ్రీకారం చుట్టారు. జబల్పూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలో దారుణంగా విఫలమైందని మండిపడ్డారు. బీజేపీ పాలనలో గత 220 నెలల్లో 225 కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ప్రతి నెలా ఒక కొత్త కుంభకోణం చోటుచేసుకుంటోందని దుయ్యబట్టారు. వ్యాపమ్, రేషన్ సరుకుల పంపిణీ, మైనింగ్, ఈ–టెండర్ వంటి వ్యవహారాలను ఆమె ప్రస్తావించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని, 100 యూనిట్ల కరెంటు ఉచితంగా సరఫరా చేస్తామని, వ్యవసాయ రుణాలను రద్దు చేస్తామని చెప్పారు.

అందరికీ నాణ్యమైన డేటా

- డేటా సరఫరాలో అంతరాలను తొలగించాలి
- సాంకేతిక ప్రజాస్వామీకరణ ముఖ్యమైన సాధనం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- వారణాసిలో 'జీ20' డెవలప్‌మెంట్ మంత్రుల సదస్సు



వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తదితరులు

న్యూఢిల్లీ: నాణ్యమైన డేటా ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని, ఈ విషయంలో సాంకేతిక ప్రజాస్వామీకరణ ఒక ముఖ్యమైన సాధనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. డేటాను అందించడంలో అంతరాలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం వారణాసిలో జరిగిన జీ20 దేశాల డెవలప్‌మెంట్ మంత్రుల సదస్సులో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. భారత్‌లో డిజిటలీకరణ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని, ఈ రంగంలో తమ అనుభవాన్ని భాగస్వామ్య దేశాలతో పంచుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అవసరంలో ఉన్నవారికి రుణాలు సులభంగా లభించేలా ఆర్థిక సంస్థల్లో సంస్కరణలు రావాలని ఆకాంక్షించారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, వనరుల సమర్థ కేటాయింపునకు, ప్రజలకు పాలనాపరమైన సేవలు మెరుగ్గా అందించడానికి అత్యంత నాణ్యమైన డేటా అవసరమని వివరించారు. ప్రజా సాధికారతకు, డేటాను ప్రజలకు అందించడానికి టెక్నాలజీని విస్తృతంగా వాడుకుంటున్నామని వెల్లడించారు. నగరాలు, పట్టణాలే కాదు, మారుమూల ప్రాంతాల్లో ఉండేవారికి సైతం నాణ్యమైన డేటాను అందించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం

కోవిడ్ మహమ్మారి వ్యాప్తి వల్ల ప్రపంచ దేశాలు ఆర్థికాభివృద్ధిలో వెనుకంజ వేశాయని మోదీ గుర్తుచేశారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు కలిసికట్టుగా కృషి చేయడం మన బాధ్యత అని సూచించారు. మన ప్రయత్నాలనీ పారదర్శకంగా, సమగ్రంగా ఉండాలన్నారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు పెట్టుబడులు పెంచాలని చెప్పారు. చాలా దేశాలు అప్పుల ముప్పును ఎదుర్కొంటున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి మార్గాలు కనిపెట్టాలని పిలుపునిచ్చారు. భారత్‌లో వందకుపైగా లక్షిత జిల్లాల్లో ప్రజల జీవనాన్ని మరింత మెరుగుపర్చడానికి చర్యలు చేపట్టామని ప్రధానమంత్రి వివరించారు. ఆయా జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అవి ఇప్పుడు అభివృద్ధి ఉత్ప్రేరకాలుగా మారాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ డెవలప్‌మెంట్ మోడల్‌ను అధ్యయనం చేయాలని జీ20 దేశాల మంత్రులకు నరేంద్ర మోదీ సూచించారు. ప్రకృతిని ఆరాధించడం భారత్‌లో ఒక సంప్రదాయంగా వస్తోందన్నారు. వాతావరణ మార్పుల నియంత్రణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. లింగ సమానత్వం, మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. తమ దేశంలో మహిళా సాధికారతకు ఎలాంటి పరిమితులు లేవన్నారు. సమాజంలో మార్పునకు, ప్రగతికి మహిళలే సారథులని తేల్చిచెప్పారు. అభివృద్ధి ఎజెండాను వారే నిర్దేశిస్తారని అన్నారు.

కాశీని సందర్శించండి

ప్రజాస్వామ్యానికి తల్లిలాంటి భారత్‌లో వారణాసి అత్యంత పురాతన నగరమని ప్రధాని మోదీ తెలియజేశారు. విజ్ఞానానికి, చర్చకు, సంవాదానికి, సంస్కృతికి, ఆధ్యాత్మికతకు వారణాసి కొన్ని శతాబ్దాలుగా ముఖ్యమైన కేంద్రంగా వెలుగొందుతోందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజల కలయికకు ఇదొక కూడలి అని చెప్పారు. భారత్‌లోని భిన్నమైన సంస్కృతి సంప్రదాయాలను ఇక్కడ చూడొచ్చని అన్నారు. సదస్సు జరిగే గదులకే పరిమితం కాకుండా కాశీ నగరాన్ని సందర్శించాలని, కాశీ స్ఫూర్తిని అనుభూతి చెందాలని జీ20 దేశాల మంత్రులకు మోదీ విజ్ఞప్తి చేశారు. గంగా హారతిని, సారనాథ్‌ను తిలకిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించే ప్రేరణ కచ్చితంగా లభిస్తుందని తెలిపారు. వారణాసి తన సొంత నియోజకవర్గమని తాను ఈ మాట చెప్పడం లేదని మోదీ వ్యాఖ్యానించారు.

కోవిన్ పోర్టల్.. ఫుల్ సేఫ్

- కరోనా టీకా లబ్ధిదారుల డేటా లీక్ కాలేదు
- కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: కోవిడ్ వ్యాక్సినేషన్ కోసం తీసుకొచ్చిన కోవిన్ పోర్టల్‌లో రిజిస్టర్ అయిన టీకా లబ్ధిదారుల డేటా లీకైనట్లు వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ వార్తలకు ఎలాంటి ఆధారాల్లేవని స్పష్టం చేసింది. నోడల్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ అయిన ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్–ఇన్) ఈ వ్యవహారాన్ని సమీక్షిస్తోందని వెల్లడించింది. పోర్టల్‌లోని డేటా భద్రంగా ఉందని, డేటా ప్రైవసీ కోసం అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. డేటా లీక్ అంటూ జరుగుతున్న ప్రచారం ఆకతాయిల పనేనని పేర్కొంది. డేటా లీక్ వార్తలపై సెర్ట్–ఇన్ వెంటనే స్పందించిందని, కోవిన్ యాప్‌పై లేదా డేటాబేస్‌పై ప్రత్యక్షంగా దాడి జరిగినట్లు ఆధారాలు లభించలేదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. టెలిగ్రామ్ యాప్‌లో ఫోన్ నెంబర్లు ఎంట్రీ చేస్తే కోవిన్ యాప్ వివరాలను చూపిస్తోందని చెప్పారు. అంతేతప్ప వ్యాక్సిన్ లబ్ధిదారుల వివరాలు లీక్ కాలేదని స్పష్టం చేశారు. కాగా, కోవిన్ పోర్టల్ నుంచి ముఖ్యమైన డేటా లీకైనట్లు తెలుస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని మొత్తం డేటా మేనేజ్‌మెంట్ వ్యవస్థ గోప్యతపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ సోమవారం డిమాండ్ చేశారు.

అసలేం జరిగింది?

కరోనా టీకా తీసుకున్న వారి వ్యక్తిగత డేటా కోవిన్ పోర్టల్‌లో నిక్షిప్తమైన సంగతి తెలిసిందే. టీకా లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్ మెసెంజర్ యాప్ 'టెలిగ్రామ్'లో కనిపిస్తున్నట్లు కొందరు ట్విట్టర్ ఖాతాదారులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై దేశవ్యాప్తంగా కలకలం మొదలైంది. ఈ వ్యవహారంపై కొన్ని రాజకీయ పార్టీలు స్పందించాయి. ప్రజల వ్యక్తిగత డేటాకు భద్రత లేకపోవడం ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశాయి. దాంతో కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించి, వివరణ ఇచ్చింది. రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ఆధారిత ధ్రువీకరణ ద్వారా మాత్రమే కోవిన్ పోర్టల్‌లోని తమ వివరాలను లబ్ధిదారులు తెలుసుకోవచ్చని పేర్కొంది. లబ్ధిదారులు మినహా ఇతరులు తెలుసుకోవడానికి అవకాశం లేదని స్పష్టం చేసింది. లబ్ధిదారుల చిరునామాలు తెలుసుకొనే వెలుసుబాటు కూడా లేదని వెల్లడించింది.

'అయోధ్య' తొలి అంతస్తు దాదాపు పూర్తి

వివరాలు వెల్లడించిన ట్రస్ట్



న్యూఢిల్లీ: అయోధ్యలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రామాలయ పనులు వేగం పుంజుకున్నాయి. ఆలయాన్ని మొత్తం మూడు అంతస్తుల్లో నిర్మిస్తుండగా తొలి అంతస్తు నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఈ వివరాలను ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ' ఈ ఏడాది అక్టోబర్‌కల్లా గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణం పూర్తి అవుతుంది. నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా స్వయంగా ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణ పనులపై తాజా సమీక్షా సమావేశంలో నిర్మాణసంస్థలు లార్సెన్ అండ్ టూబ్రో, టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ వారి నిపుణులు, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. రోజువారీగా పనుల పర్యవేక్షణ కొనసాగుతోంది. గర్భగుడితో ఉన్న ప్రధాన ఆలయంతోపాటు నృత్య మండపం, ప్రధాన మండపం, కీర్తన మండపం ఇలా ఐదు మండపాలనూ నిర్మిస్తున్నారు. ఐదు మండపాలపై 34 అడుగుల పొడవు, 32 అడుగుల వెడల్పు, 32 అడుగుల ఎత్తు ఉండే గుమ్మటాలను ఏర్పాటుచేస్తారు. ఇవి భక్తులకు ఆలయం ప్రాంగణం నుంచి 69 అడుగుల నుంచి 111 అడుగుల ఎత్తుల్లో గోచరిస్తాయి. ప్రధాన ఆలయం పొడవు 380 అడుగులుకాగా, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161 అడుగులు. మొత్తం గర్భగుడి నిర్మాణంలో మక్రానా మార్బుల్‌తో చెక్కిన స్తంభాలు, పైకప్పు, కుడ్యాలను వినియోగించనున్నారు. ఆలయ బరువు, అన్ని రకాల వాతావరణ మార్పులను తట్టుకునేలా మొత్తంగా 392 భారీ స్తంభాలను ప్రధాన ఆలయం కోసం వాడుతున్నారు. గర్భగుడి ద్వారాలకు బంగారు పూత పూయనున్నారు. ఆలయ ప్రాకారంతో కలిపి రామాలయ విస్తీర్ణం 8.64 ఎకరాలు. ఆలయ ప్రాకారం పొడవు 762 మీటర్లుకాగా లోపలి ప్రాంగణంలో మొత్తం ఆరు ఆలయాలు నిర్మిస్తారు. భక్తుల కోసం విడిగా సదుపాయం కల్పిస్తారు' అని ఆ ప్రకటన పేర్కొంది.

గోధుమ నిల్వలపై పరిమితులు

2024 మార్చి వరకు అమలులో ఉంటాయని కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ: పెరుగుతున్న గోధుమ ధరలను కట్టడి చేసేందుకు నిల్వలపై పరిమితులు విధించినట్లు కేంద్రం తెలిపింది. తక్షణమే అమల్లోకి రానున్న ఈ పరిమితులు 2024 మార్చి వరకు కొనసాగుతాయని స్పష్టం చేసింది. బహిరంగ మార్కెట్ విక్రయ పథకం(ఓఎంఎస్ఎస్) విధానం కింద సెంట్రల్ పూల్ నుంచి 15 లక్షల టన్నుల గోధుమలను ఈ నెలాఖరులోగా టోకు వినియోగదారులకు, వ్యాపారులకు అందజేయనున్నట్లు వివరించింది. నిల్వలు సరిపోను ఉన్నందున గోధుమల దిగుమతి విధానాన్ని మార్చే ఆలోచన ఏదీ లేదని తెలిపింది. గోధుమల ఎగుమతిపై నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పంచదార ఎగుమతులకు అనుమతి లేదని వెల్లడించింది. గోధుమల నిల్వలపై కేంద్రం చివరిసారిగా 2008లో పరిమితులు విధించింది. గత నెలతో పోలిస్తే గోధుమల మార్కెట్ ధరల్లో 8% పెరుగుదల నమోదు కావడంతో ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుందని ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా తెలిపారు. గోధుమ వ్యాపారులు/హోల్‌సేలర్లు 3 వేల టన్నుల వరకు, రిటైలర్లు 10 టన్నులు, మిల్లర్లయితే స్థాపిత సామర్థ్యంలో 75% వరకు గోధుమలను నిల్వ ఉంచుకోవచ్చని ఆయన చెప్పారు. వీరు ఎప్పటికప్పుడు నిల్వ సమాచారాన్ని ఆహారం, ప్రజాపంపిణీ శాఖ పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

15న తీరాన్ని తాకనున్న బిపర్‌జోయ్

- గంటకు 150 కి.మీ. వేగంతో గాలులు
- 7,500 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- అందుబాటులోకి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: అత్యంత తీవ్రంగా మారిన బిపర్‌జోయ్ తుపాను ఈ నెల 15న గుజరాత్‌లోని జఖౌ పోర్టు వద్ద తీరాన్ని తాకనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. అరేబియా సముద్ర తీర ప్రాంత జిల్లాలైన కచ్, పోరుబందర్, ద్వారక, జామ్‌నగర్, జునాగఢ్, మోర్బిల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని అధికారులు తెలిపారు. ' 15వ తేదీ మధ్యాహ్నానికి బిపర్‌జోయ్ తుపాను జఖౌ పోర్టు వద్ద తీరాన్ని తాకే అవకాశాలున్నాయి. ఆ సమయంలో గంటకు గరిష్ఠంగా దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చు. అతి భారీ వర్షాలు కురుస్తాయి' అని గుజరాత్‌లోని ఐఎండీ కేంద్రం డైరెక్టర్ మనోరమ మహంతి చెప్పారు. ఈ నెల 15, 16 తేదీల్లో సౌరాష్ట్ర–కచ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలను ఎగురవేయడంతోపాటు 16వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటను వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. సుమారు 7,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కచ్–సౌరాష్ట్ర జిల్లాల్లో తీరానికి 10 కిలోమీటర్ల లోపు దూరంలోని గ్రామాల వారిని మంగళవారం నుంచి తరలిస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉండే సుమారు 10 వేల మందిని తాత్కాలిక షెల్టర్లలో ఉంచుతామని కచ్ కలెక్టర్ అమిత్ అరోరా చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన 12 బృందాలు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. ఆర్మీ, నేవీ, కోస్ట్‌గార్డ్ సిబ్బందిని సిద్ధంగా ఉంచారు.

తక్షణమే చర్యలు తీసుకోండి: ప్రధాని

తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశించారు. సోమవారం ఆయన ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 'తుపాను ప్రభావంతో విద్యుత్, టెలీకమ్యూనికేషన్స్, ఆరోగ్యం, తాగునీరు వంటి అత్యవసర సౌకర్యాలకు ఇబ్బంది కలిగినట్లయితే వెంటనే పునరుద్ధరించాలని ప్రధాని ఆదేశించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ)తెలిపింది. ఇందుకు గాను కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారని తెలిపింది. తపానుతో ఉత్పన్నమైన పరిస్థితులను తెలుసుకునేందుకు హోం శాఖ రాష్ట్ర యంత్రాంగంతో నిరంతరం టచ్‌లో ఉంటుందని పీఎంఓ వివరించింది. ఈ సమావేశానికి హోం మంత్రి అమిత్ షా, ఐఎండీ డీజీ మృత్యుంజయ్ తదితరులు హాజరయ్యారు.

ఇటలీ మాజీ ప్రధాని బెర్లుస్కోనీ మృతి



రోమ్: ఇటలీలో మీడియా దిగ్గజంగా ఎదిగి రాజకీయాల్లోనూ రాణించి మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన సిల్వియో బెర్లుస్కోనీ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు 89 సంవత్సరాలు. కొన్నాళ్లుగా లుకేమియాతో బాధపడుతున్న ఆయన శుక్రవారం మిలాన్ నగరంలోని శాన్ రఫేల్ ఆస్పత్రిలో కన్నుమూశారని ఇటలీ మీడియా తెలిపింది. హృద్రోగ సమస్యలు, ప్రోస్టేట్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన 2020లో కోవిడ్‌కారణంగా ఆస్పత్రి పాలయ్యారు. తొలుత బెల్లీ డ్యాన్సర్, తర్వాత మీడియా రంగంలో వేలకోట్లు సంపాదించి రాజకీయాల్లో అడుగుపెట్టిన ఏడాదికే ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ సంకీర్ణ ప్రభుత్వంలో బెర్లుస్కోనీకి చెందిన ఫోర్జా ఇటాలియా భాగస్వామిగా ఉంది.

బుంగా బుంగా పార్టీలతో అప్రతిష్టపాలు

వేశ్యలు, మైనర్ బాలికలతో మిలాన్‌లోని ఆర్కోల్ విల్లాలో బుంగా బుంగా పేరుతో జరిగిన పార్టీలు బెర్లుస్కోని విచ్చలవిడి వ్యక్తిగత జీవిత కోణాన్ని బట్టబయలు చేశాయి. పలువురు మహిళలతో, టీనేజీ అమ్మాయిలతో సంబంధాలు కొనసాగించారు. 1936 సెప్టెంబర్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఈయన బెల్లీ డ్యాన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించి తర్వాతి వార్తా పత్రికలు, దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ టీవీ నెట్‌వర్క్‌లు, అడ్వర్టైజింగ్, సినిమా సంస్థలు, ఏసీ మిలాన్ సాకర్ టీమ్, రియల్ ఎస్టేట్ ఇలా పలు వ్యాపారాల్లో వేలకోట్లు గడించి దేశంలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరిగా నిలిచారు. 1990లలో రాజకీయాల్లోకొచ్చి ప్రధాని అయ్యారు. ఈయనపై ఎన్నో కేసులు నమోదైనా కేవలం పన్నుల కేసులోనే దోషిగా తేలారు. 76 ఏళ్ల వయసుకారణంగా శిక్ష నుంచి తప్పించుకున్నారు.


కొలంబియా దేశంలోని సుటమర్చన్ నగరంలో వార్షిక టొమాటో ఫైట్ ఫెస్టివల్ 'టొమాటినా'లో హుషారుగా పాల్గొన్న ప్రజలు

రష్యా ఆక్రమణ నుంచి 4 గ్రామాలకు విముక్తి

కీవ్: రష్యా ఆక్రమణలోని మరో గ్రామాన్ని తిరిగి తాము స్వాధీనం చేసుకున్నట్లు ఉక్రెయిన్ తెలిపింది. డొనెట్స్క్ ప్రాంతంలోని మూడు గ్రామాలు స్వాధీనమైనట్లు ఆదివారం ప్రకటించింది. సోమవారం సారొఝిప్ అనే గ్రామంపై ఉక్రెయిన్ పతాకం మళ్లీ ఎగిరిందని రక్షణ శాఖ పేర్కొంది. ఇవన్నీ కుగ్రామాలేనని సమాచారం. అయితే, ఉక్రెయిన్ బలగాలు ఆక్రమిత ప్రాంతాల్లోకి మరింత ముందుకు చొచ్చుకుపోయేందుకు ఈ స్వల్ప విజయాలే అవకాశం కల్పిస్తాయని పరిశీలకులు అంటున్నారు. ఈ పరిణామంపై రష్యా స్పందించలేదు. రష్యా మిలటరీ బ్లాగర్లు మాత్రం.. ఉక్రెయిన్ పేర్కొంటున్న నాలుగు గ్రామాల నుంచి రష్యా బలగాలు ఉపసంహరించుకున్నాయని ప్రకటించారు.


ఉక్రెయిన్‌లోని కఖోవ్‌కా జలాశయం ధ్వంసం కావడంతో ఖెర్సన్‌లో నీట మునిగిన ఇళ్లు

జెపొరిజియా తదితర ప్రాంతాల్లో ఇరు పక్షాల మధ్య భీకర పోరు సాగుతోందని చెబుతున్నారు. ఇన్నాళ్ల యుద్ధంలో ఉక్రెయిన్‌లోని ఐదో వంతు భాగం రష్యా బలగాల చేతుల్లోకి వెళ్లిపోయింది.

శిక్ష పడినా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్: తన ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా రాజకీయ ప్రత్యర్థులు అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్(76) ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్లేవని అన్నారు. అమెరికా అధ్యక్ష పోరు నుంచి తనను తప్పించేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని విమర్శించారు. తాజాగా ఉత్తర కరోలినా, జార్జియాలో రిపబ్లికన్ల సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో తాను నెగ్గకుండా ఉండేందుకే విచారణ చేపట్టారని చెప్పారు. ఎవరు ఎన్ని రకాలుగా వేధింపులకు గురి చేసినా, తనకు శిక్ష పడినా సరే వచ్చే ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీపడడం ఖాయమని తేల్చిచెప్పారు. తాను ఏ తప్పూ చేయలేదని పేర్కొన్నారు. రిపబ్లికన్‌ను కావడం వల్లే తనను వేధిస్తున్నారని, తనపై ప్రారంభించిన విచారణ ప్రక్రియ అమెరికా చరిత్రలోనే అతిపెద్ద అధికార దుర్వినియోగంగా మిగిలిపోతుందని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. తనను ఎన్నిక రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా సరే రాజకీయాల నుంచి విరమించుకొనే ప్రసక్తే లేదన్నారు. అధ్యక్ష పదవి నుంచి దిగిపోయినప్పుడు ప్రభుత్వ అధికారిక పత్రాలను ట్రంప్ తన ఇంటికి తీసుకెళ్లారన్న ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రంప్ విచారణను ఎదుర్కొంటున్నారు. విచారణలో భాగంగా మంగళవారం కోర్టుకు హాజరుకానున్నారు.

ఎంబీబీఎస్ 9 ఏళ్లలో పూర్తి చేయాలి

- ఫస్టియర్ నాలుగు ప్రయత్నాల్లోనే గట్టెక్కాలి
- ఎన్ఎంసీ తాజా నిబంధనలు




న్యూఢిల్లీ: ఎంబీబీఎస్ కోర్సును విద్యార్థులు తొమ్మిదేళ్లలోగా పూర్తి చేయాలని, ఫస్టియర్‌ను నాలుగు ప్రయత్నాల్లో పూర్తి చేయాలని నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) తాజాగా నిబంధనలు తీసుకువచ్చింది. ఈ మేరకు ఈ నెల 2న గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్–2023(జీఎంఈఆర్–23) గెజిట్‌ను విడుదల చేసింది. అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులో అడ్మిషన్ పొందిన తేదీ నుంచి తొమ్మిదేళ్లలోగా ఆ కోర్సును విద్యార్థులు పూర్తి చేయాలి. ఎంబీబీఎస్ కోర్సులో మొదటి సంవత్సరం పూర్తి చేసేందుకు విద్యార్థులకు ఎట్టిపరిస్థితుల్లోనూ నాలుగుకు మించి ప్రయత్నాలకు అవకాశమివ్వరు. వైద్య సంస్థల్లో గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్–యూజీ మెరిట్ లిస్ట్ ప్రాతిపదికన ఉమ్మడి కౌన్సెలింగ్ ఉండాలి.

'పద్మ' గ్రహీతలకు రూ.10 వేల పింఛను

చండీగఢ్: తమ రాష్ట్రానికి చెందిన పద్మ అవార్డు గ్రహీతలకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛను అందజేయనున్నట్లు హరియాణా సీఎం ఖట్టర్ ప్రకటించారు. పద్మ అవార్డులైన పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ గ్రహీతలకు పింఛనుతోపాటు ప్రభుత్వ వోల్వో బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కలిస్తామన్నారు. ఏడాదికి రూ.1.8–రూ.3 లక్షల మధ్య ఆదాయం ఉన్న కుటుంబాలకు కొంత ప్రీమియంతో రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

హైకోర్టులో రాహుల్‌కు ఉపశమనం



ముంబై: ప్రధాని నరేంద్ర మోదీని దొంగగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారంటూ దాఖలైన కేసులో ఆయనకు బాంబే హైకోర్టులో ఉపశమనం లభించింది. కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపునిస్తూ ఇచ్చిన గడువును ఆగస్టు రెండో తేదీ దాకా పొడిగిస్తూ సోమవారం బాంబే హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తనకు మరికొంత సమయంకావాలని ఫిర్యాదుదారు న్యాయవాది కోరడంతో కోర్టు ఈ నిర్ణయంతీసుకుంది. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు విషయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ 2018 సెప్టెంబర్‌లో రాజస్తాన్‌లోని ఓ ర్యాలీలో మోదీని 'కమాండర్–ఇన్–తీఫ్(దొంగల ముఠా పెద్ద)' అని రాహుల్ దూషించి పరువు తీశారని బీజేపీ కార్యకర్త మహేశ్ .. రాహుల్‌పై పరువునష్టం దావా వేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందింది. చోటేబెతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్‌నంద్‌గావ్–కాంకేర్ జిల్లా సరిహద్దు డివిజన్‌లో 25 మంది వరకు సాయుధ మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ, 132వ బెటాలియన్ బీఎస్ఎఫ్ బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం బినాగుండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన హోరాహోరీ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులు పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో ఒక మహిళా మావోయిస్టు మృతదేహం కనిపించింది.

'పొద్దుతిరుగుడు'కు మద్దతు ధర ఇవ్వాలి

కురుక్షేత్ర: పొద్దుతిరుగుడు విత్తనాలకు మద్దతు ధర డిమాండ్‌తో హరియాణాలోని కురుక్షేత్ర జిల్లాలో సోమవారం రైతులు ఢిల్లీ–చండీగఢ్ హైవేపై బైఠాయించారు. పొద్దుతిరుగుడుకు కనీస మద్దతు ధర డిమాండ్‌పై భారతీయ కిసాన్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు పింప్లి ధాన్యం మార్కెట్‌లో సోమవారం మహాపంచాయత్ జరిగింది. సమావేశంలో రైతు నేత కరం సింగ్ మథానా మాట్లాడుతూ.. రైతుల డిమాండ్లపై చర్చించేందుకు సీఎం ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, ఆ తర్వాత మాట మార్చారని ఆరోపించారు.

యునెస్కోలోకి మళ్లీ అమెరికా!

చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకే

పారిస్: అంతర్జాతీయ వాణిజ్యం, ఎగుమతులు, ప్రపంచదేశాలతో సత్సంబంధాల్లో 'పెద్దన్న' అనే పేరు కోసం తమతో పోటీపడుతున్న చైనాను నిలువరించేందుకు అమెరికా మరో అడుగు ముందుకేసింది. యునెస్కోలోని చైనా పలుకుబడిని తగ్గించేందుకే అమెరికా ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కృత్రిమ మేథ, సాంకేతిక విద్య వంటి అంశాల్లో యునెస్కోలో ప్రపంచవ్యాప్తంగా పాటించే ప్రమాణాలు, విధాన నిర్ణయాలను తనకు అనువుగా మార్చేందుకు చైనా యత్నిస్తోందని ఇటీవల అమెరికా ఉన్నతాధికారి ఒకరు ఆరోపించడం తెల్సిందే. దీంతో యునెస్కోలో తాజా సభ్యత్వం కోసం అమెరికా రంగంలోకి దిగుతోంది. యునెస్కోలో అమెరికా మళ్లీ చేరబోతున్నట్లు ఆ దేశ అధికారులు సోమవారం ప్రకటించారు. గతంలో పాలస్తీనాను సభ్యదేశంగా చేర్చుకునే అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన అమెరికా యునెస్కో నుంచి తప్పుకుంటానని బెదిరించింది. 2017లో నాటి ట్రంప్ సర్కార్ యునెస్కో నుంచి వైదొలగింది. ఆనాటి నుంచి దాదాపు రూ.5,100 కోట్ల విరాళాలు ఆపేసింది. తాజాగా ఆ నిధులన్నీ చెల్లిస్తామంటూ యునెస్కో మహిళా డైరెక్టర్ జనరల్ ఆండ్రీ ఆజౌలేకు అమెరికా ఉన్నతాధికారి రిచర్డ్ వర్మ లేఖ రాశారు. గతంలో యునెస్కోకు అమెరికానే అతిపెద్ద దాతగా ఉండేది. ఇది యునెస్కోకు చరిత్రాత్మక ఘటన అంటూ అమెరికా తాజా నిర్ణయాన్ని ఆండ్రీ స్వాగతించారు.

సివిల్స్ ప్రిలిమినరీ ఫలితాలు విడుదల

అర్హత సాధించిన 14,624 మంది

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన సివిల్స్–2023 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను యూపీఎస్సీ సోమవారం వెల్లడించింది. ఈ పరీక్షలో 14,624 మంది అర్హత సాధించారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ వంటి ఆలిండియా సర్వీసెస్‌ల కోసం యూపీఎస్సీ ప్రతీ ఏటా ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూ ఇలా మూడు దశల్లో సివిల్స్ పరీక్షను నిర్వహిస్తున్న విషయం విదితమే. 2023 సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను మే 28వ తేదీన నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల సీరియల్ నంబర్, పేరు, రోల్ నంబర్లను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 'ఈ ప్రొవిజనల్ అభ్యర్థులంతా సివిల్స్ మెయిన్ కోసం డిటేల్డ్ అప్లికేషన్ ఫామ్–1 (డీఏఎఫ్–1)ను నింపి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది' అని యూపీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది. డీఏఎఫ్–1కు పాటించాల్సిన నియమాలు, దరఖాస్తు తేదీ తదితర వివరాలను త్వరలోనే వెబ్‌సైట్‌లో వెల్లడించనున్నారు. 2023 సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ మొత్తం ప్రక్రియ పూర్తయ్యాకే అభ్యర్థులు పొందిన మార్కులు, కటాఫ్ మార్కులు, సీఎస్(పీ) ఎగ్జామినేషన్ ఆన్సర్ కీను https://upsc.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేస్తామని యూపీఎస్సీ స్పష్టంచేసింది. సందేహాలుంటే ఢిల్లీలోని యూపీఎస్సీ కార్యాలయంలో నేరుగా లేదా ఫోన్‌లో వాకబు చేయవచ్చు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 13 । జూన్ । 2023

బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: బల్కంపేట ఎల్లమ్మ వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా ఈ నెల 19, 20 తేదీల్లో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు సోమవారం ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకన్న తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకొనే విధంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నారు.



తొలి రోజు అంతంతే..

వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థుల హాజరు శాతం అంతంతమాత్రంగానే ఉంది. -8లో

ఉష్ణోగ్రత

గరిష్ఠం	కనిష్ఠం
38.8°	26.5°





కార్యక్రమంలో పాల్గొన్న సినీతార శ్రీలీల

2కే రన్.. సూపర్



దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన తెలంగాణ రన్ ఉల్లాసంగా సాగింది. పోలీసు శాఖ, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై నెక్లెస్ రోడ్డు మీదుగా జరిగిన ఈ రన్‌లో నగరవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. –ఖైరతాబాద్





ఆద్య కళ అదరహో!

నగరంలోని సాలార్‌జంగ్ మ్యూజియంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆద్య కళల ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంది. అడవుల్లో ఆదివాసీలు వినియోగించిన కళా ఖండాలు, సంగీత వాద్యాలు సహా 2 వేల పైచిలుకు కళాఖండాలను ప్రదర్శనలో పెట్టారు. – బహదూర్‌పురా





న్యూస్‌రీల్

ఫిట్‌లెస్‌పై ఆర్టీఏ కొరడా

- 13 స్కూల్ బస్సులు సీజ్

సాక్షి, సిటీబ్యూరో: సామర్థ్యం లేని బడి బస్సులపై ఆర్టీఏ కొరడా ఝుళిపించింది. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజు సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్టీఏ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 13 బస్సులను సీజ్ చేశారు. నగరంలోని ఖైరతాబాద్, మెహిదీపట్నం, మలక్‌పేట్, సికింద్రాబాద్, బండ్లగూడ ప్రాంతీయ రవాణా కార్యాలయాల పరిధిలో మొత్తం 2,359 స్కూల్ బస్సులు ఉండగా, వాటిలో 1,443 బస్సులు ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్నట్లు గుర్తించారు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో పిల్లలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సంయుక్త రవాణా కమిషనర్ పాండురంగ్ నాయక్ హెచ్చరించారు.

ఐటీ టవర్స్‌కు బాంబు బెదిరింపు

- ఫేక్ కాల్ అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న ఉద్యోగులు



నాంపల్లి: ఏసీ గార్డ్స్‌లోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం (ఐటీ టవర్స్)కు సోమవారం బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. ఐటీ టవర్స్‌ను కాసేపట్లో పేల్చేస్తామంటూ ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు. సోమవారం మధ్యాహ్నం 12.50 గంటలకు డయల్ 100కు ఫోన్ కాల్ వచ్చింది. మెయిన్ కంట్రోల్ విభాగం సిబ్బంది వెంటనే నాంపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు ఉద్యోగులందరినీ బయటకు పంపించారు. అనంతరం ఐటీ టవర్స్‌ను పూర్తిగా బాంబు స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. టవర్స్‌లోని అన్ని అంతస్తులను క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఎక్కడా బాంబు లేదని, ఫోన్ కాల్ ఫేక్ అని తేలడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఆగస్టు 26న హైదరాబాద్ మారథాన్




బంజారాహిల్స్: హైదరాబాద్ రన్నర్స్ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్– 2023 పన్నెండో ఎడిషన్‌ను ప్రకటించింది. సోమవారం బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మారథాన్‌కు సంబంధించిన అధికారిక రేస్ టీషర్ట్‌ను ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ సీవోవో టీవీ. నారాయణ ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్, రేస్ డైరెక్టర్ ప్రశాంత్ మోర్పారియాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమితవ ముఖర్జీ మాట్లాడుతూ.. ది ఎన్ఎండీసీ మారథాన్ అనేది ఫిట్ ఇండియా ఉద్యమానికి ఒక ఐకానిక్ వంటిదని తెలిపారు. దేశ విదేశాల నుంచి 20 వేల మంది మారథాన్‌లు ఇందులో పాల్గొంటున్నారని చెప్పారు. నిఖత్ జరీన్ మాట్లాడుతూ.. హైదరాబాదీలు ఈ మారథాన్‌లో భారీ సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 26న హైటెక్స్‌లో 5కే రన్, 27న మారథాన్ హాఫ్‌మారథాన్, 10 కే నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

దేశంలోనే అతిపెద్ద ఆస్పత్రిగా..

ప్రపంచస్థాయి ప్రమాణాలతో..

- నిమ్స్ ఓపీడీ బ్లాక్ నిర్మాణానికి అంతా సిద్ధం
- రూ.1,571 కోట్ల వ్యయంతో పనులు
- 2 వేల పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- 14న భూమి పూజ చేయనున్న సీఎం కేసీఆర్
- కార్యక్రమాల నిర్వహణకు ఆరు కమిటీలు
- సభా ఏర్పాట్లను పరిశీలించిన హరీష్‌రావు



లక్డీకాపూల్: దేశంలో అది అతిపెద్ద ఆస్పత్రిగా అవతరించనుంది. ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో పరిఢవిల్లనుంది. 2 వేల పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రసిద్ధిగాంచనుంది. రూ.1,571 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భవన సముదాయం ప్రత్యేక గుర్తింపు పొందనుంది. నిమ్స్‌కు అనుబంధంగా ఏర్పాటు చేయనున్న కొత్త ఓపీడీ భవన సముదాయ భూమి పూజను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. శంకుస్థాపన కార్యక్రమం జయప్రదంగా జరిగేందుకు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆస్పత్రి వైద్యులు, ఉద్యోగులు, హెల్త్ కేర్ సిబ్బందితో ఆరు కమిటీలను ఏర్పాటు చేశారు.

కమిటీలు ఇలా..

ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సి.నగేష్‌తో పది మంది సభ్యులతో రిసెప్షన్ కమిటీని నియమించారు. గైనకాలజీ విభాగం వైద్యులు జి. రాధిక, న్యూరోసర్జన్ హెచ్ఓడీ డా. సుచంద్ర భట్టాచారిజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు డా. జి. సునీల్ కుమార్‌లతో డయాస్ కమిటీలను నియమించారు. డిప్యూటీ మేనేజర్ వై.వి.రాధిక, ఎంఆర్‌డీ టెక్నీషియన్ కె.మహేష్ బాబులతో ఆహ్వాన కమిటీ, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.కృష్ణారెడ్డిలతో పాటు ఏడుగురితో శానిటేషన్ కమిటీ, ఫుడ్ అండ్ క్యాటరింగ్ బాధ్యతలను పూర్తిగా అడిషినల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. లక్ష్మీభాస్కర్‌కి అప్పగించారు. ఏడుగురు సభ్యులతో వీఐపీ డైనింగ్ కమిటీ, ఆరుగురితో డాక్టర్స్ డైనింగ్, అయిదుగురితో నాన్ డాక్టర్స్ డైనింగ్, మరో అయిదుగురు సభ్యులతో నిమ్స్ స్టాఫ్ డైనింగ్ కమిటీ, అయిదుగురు సభ్యులతో రిఫ్రెష్‌మెంట్ కమిటీలను వేశారు. సోమవారం ఈ మేరకు డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఉత్తర్వులు జారీ చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు.

మొత్తం నాలుగు బ్లాక్‌లుగా..

కొత్త ప్రాంగణంలో నిర్మితమయ్యే భవనాల ద్వారా 120 ఓపీడీ చాంబర్లు, 1200 ఆక్సిజన్ పడకలు, 500 ఐసీయూ పడకలు, 32 మేజర్ మాడ్యులర్ థియేటర్లు, 6 మేజర్ మాడ్యులర్ ఎమర్జెన్సీ థియేటర్లు, 38 వైద్య విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ నాలుగు బ్లాక్‌లుగా నిర్మించే భవనాల్లో ఏర్పాటవుతాయి. 23,96,542.34 చదరపు అడుగుల విస్తీర్ణంలో 'బ్లాక్ ఎ' ఓపీడీ బ్లాక్ (జీఎఫ్ + జీ + 8) నిర్మితమవుతుంది. బ్లాక్ బీలో (ఎల్ జీ ఎఫ్ + జీ + 13) అంతస్తుల ఐపీడీ బ్లాక్, బ్లాక్ సీ లో (ఎల్ జీ ఎఫ్ + జీ + 8) అంతస్తుల ఎమర్జెన్సీ బ్లాక్, బ్లాక్ డీలో జీ + 14 అంతస్తుల ఐపీడీ బ్లాక్‌ను నిర్మించనున్నారు. ఈ నాలుగు బ్లాక్‌ల ద్వారా అదనంగా 2,000 పడకలు అందుబాటులోకి రానున్నాయి. పనులు 36 నెలల్లో పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా..

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 14న జరుపుకొనే వైద్యారోగ్య దినోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.1,571 కోట్లతో నిర్మించబోయే 2 వేల పడకల అతి పెద్ద ఆస్పత్రి భవనానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. 32 ఎకరాల 16 గుంటల విస్తీర్ణంలో నాలుగు బ్లాకులతో కూడిన భవన సముదాయ నిర్మాణ పనులను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో నిమ్స్ విస్తరణ పనులు చేపట్టారు.



ఏర్పాట్లను పరిశీలించిన హరీశ్ రావు..

వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ కొత్త బ్లాక్‌కు భూమి పూజ చేస్తారని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు తెలిపారు. సోమవారం ఆయన ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. నిమ్స్ యాజమాన్యం తీసుకున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. భూమిపూజ అనంతరం నిర్వహించే సభ ఏర్పాట్ల గురించి అధికారులకు ఆయన సూచనలు చేశారు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు.



నిమ్స్ ఓపీడీ నమూనా చిత్రం

తవుడు మూటల్లో గంజాయి ప్యాకెట్లు

మహారాష్ట్రకు తరలిస్తున్న స్మగ్లర్లు

- 8 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- మూడు చోట్ల రూ.2.86 కోట్ల విలువైన 910 కిలోల గంజాయి స్వాధీనం
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: పైన చూస్తే అవి తవుడు మూటలు.. తెరిచి చూస్తే వాటిలో కిలోల కొద్దీ గంజాయి ప్యాకెట్లు. ఇవి భారీ ఎత్తున బయటపడటంతో సైబరాబాద్ పోలీసులు విస్తుపోయారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 758 కిలోల ఎండు గంజాయిని వెలికి తీశారు. మరో కేసులో 144 కిలోలు, ఇంకో కేసులో 8 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. మూడు కేసుల్లో మొత్తం 2.86 కోట్ల విలువైన 910 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. హరియాణాకు చెందిన జీవన్ సింగ్‌కు నగరంలోని పర్వేజ్ ద్వారా ఒడిశాలోని జైపూర్‌కు చెందిన చంద్రశేఖర్ పరిచయమయ్యాడు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అంకిత్ సింగ్‌తో కలిసి ఎండు గంజాయిని మహారాష్ట్రకు రవాణా చేయాలని చంద్రశేఖర్‌ను కోరాడు. ఒడిశాలోని డోరిగుమ్మ శివార్లలో తవుడు బస్తాల్లో ఎండు గంజాయి ప్యాకెట్లను డీసీఎంలో లోడ్ చేశారు. షోలాపూర్‌లో డెలివరీ చేసేందుకు సోమవారం తెల్లవారుజామున బయలుదేరారు. ఈ క్రమంలో విషయం బాలానగర్ ఎస్ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో జీడిమెట్ల పోలీసులతో కలిసి షాపూర్ ప్రాంతానికి చేరుకున్నారు. డీసీఎం వ్యాన్‌ను తనిఖీ చేయగా తవుడు బస్తాల్లోని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీవన్ సింగ్, అంకిత్ సింగ్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 758 కిలోల ఎండు గంజాయి, డీసీఎం వ్యాన్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జీవన్ సింగ్‌పై గంజాయి రవాణా కేసులో 2021లో ఏపీలో మొత్తుగూడెం పీఎస్‌లో కేసు నమోదైందని పోలీసులు తెలిపారు.

గాజుల కింద గంజాయి..

మహారాష్ట్రకు చెందిన బాలు, ప్రదీప్ ఫకీరా సిరాసత్‌లు కొంత కాలంగా ఒడిశా బెర్హంపూర్ నుంచి ఎండు గంజాయిని మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలోనే వీరిద్దరు కలిసి ఒడిశాకు చెందిన మున్నాను సంప్రదించారు. ప్యాకెట్లలో పైన గాజులు కప్పి ఉంచి కింద గంజాయి ప్యాకెట్లు పెట్టారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ఒడిశా నుంచి శంషాబాద్‌లోని తొండుపల్లికి చేరుకున్నారు. రాజేంద్రనగర్ ఎస్ఓటీ, శంషాబాద్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి చూడగా పైన గాజులు.. కింద గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. రూ.43,20,000 విలువైన 144 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ప్రదీప్, అనీల్ శ్యామ్ రావు, బాలు సాహెబ్ పిరాజీ, కమల్ శివాజీ షిండే, శాంతాబాయి పాండేలను అరెస్ట్ చేశారు. బాలు, మున్నాలు పరారీలో ఉన్నారు.

నల్లగండ్లలో 8 కిలోలు..

బీదర్‌కు చెందిన శివాజీ కాశీనాథ్ 15 ఏళ్ల క్రితం మియాపూర్‌కు వలస వచ్చి తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో నల్లగండ్ల ఎక్స్ రోడ్డులో గంజాయి విక్రయించేందుకు యత్నిస్తుండగా ఎస్ఓటీ మాదాపూర్, చందానగర్ పోలీసులు పట్టుకున్నారు. బ్యాగు తనిఖీ చేయగా రూ.2,40 లక్షల విలువైన 8 కిలోల 6 గంజాయి ప్యాకెట్లు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన నారాయణ్‌ఖేడ్‌కు చెందిన కాంతియా పరారీలో ఉన్నాడు. విలేకరుల సమావేశంలో ఎస్ఓటీ డీసీపీ రషీద్, డీసీపీలు శ్రీనివాస్ రావు, నారాయణ రెడ్డి, ఎస్ఓటీ అడిషినల్ డీసీపీ నారాయణ, శోభన్ కుమార్ పాల్గొన్నారు.

ఫుడ్ కోర్ట్‌లో పేలిన సిలిండర్లు

మంటల్లో దగ్ధమైన హోటల్



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గచ్చిబౌలి: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుని ఫుడ్ కోర్ట్‌లోని గ్యాస్ సిలిండర్లు పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. హోటల్ సిబ్బంది అప్రమత్తం కావడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. మాదాపూర్ సీఐ తిరుపతి, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని సాయినగర్‌లో సత్యనారాయణ వ్యక్తికి చెందిన నవ్యశ్రీ ఫుడ్‌కోర్ట్‌లో టిఫిన్ సెంటర్, కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 1.35 గంటలకు షార్ట్ సర్క్యూట్ కారణంగా కూరగాయల దుకాణంలోకి మొదట మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమై ఫుడ్ కోర్ట్‌లోని నాలుగు సిలిండర్లు బయటికి తీశారు. ఆలోపే మంటలు అంటుకోవడంతో రెండు సిలిండర్లను అక్కడే వదిలేశారు. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో రెండు సిలిండర్లు పేలిపోయాయి. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఆందోళనకు గురై పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అప్రమత్తమై మంటలను ఆర్పారు. ఫుడ్ కోర్టు, కూరగాయల దుకాణం కాలిపోవడంతో దాదాపు 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

మృత్యుదారులు

మూడుచోట్ల రోడ్డు ప్రమాదాలు

- ముగ్గురు వ్యక్తుల దుర్మరణం



శివ (ఫైల్)

చైతన్యపురి: నగరంలోని మూడు ప్రాంతాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. సరూర్‌నగర్‌లో యువకుడు, రాజేంద్రనగర్‌లో మహిళ, హయత్‌నగర్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగిని మృత్యువు కబళించింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. సంతోష్‌నగర్ దామోదరం సంజీవయ్య కాలనీకి చెందిన గండికోట సైదులు చిన్న కుమారుడు శివ (21) ఫ్లవర్ డెకరేషన్ పని చేస్తుంటాడు. సోమవారం ఉదయం బైక్‌పై తన స్నేహితులు శివ, జగదీష్ బైరామల్‌గూడకు బయలుదేరారు. కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలో బైక్ స్కిడ్ కావడంతో ముగ్గురూ కిందపడ్డారు. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన బస్సు శివ తలపై నుంచి వెళ్లింది. దీంతో గండికోట శివ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఇద్దరు స్నేహితులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తీరును సీసీ ఫుటేజ్ ద్వారా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొని..

హయత్‌నగర్: ఎదురుగా వస్తున్న బైకును వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మి నగర్‌కు చెందిన కాకుమాని చంద్రశేఖర్ (34), సుకన్య ప్రైవేట్ ఉద్యోగులు. వీరికి ఒక కూతురు. చంద్రశేఖర్ ఉద్యోగ నిమిత్తం రోజూ ఆటోనగర్ వెళుతుండేవాడు. ఆదివారం అర్ధరాత్రి మునుగనూరు నుంచి బైకుపై ఇంటికి బయలుదేరాడు. హయత్‌నగర్‌లోని చింతచెట్ల వద్దకు రాగానే ఎదురుగా ఓ కారు వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్‌ను తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

లారీ టైర్ల కింద నలిగి..

రాజేంద్రనగర్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వెనక టైర్ల కిందపడి ఓ మహిళ మృతి చెందింది. బేగంబజార్‌కు చెందిన దుర్గాదేవి(45), ఆమె భర్త బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో జల్‌పల్లి నుంచి మైలార్‌దేవ్‌పల్లి వైపు లారీ వెళ్తోంది. రాజేంద్రనగర్‌లోని లక్ష్మిగూడ వద్ద లారీకి ఎదురుగా గుర్రం వచ్చింది. దీంతో డ్రైవర్ లారీని పక్కకు తిప్పాడు. ఈ సమయంలో లారీ బైక్‌కు తగలడంతో దంపతులిద్దరూ రోడ్డుపై పడిపోయారు. దుర్గాదేవి తలపై నుంచి లారీ వెనుక టైర్లు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.



ఘటనా స్థలంలో దుర్గాదేవి మృతదేహం

బ్యాంక్ అకౌంట్స్ ఫ్రమ్ బస్తీ!

- సైబర్ నేరాల్లో ఈ ఖాతాలే కీలకం
- వీటి కోసం బస్తీల్లో నడుస్తున్న భారీ నెట్‌వర్క్
- ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్ కేసు దర్యాప్తులో గుర్తింపు
- నలుగురు నిందితుల పోలీసు కస్టడీ గడువు పూర్తి
- కోర్టులో హాజరుపరిచిన సైబర్ క్రైమ్ పోలీసులు
- జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం జైలుకు తరలింపు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ బాధితుడు ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లో రూ.15,76,632 నష్టపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల నలుగురు నిందితులను అరెస్టు చేశారు. న్యాయస్థానం అనుమతితో ఈ నలుగురినీ తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలోనే సైబర్ నేరాల్లో కీలకమైన బ్యాంకు ఖాతాల కోసం ఓ భారీ నెట్‌వర్క్ పని చేస్తోందని, బస్తీవాసుల అవసరాలను ఆసరాగా చేసుకుని వీళ్లు తమ దందా నడుపుతున్నారని వెలుగులోకి వచ్చింది. ఈ నలుగురు నిందితుల పోలీసు కస్టడీ సోమవారంతో ముగియడంతో కోర్టులో హాజరుపరిచిన పోలీసులు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇలాంటి నెట్‌వర్క్స్ ఉత్తరాదిలోని అనేక బస్తీల్లో నడుస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పాత్రధారిగా మారిన సూత్రధారి...

సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన బాధితుడు నగదు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కదిరి ప్రాంతానికి చెందిన పాలం తాజుద్దీన్ పేరు వెలుగులోకి వచ్చింది. ఇతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బెంగళూరు వాసి నజీమ్ ఖుమ్రన్ కోరిన మీదట ఓ బ్యాంకు ఖాతా తెరిచి అందించానని, దీని నిమిత్తం తనకు రూ.10 వేలు ముట్టాయని వెల్లడించాడు. బెంగళూరుకు చెందిన నజీమ్ గతంలో సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు అందించడంలో సూత్రధారిగా ఉండేది. ఓ సందర్భంలో ఈమెకు తన స్నేహితుడి ద్వారా సూరత్‌కు చెందిన హుస్సేన్ అహ్మద్ మహ్మద్ సఫీ దలతో పరిచయమైంది. ఇద్దరి వృత్తీ వస్త్రవ్యాపారమే కావడంతో స్నేహితులయ్యారు. దుబాయ్ కేంద్రంగా సైబర్ నేరాలు చేసే వాళ్లకు ఇతగాడు బ్యాంకు ఖాతాలు సమకూరుస్తూ ఉంటాడు. తనకు బ్యాంకు ఖాతాలు అందిస్తే ఒక్కో దానికి రూ.40 వేలు చొప్పున చెల్లిస్తానంటూ చెప్పడంతో అంగీకరించిన నజీమ్ అతడి ఆధీనంలో పని చేయడం మొదలెట్టింది.

దుబాయ్ తీసుకువెళ్లి ఇచ్చి వస్తుంటాడు...

బెంగళూరులోని వివిధ బస్తీల వారితో నజీమ్ సన్నిహితంగా మెలుగుతుంది. ఆర్థిక అవసరాలు, ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తిస్తుంది. వారి రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుని గుర్తింపు పత్రాలు తీసుకుంటుంది. వీటిని హుస్సేన్ అహ్మద్‌కు చేరుస్తుంది. ఇతగాడు సూరత్‌కే చెందిన వసీం అహ్మద్‌తో కలిసి అతడి వైపై వాడుతూనే తమ వద్ద ఉన్న బస్తీ వాసుల వివరాలతో ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతాలు తెరుస్తాడు. ఈ ఖాతాలకు అనుసంధానించడానికి ప్రత్యేకంగా సిమ్ కార్డులు సమీకరిస్తాడు. బ్యాంక్ అకౌంట్లకు సంబంధించిన పాస్‌బుక్, యూజర్ ఐడీ–పాస్‌వర్డ్, ఏటీఎం కార్డు తదితరాలతో కూడిన కిట్లు బ్యాంక్ నుంచి ఆయా బస్తీ వాసులకే కొరియర్ ద్వారా చేరతాయి. వీటిని తీసుకునే నజీమ్ ఒప్పందం చేసుకున్న మొత్తం వారికి అందిస్తుంది. ఇవన్నీ తీసుకువెళ్లి హుస్సేన్‌కు అప్పగిస్తుంది. ఇతగాడు ఇలా పదిపదిహేను మందికి సంబంధించి కిట్లను ఒకేసారి తీసుకువెళ్లి దుబాయ్‌లో సూత్రధారులకు అప్పగించి వస్తుంటాడు.

టెలిగ్రామ్ గ్రూపుల ద్వారానే సంప్రదింపులు..

బాధితులతో సహా ఈ నెట్‌వర్క్‌లో అద్యంతం అంతా టెలిగ్రామ్ యాప్, గ్రూపుల ద్వారానే సంప్రదింపులు జరుపుతారు. దుబాయ్‌లో ఉన్న సూత్రధారులు ఎవరనేది హుస్సేన్‌కు కూడా తెలీదు. టెలిగ్రామ్ ద్వారా వచ్చే సందేశాల ఆధారంగా నిర్దేశించిన రోజు, నిర్ణీత సమయానికి ఉన్న విమానంలో దుబాయ్ వెళ్తాడు. అక్కడి విమానాశ్రయంలోనే ఇతడిని కలిసే సూత్రధారులు ఆ కిట్స్ తీసుకుని వెళ్తారు. ఇతడికి ఒక్కో ఖాతాకు అందించే రూ.లక్ష సైతం హవాలా రూపంలోనే అందుతుంది. ఈ ఖాతాల్లోనే సూత్రధారులు బాధితులతో డబ్బు బదిలీ చేయిస్తున్నారు. రూ.15.76 లక్షలతో ముడిపడిన ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌ను ఏసీపీ కేవీఎం ప్రసాద్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ కేఎస్ రవి, ఎస్సై వి.నరేందర్‌తో కూడిన బృందం దర్యాప్తు చేసింది. వసీం, హుస్సాన్, నజీమ్, తాజుద్దీన్‌లను ఇటీవల పీటీ వారెంట్‌పై అరెస్టు చేసింది. న్యాయస్థానం అనుమతితో నలుగురినీ నాలుగు రోజుల పోలీసు కస్టడీకి తీసుకుని విచారించింది. ఇది పూర్తి కావడంతో సోమవారం కోర్టు ఆదేశాలతో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.

తొలిరోజు అంతంతే..



గుర్రంగూడలో..

- ప్రారంభమైన పాఠశాలలు
- సర్కారు స్కూళ్లలో 62.85 శాతం హాజరు

సాక్షి, సిటీబ్యూరో: నూతన విద్యా సంవత్సరం ఆరంభమైంది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. సుమారు 45 రోజులపాటు ఇంటివద్ద ఆటపాటలతో సరదాగా గడిపిన పిల్లలు సోమవారం మళ్లీ బడిబాట పట్టారు. ఉదయం నుంచే రోడ్లపై సందడి కనిపించింది. విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు ఆగుతూ, సాగుతూ ముందుకు సాగాయి. పాఠశాలలకు వచ్చిన పిల్లలకు కొంతమంది ఉపాధ్యాయులు ప్రవేశద్వారం వద్ద చాకెట్లు, పెన్సిళ్లు, బెలూన్లు అందించి స్వాగతం పలికారు. ఇన్నాళ్లూ ఇంటి పట్టున ఉన్న చిన్నారులను ఆకట్టుకునే విధంగా ప్రయత్నించారు. నగరంలోని సీతారాంబాగ్ ప్రభుత్వ బాలికల పాఠశాల తరగతి గదులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో స్కూల్‌కు వచ్చిన విద్యార్థులను టీచర్లు వెనక్కి పంపించారు. మరో వైపు ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లకు పంపించని పరిస్థితి కనిపించింది. నగరంలోని 40 శాతం కార్పొరేట్, టెక్నో స్కూళ్ల యాజమాన్యాలు వేసవి సెలవులను మరో వారం రోజుల వరకు పొడిగించారు. ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం, వడగాలులు ఉంటుండడంతో వచ్చే ఆదివారం వరకు పాఠశాలల్లో బోధనలు ప్రారంభించకూడదని నిర్ణయించారు. ఈ మేరకు తల్లితండ్రులకు వాట్సాప్‌ల ద్వారా సమాచారం అందజేశారు.

హాజరు తక్కువే..

తొలిరోజు హాజరు అంతంత మాత్రంగా నమోదైంది. నగరంలోని 1896 ప్రైవేట్ విద్యాసంస్థల్లో 6.86 లక్షల మంది చదువుతుండగా, మొదటి రోజు 4.32 లక్షల మంది హాజరయ్యారు. 691 ప్రభుత్వ పాఠశాలల్లో 1,14,607 మందిలో 72,028 (62.85 శాతం) మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 20 శాతం మాత్రమే విద్యార్థులు హాజరయ్యారు.





ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో..

తమ్ముడికి మెసేజ్ పెట్టి అన్న ఆత్మహత్య



మనోజ్ మృతదేహం

జియాగూడ: చనిపోతున్నానంటూ తమ్ముడికి మెసేజ్ పెట్టి ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్‌ఐ మన్మోహన్‌లు తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్నదమ్ములు మనోజ్ పాఠక్ (27), సోను పాఠక్‌లు జీవనోపాధి కోసం నగరానికి వచ్చి సబ్జిమండీ ప్రాంతంలో ఉంటున్నారు. వీరు ఫంక్షన్ హాల్స్‌లో విద్యుత్ పనులు చేస్తుంటారు. కాగా నగరానికి వచ్చినప్పటి నుండి మనోజ్ పాఠక్ డిప్రెషన్‌లో ఉన్నాడు. ఆదివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో తమ్ముడు సోనూపాఠక్‌కు సెల్‌ఫోన్ ద్వారా తాను చనిపోతున్నానంటూ మెసేజ్ పెట్టాడు. అయితే ఫంక్షన్‌లో విద్యుత్ పనుల కారణంగా సోనూ మెసేజ్ చూసుకోలేదు. చూసిన వెంటనే ఇంటికి వెళ్లగా అప్పటికే మనోజ్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. విచారణలో ఆగ్రాకు చెందిన ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం కొనసాగుతుందని తెలిసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వారాసిగూడలో అమానుషం

- మతిస్థిమితం లేని ఏడేళ్ల బాలికపై అత్యాచారం
- రక్తస్రావంతో స్పృహ తప్పిన చిన్నారి
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు

బౌద్ధనగర్: మతిస్థిమితం సరిగాలేని ఏడేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. రక్తస్రావంతో ఆ చిన్నారి స్పృహతప్పి పడిపోయింది. ఈ హృదయవిదారక ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వారాసిగూడలోని ఎల్.నారాయణ నగర్ స్ట్రీట్ నెం.4లోని ఓ భవనం రెండో అంతస్తులో భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి మతిస్థిమితం సరిగాలేని ఏడేళ్ల కూతురు ఉంది. చిన్నారికి మతిస్థిమితం సరిగాలేని కారణంగా ఇంట్లోనే ఉంటుంది. అయితే, బాలిక తండ్రి సికింద్రాబాద్‌లోని ఓ బట్టల షాపులో పనిచేస్తాడు. రోజు మాదిరిగానే ఆదివారం పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బాలిక తల్లి కూడా సరుకుల నిమిత్తం కిరాణా షాపునకు వెళ్లి అరగంట తరువాత ఇంటికి తిరిగొచ్చింది. కాగా, ఇంట్లో నేలపై పడుకున్న తన కూతురు మంచంపై రక్తం మరకలతో స్పృహ తప్పిపడి ఉంది. భయాందోళనకు గురైన ఆమె వెంటనే స్థానికుల సహాయంతో కూతుర్ని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా, సదరు బాలికపై అత్యాచారం జరిగినట్లు వైద్యులు చెప్పారు. ఈ మేరకు గాంధీ ఔట్ పోస్ట్ పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, బాలిక నివసించే భవనంలో ఎనిమిది పోర్షన్లలో అద్దెకు ఉంటున్నారు. అందులో కొంతమంది బ్యాచిలర్స్ ఉంటారని, కింది పోర్షన్ లోని ఓ కుటుంబంలో నివసించే బాలుడు 6వ తరగతి చదువుతున్నాడని బాలిక తల్లి పోలీసులకు చెప్పింది. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నామని సీఐ శంకర్ తెలిపారు.

బాలికను మోసగించిన నిందితుడి రిమాండ్

నిలోఫర్‌లో చికిత్స పొందుతున్న తల్లి, బిడ్డ..

బంజారాహిల్స్: మైనర్ బాలికను ప్రేమ పేరుతో లోబర్చుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. ఆమె గర్భందాల్చిన అనంతరం ముఖం చాటేయగా బాధిత బాలిక నెల 10వ తేదీన నవజాత మగశిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటనకు కారణమైన నిందితుడ్ని ఫిలింనగర్ పోలీసులు సోమవారం పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ హరీష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఫిలింనగర్‌లోని పద్మాలయా అంబేడ్కర్ నగర్ బస్తీకి చెందిన బాలిక (17)కు మహబూబ్‌నగర్‌కు చెందిన జేసీబీ డ్రైవర్ తుపాకుల బాలరాజ్ పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె గర్భం దాల్చింది. నిందితుడు ముఖం చాటేశాడు. ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో 8 నెలల గర్భంలోనే ఆ బాలిక మగశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం భయంతో ప్రసవించిన మరుక్షణమే ముక్కుపచ్చలారని మగశిశువును రోడ్డు పక్కన వదిలేసి ఇంట్లోకి వెళ్లింది. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు విచారించగా బాలిక ప్రసవించిన గుట్టు రట్టు అయింది. విచారణలో శిశువు జన్మకు కారకుడైన బాలరాజ్ వివరాలు బయటకి రావడంతో నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తల్లి, బిడ్డ ఆస్పత్రిలోనే..

కాగా బాలికకు జన్మించిన చిన్నారిని 108 అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స కోసం నిలోఫర్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం చిన్నారి కోలుకుంటున్నాడని, ఇంకా కొద్ది రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని ఆస్పత్రి వర్గాలు తెలిపారు. ఇదిలా ఉండగా బాధిత బాలిక చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రిలో చేరింది. ఆమె బాగా నీరసంగా ఉందని చికిత్స అందిస్తున్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

కృత్రిమ వేలిముద్రలతో హాజరు వేస్తున్న ఇద్దరి అరెస్టు

సనత్‌నగర్: కృత్రిమ వేలిముద్రలతో పారిశుద్ధ్య కార్మికులకు హాజరు వేస్తున్న ఇద్దరు జీహెచ్‌ఎంసీ శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎస్‌ఎఫ్‌ఏ)ను సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం..జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్ ప్రాంతంలో కాంట్రాక్ట్ ఎస్‌ఎఫ్‌ఏలుగా విధులు నిర్వర్తిస్తున్న అభిలాష్, సామల ఆనంద్‌కుమార్‌లు ప్రతిరోజూ బయోమెట్రిక్ విధానం ద్వారా పారిశుద్ధ్య కార్మికుల హాజరు తీసుకుంటుంటారు. సుమారు 30 మంది పారిశుద్ధ్య కార్మికులు రోజూ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే అభిలాష్, ఆనంద్‌కుమార్‌లు మైనం, ఫెవికోల్ వంటి వాటిని ఉపయోగించి తమ వద్ద పనిచేసే కార్మికుల వేలిముద్రలను సేకరించారు. అలా సేకరించిన వేలిముద్రలను కృత్రిమంగా తయారుచేసి కార్మికులు విధులకు హాజరైనట్లు ప్రతిరోజూ తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల పాంతంలో బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరువేస్తున్నారు. ఇందుకు కార్మికుల నుంచి కమీషన్లు తీసుకుంటున్నారు. గత మూడు, నాలుగు నెలలుగా వీరిద్దరు కృత్రిమ వేలిముద్రల ద్వారా కార్మికులు విధులకు రాకున్నా వచ్చినట్లు చూపుతూ వారి వేతనాల నుంచి పెద్ద మొత్తంలో కమీషన్లు తీసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం పోలీసులు దాడి చేసి ఇద్దరినీ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నకిలీ వేలిముద్రలను స్వాధీనం చేసుకున్నారు.

విదేశాల్లో ఉద్యోగాలంటూ వల

- పది మంది నుంచి రూ.17 లక్షలు స్వాహా
- మరో కేసులో రూ.10 లక్షలకు టోకరా...

హిమాయత్‌నగర్: విదేశాల్లో ఉద్యోగాలంటూ నగరవాసికి సైబర్ నేరగాడు వల వేశాడు. ఆ వలలో చిక్కుకున్న నగరవాసి ఓ పది మంది నుంచి డబ్బు సేకరించి నేరగాళ్లు ఇచ్చిన ఖాతాలకు బదిలీ చేశాడు. ఉద్యోగాలు రాకపోవడంతో బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో సోమవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. నగరానికి చెందిన ఓ వ్యక్తి కొంతకాలంగా కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. అబ్రాడ్‌లో సూపర్‌వైజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ వ్యక్తి టెలిగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. ఇక్కడ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు పది మంది నుంచి డబ్బు సేకరించి రూ.17 లక్షలు పంపించాడు. వీసా విషయంలో జాప్యం, అబ్రాడ్ సంస్థ నుంచి ఆఫర్ లెటర్ రాకపోవడంతో డబ్బు ఇచ్చిన వారంతా ఒత్తిడి చేస్తున్నారు. ఇదిలా ఉండగానే. మరో వ్యక్తిని ఇన్వెస్టిమెంట్ చేయాలంటూ నేరగాడు టెలిగ్రామ్ ద్వారా సంప్రదించాడు. తొలి రోజుల్లో కాస్త లాభాలు ఇచ్చి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. ఆ తర్వాత పలు దఫాలుగా రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టించి ఆ మొత్తాన్ని కాజేశాడు. దీంతో ఈ ఇద్దరూ వేర్వేరుగా ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వెల్‌కమ్ బ్యాక్ టు స్కూల్

- ట్రాఫిక్ పోలీసుల వినూత్న కార్యక్రమం
- పాఠశాల విద్యార్థులకు ప్లకార్డుతో స్వాగతం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చిన్నారులకు ఆకట్టుకోవడానికి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం నేపథ్యంలో 'వెల్‌కమ్ బ్యాక్ టు స్కూల్' అంటూ విద్యార్థులకు స్వాగతం పలికారు. సిటీ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్ బాబు ఆదేశాల మేరకు నగరంలోని అన్ని జోన్లలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాలలు ప్రారంభంకావడానికి కొంత సమయం ముందే ట్రాఫిక్ పోలీసులు వాటి వద్దకు చేరుకున్నారు. వెల్ కమ్.. అంటూ రాసిన ప్లకార్డులను చేతితో పట్టుకుని విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ట్రాఫిక్ నియంత్రించారు. కొన్ని చోట్ల విద్యార్థులు సైతం ట్రాఫిక్ అధికారులు, సిబ్బందితో కలిసి తమ తోటి వారిని స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ సిబ్బంది స్కూలు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి దాటే క్రమం పైనా అవగాహన కల్పించారు.

క్లుప్తంగా...

రామనర్సయ్యకు మంత్రి హరీష్‌రావు పరామర్శ

లక్డీకాపూల్: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న జానపద గాయకుడు గిద్దె రామ నరసయ్యను ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రామనర్సయ్యకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఉద్యమ సమయంలో మీ పాట ద్వారా చేసిన సేవలు మరిచిపోలేమని మంత్రి గుర్తుచేశారు. రామ నరసయ్య అనారోగ్యంగా ఉన్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న మంత్రి స్పందించి ఆయనను నిమ్స్‌కు తరలించి అత్యుత్తమ వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులను ఆదేశించిన విషయం తెల్సిందే.

పిల్లలను కార్మికులుగా మార్చొద్దంటూ ర్యాలీ



ఫిలింనగర్: బడి ఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని బాల కార్మికులుగా మార్చొద్దని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రజలకు సూచించారు. సోమవారం ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో జనసాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విద్యార్థులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జన్‌సాహస్ ప్రతినిధులు కమలాకర్, డానియల్, బ్రహ్మ, మాధవి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడిగా మహ్మద్ మాజిద్



మాజిద్‌ను సన్మానిస్తున్న నేతలు

వెంకటేశ్వరకాలనీ: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్‌కమిటీలో బంజారాహిల్స్ రోడ్ నెం. 10 జహీరానగర్‌కు చెందిన మహ్మద్ మాజిద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం బంజారాహిల్స్‌లో మహ్మద్ మాజిద్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు మహ్మద్ మాజిద్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌చార్జితో పాటు సిటీపార్టీలో కూడా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కోర్ కమిటీలో చేర్చినందుకు అందుకు అనుగుణంగా నడుచుకుంటానని తెలంగాణలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఇన్‌చార్జి దిడ్డి సుధాకర్, డాక్టర్ పుట్టా పాండు రంగారావు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించేలా ఒత్తిడి తేవాలి'

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని.. వారికి సత్వరమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌కు తెలంగాణ దళిత బహుజన విద్యార్థి సమాఖ్య విజ్ఞప్తి చేసింది. సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో కళాశాలల యజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫలితంగా ఉన్నత చదువులు చదవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇవే సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రతినిధి బృందం డి.శ్రీనివాస్ తదితరులున్నారు.

పాఠశాలల్లో సందడే.. సందడి



రాజ్‌భవన్ స్కూల్ వద్ద విద్యార్థులకు వెల్‌కమ్ చెబుతున్న పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు



ఎన్టీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రేయర్‌లో పాల్గొన్న విద్యార్థులు

బంజారాహిల్స్: వేసవి సెలవుల అనంతరం సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. ఉదయమే విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు. బడుల్లో అరకొర సౌకర్యాలు, ఉపాధ్యాయుల కొరత మధ్యనే 2023–24 విద్యా సంవత్సరానికి గాను బడులు తెరుచుకోగా ప్రారంభం రోజునే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో మొదటి రోజున కొత్త అడ్మిషన్లు నమోదయ్యాయి. ఈ నెల 3 నుంచి 9 వరకు చేపట్టిన ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో నమోదైన విద్యార్థులను కొత్తగా చేర్చుకున్నారు. చాలా బడుల్లో సమస్యలు రాజ్యమేలుతుండగా ఉపాధ్యాయులు కొన్ని చోట్ల దగ్గరుండి వాటిని పరిష్కరించుకున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని విద్యాసంస్థలన్నీ తెరుచుకోగా చాలా చోట్ల ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లుగా తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యావలంటీర్లను నియమించే ప్రక్రియ ఈసారి కూడా లేనట్లేనని తెలుస్తోంది.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



శంకుస్థాపన చేస్తున్న మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ ఓంనగర్‌లో దాదాపు రూ. 7 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మంత్రి కేటీఆర్ కృషి వల్ల భాగ్యనగరం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. తాను ప్రత్యేక శ్రద్ధతో జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం వాహబ్, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, మేనేజర్ రాజేందర్, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి కేసరి సుబ్బరాజు, మాజీ అధ్యక్షుడు సయ్యద్ బషీర్, నేతలు ఎం.డి.నజీర్, రవిశంకర్, ఫయాజ్, విలియమ్స్, జబ్బార్, గఫూర్, అబ్దుల్ గని పాల్గొన్నారు.

ముగిసిన నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ ఈస్ట్ రహమత్‌నగర్ గల్లీలోని నల్లపోచమ్మ తల్లి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం 7 గంటలకు సర్వవైదిక కార్యక్రమంతో పూజలు ప్రారంభించారు. 8.12 గంటలకు సర్వ దేవతా విగ్రహాల ప్రతిష్ఠ, శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠతోపాటు పంచగోపుర కలశాలు స్థాపించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్న సంతర్పణ జరిగాయి. దాదాపు నాలుగున్నర దశాబ్దాల కిందట వెలసిన ఆలయాన్ని స్థానిక భక్తులు పేడాడ భారతీ చిరంజీవులు దంపతులు దాదాపు కోటి రూపాయలతో పునరుద్ధరించారు. ఆయా పూజా కార్యక్రమాలను పేడాడ భారతీచిరంజీవులు, భారతీ దంపతులు, డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు, నీరజ, రాము, శ్వేత, లక్ష్మణ్, జయశ్రీ, దివాకర్ దంపతులు పర్యవేక్షించారు. బాల సీతారామాంజనేయ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ పూజా కార్యకార్యక్రమాలు జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు వివిధ రాజకీయ నేతలు నవీన్‌యాదవ్, కిలారి మనోహర్, బి.రూప, శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

రైతులకు పరిహారం చెల్లింపులో అన్యాయం

- బీఆర్‌ఎస్‌కు రైతులు గుణపాఠం చెబుతారు
- టీపీసీసీ ఎస్సీ సెల్ విభాగం కన్వీనర్, రైతు నాయకుడు తోట లక్ష్మీకాంతారావు



తడిచిన ధాన్యంతో దిక్కుతోచని స్థితిలో కూర్చున్న రైతు ఫొటో చూపుతున్న లక్ష్మీకాంతారావు

పంజగుట్ట: రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 40 వేల ప్రకారం పరిహారం ఇవ్వాలని, ఒక ప్రణాళిక ప్రకారం నష్టపోయిన ప్రతి కౌలు రైతుకే పరిహారం అందేలా చూడాలని టీపీసీసీ ఎస్సీ సెల్ విభాగం కన్వీనర్, రైతు నాయకుడు తోట లక్ష్మీకాంతారావు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం రైతులపట్ల పట్టింపులేనితనం, ఉదాసీనత వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ప్రతి ఎకరాకూ రూ. 35 వేల వరకు ఖర్చుచేసి పంట పండిస్తే చేతికి అందివచ్చిన పంట అకాలవర్షాలు, వడగడ్ల వానతో పూర్తిగా పాడైపోయిందని, ప్రభుత్వం ఎకరానికి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని ప్రకటన చేసి చేతులు దులుపుకొందన్నారు. కాపాడుకున్న పంటను కొనుగోలు చేసేందుకు పెద్ద మాఫియాలా తయారై రైతులను నిండా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 కిలోల బస్తాకు 650 గ్రాముల బస్తా బరువు తరుగు తీయాల్సి ఉండగా 40 కిలోలకు 6 కిలోల తరుగు తీసి రైతు ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. కొన్న ధాన్యం నగదు 20 రోజులైనా ఇంకా రైతుల ఖాతాల్లోకి జమకాలేదని, తిరిగి వర్షాలు పడుతున్నాయి రైతులు పెట్టుబడి పెట్టేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ధరణి పోర్టల్ రైతులకు గండంలా తయారయ్యిందని, మా జుక్కల్ నియోజకవర్గంలోనే వేల సంఖ్యలో ధరణి బాధితులు ఉన్నారని తెలిపారు. కొన్ని వందల ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దొరలు, జమీందార్లు, ప్రభుత్వ భూములు ధరణివల్ల తిరిగి వారిపేర్లపై రావడంతో ఇప్పుడు రైతులను ఆ భూముల్లోకి రానివ్వడంలే దని, వారు రోడ్డున పడ్డారన్నారు. అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ అంటున్న బీఆర్‌ఎస్ పార్టీకి ఈ సారి ఇక్కడి రైతులే తగిన గుణపాఠం చెపుతారని, తాము అధికారంలోకి రాగానే రైతు సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

ప్రమాదకర రాడ్లు తొలగింపు

బంజారాహిల్స్: రాడ్లు ఉన్నాయి... జాగ్రత్త అనే శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న రాడ్లను తొలగించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ ముందు ఏర్పాటు చేసిన బొల్లార్డ్స్‌కు వేసిన రాడ్లు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. వీటిని తొలగించిన ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాలను తప్పించారు.

పౌష్టికాహారంపై అవగాహన

పంజగుట్ట: కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ జిల్లా, జై జవాన్ జై కిసాన్ యువజన సంఘం, అంబేడ్కర్ సేవా సంఘం, ప్రేమ్‌నగర్ మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పౌష్టిక ఆహారం, పోషక ఆహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్గానిక్, ప్రకృతి సిద్ధమైన ఆహారం ఎగ్జిబిషన్ నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థానిక మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ యువజన అధికారి కుష్బు గుప్తా అందరితో ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని వాడుదాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆయా సంఘాల నాయకులు భగవాన్‌దాస్, మహేష్ కుమార్, జి.సుధీర్ కుమార్, టి.వెంకటేశం, మున్నా, చంద్రశేఖర్, నర్సింహారావు, నరసింహ, మధురవేణి, సునిత, పద్మ, అర్చన, రుక్మిణి, భారతి, విజేత పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్రంలోని విద్యావంతులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించి.. వారికి న్యాయం చేయాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల నవీన్‌కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఉన్నత చదువులు చదివిన ఉద్యోగాలు రాక ఉపాధి లేక నిరాశ నిస్పృహలో యువత కొట్టుమిట్టాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భారత రాష్ట్ర సమితి నిరుద్యోగ యువతకు రూ. 3116లు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని ఆయన గుర్తు చేశారు.

నిమ్స్ విస్తరణ ఘనత కేసీఆర్‌దే



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డాక్టర్ మార్త రమేష్

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రికి నిజామ్ నవాబు పునాది వేసినా అన్ని విధాల అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేష్ అన్నారు. సోమవారం నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయం సమీపంలో నిమ్స్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మెయిన్ గేటు నుంచి ఎమర్జెన్సీ గేట్ వరకు ఊరేగింపుగా బతుకమ్మ ఆటపాటలతో డప్పులతో సంబరాలు నిర్వహించారు. అనంతరం మార్త రమేష్ కేసీఆర్ ఛాయచిత్రానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.1600 కోట్ల వ్యయంతో 25 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించతలపెట్టిన అతి పెద్ద భవన సముదాయంగా నిమ్స్ చరిత్రకెక్కనున్నదన్నారు. నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ.కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, పారామెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శాంత కుమారి, శిరందాస్ శ్రీనివాసులు, కాంట్రాక్టు ఎంప్లాయీస్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ ఎస్, ఎస్ నర్సింగ్, తెలంగాణ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు కనకతార పాల్గొన్నారు. పది మంది కార్మికులను సత్కరించి నగదు పురస్కారాలను అందజేశారు.

విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని వినతి



ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న టీజేఎస్ నేతలు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీలో 15 కరెంటు స్తంభాలు, వీధీ దీపాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ జనసమితి జూబ్లీహిల్స్ నియోజక వర్గం ఇన్‌చార్జి జి. హన్మంతుగౌడ్ ఆధ్వర్యంలో స్థానికులు ఫిలింనగర్ సబ్‌స్టేషన్ ఏఈకి సోమవారం వినతి పత్రం అందజేశారు. పలుచోట్ల కరెంటు వైర్లకు చెట్లు తగులుతున్నాయని దీని వల్ల తరచూ కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. కొన్ని చోట్ల కరెంటు వైర్లు కిందకు వేలాడుతున్నాయని ప్రమాదకరంగా ఉండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారని అన్నారు. దీనికి తోడు తరచూ కరెంటు పోతుండటంతో రాత్రిళ్ళు జాగారా చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని అన్నారు. బస్తీకి కరెంటు సమస్య తీవ్రంగా ఉందని తగిన ఆధారాలు అధికారులకు అందజేశారు. వీధి లైట్లు లేక చీకటి రాజ్యమేలుతున్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగు చోట్ల స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని వీటి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



చైల్డ్ లేబర్ డేలో పాల్గొన్న న్యాయమూర్తి కళార్చన

బంజారాహిల్స్: చైల్డ్ లేబర్ వద్దు.. బడిబాట ముద్దు అంశంతో ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సిటీ సివిల్ కోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కమ్ జడ్జి కళార్చన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ బాల కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ... పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యతోనే ప్రతి ఒక్కరికీ వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించి తమ పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బడిఈడు పిల్లలను బయట ఉండవద్దన్నారు. తమ పిల్లలను స్కూల్‌కు పంపిస్తామని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.

బిల్లులు చెల్లించాలని మిషన్ భగీరథ కాంట్రాక్టర్ల నిరసన



మిషన్ భగీరథ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించిన తమకు బిల్లులు రాక అప్పులు కట్టుకోలేక ఊర్లల్లో తిరగలేకపోతున్నామని మిషన్ భగీరథ ఇంట్రా కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కాంట్రాక్టర్లు మెట్లపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఇంట్రా కాంట్రాక్టర్లు సుబ్బారావు, ప్రదీప్ రావు, సమ్మయ్య, చిన్నం శ్రీనివాస్, పడాల రమేష్, బండారు శ్రీశైలంలు మాట్లాడుతూ... మిషన్ భగీరథలో తమ పాత్ర ఎంతో కీలకమని, మెఘా కాంట్రాక్టర్లు పెద్దపెద్ద పైపులు వేస్తే తాము ఇంట్రా కాంట్రాక్టర్లము వాటర్ ట్యాంకులు కట్టడం, పైప్‌లైన్‌లు వేసి, ఇంటింటికీ నల్లాలు బిగించి మంచినీరు అందించామన్నారు. తాము పనులు పూర్తిచేసి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు ఇంకా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తామంతా చిన్నచిన్న కాంట్రాక్టర్లమని తమను ఇలా వేధించడం సరికాదన్నారు. భార్యల మెడలోని బంగారం కుదువపెట్టి, స్థలాలు అమ్ముకుని, అప్పులు తీసుకొచ్చి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు పూర్తిచేశామని ఇప్పుడు అప్పులు కట్టలేక ఎవ్వరూ నమ్మె పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే అప్‌లోడ్ చేసిన బిల్లులు సుమారు రూ. 275 కోట్ల వరకు రావల్సి ఉందని, ఇంకా అప్‌లోడ్ చేయనివి కూడా ఉన్నాయని అప్‌లోడ్ చేసినవి అయినా త్వరగా చెల్లిస్తే తాము కొంత ఉపశమనం పొందుతామన్నారు. ఇదే విషయమై మంత్రులు ఎర్రవల్లి దయాకర్‌రావు, హరీష్‌రావు, ఈ శాఖ సెక్రటరీ స్మితాసబర్‌వాల్‌ను పలుమార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి తమకు వెంటనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఖైరతాబాద్ నుంచి పోటీ చేస్తా



బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి

బంజారాహిల్స్: ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని నియోజకవర్గ బీజేపీ నేత బొల్లంపల్లి ఇంద్రసేన్ రెడ్డి వెల్లడించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తన తండ్రి జస్టిస్ బి.సుభాషిణ్‌రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా కొన్నేళ్లుగా పౌరులకు ఉచిత న్యాయసేవలు అందిస్తున్నాని అన్నారు. ఇప్పుడు అదే ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానన్నారు. ప్రజల్లోకి వెళ్లినప్పుడు వారి సమస్యలు వింటుంటే ఎంతో బాధేస్తుందన్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో పర్యటించినప్పుడు ప్రజలు తనకు ఘన స్వాగతం పలికారని వారి సమస్యలను తెలుసుకున్నానన్నారు. కలుషిత నీటి సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. వేళాపాళా లేకుండా నీరు వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్త పైప్‌లైన్ వేసి ప్రెషర్ పెంచితే సమస్య తగ్గుతుందని అధికారులకు సూచించామన్నారు. పింఛన్లు, రేషన్ కార్డుల కోసం జనం ఎదురు చూస్తున్నారన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలకు జతపరిచే ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదన్నారు.

బాలిక అదృశ్యం



బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... యూసుఫ్‌గూడ ఎల్‌ఎన్‌నగర్‌లో నివసించే ఎ.అను(16) సమీపంలోని శ్రీ సాయిరాం హైస్కూల్‌లో చదువుతున్నది. ఈ నెల 11వ తేదీన మధ్యాహ్నం ఇంట్లోంచి బయటికి వెళ్లి సాయంత్రానికి కూడా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాలు, బంధుమిత్రుల ఇళ్లల్లో వాకబు చేసినా ప్రయోజనం లేదు. దీంతో కూతురు కనిపించడం లేదంటూ తండ్రి శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61278లో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకుంటున్న వీవజ్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శన



కూకట్‌పల్లి: శ్రీనగర్‌కాలనీలో సత్యసాయి నిగమాగమంలో వీవజ్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేనేత ప్రదర్శన నిర్వాహకురాలు శ్రీలత యలమంచిలి మాట్లాడుతూ... వేసవి, వివాహ, ప్రత్యేక సందర్భాల్లో ధరించడానికి అనుగుణంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ రకాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్ ఆకర్షణీయమైన డిజైన్లతో పాటు నగరానికి చెందిన ప్రముఖ జ్యువెలరీ షోరూం వసుంధర జ్యువెలర్స్ వారిచే బంగారు, వజ్రాల అభరణాలు, హైదరాబాద్ మేలిమి ముత్యాల నగలు మగువలు దోచే విధంగా ఉన్నాయన్నారు. ఎగ్జిబిషన్ మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ధరించడానికి అనువైన కాటన్ దుస్తులు, వివాహ, ప్రత్యేక సందర్భాలలో ధరించే విధంగా సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌తో పాటు ఉప్పాడ, కళంకారి, మంగళగిరి, వెంకటగిరి, పోచంపల్లి చీరలు, చందేరి సిల్క్, రాజస్తాన్, హ్యాండ్ బ్లాక్ ప్రింట్ చీరలు, భగల్పూర్ సిల్క్ చీరలు, బెంగాల్ కాటన్ చీరలు, కాశ్మీర్, లక్నోచికన్ చీరలు, బనారస్ చీరలు, కాంతావర్కు చీరలు, డిజైనర్ సూట్స్, బ్లౌజులు, జైపూర్ బెడ్ షీట్లు, బ్లాక్ గాజులు వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన మరో ఈనెల 14 వరకు మాత్రమే కొనసాగుతుందని తెలిపారు.

బీజేపీ.. ఏపీలో టీ-బీజేపీగా మారింది..

అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఏపీ మంత్రి అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం/కంచరపాలెం: ఏపీలో భారతీయ జనతా పార్టీ టీ-బీజేపీ (తెలుగుదేశం-బీజేపీ)గా మారిపోయిందని ఆ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. విశాఖలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, శ్రీకాళహస్తిలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రాష్ట్ర ప్రభుత్వం మీద, తమ పార్టీ నేతల పైన విమర్శలు చేస్తుంటే రాష్ట్ర బీజేపీ నాయకుల కంటే టీడీపీ నేతలు, ఎల్లో మీడియా వారు ఎక్కువ సంబరాలు చేసుకుంటున్నారన్నారు. కేంద్ర బీజేపీ నేతల వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నగరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్షేమ పథకాలకు కేంద్రం నుంచి నిధులు పంపిస్తుంటే.. వీళ్ల ఫొటోలు పెట్టుకుంటున్నారని.. విశాఖలో సంఘ విద్రోహక శక్తులు ఉన్నాయని చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నన్నట్లు అమర్‌నాథ్ చెప్పారు. విశాఖ సభలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, రాష్ట్ర విభజన అంశాలు, ప్రత్యేక హోదాపై మాట్లాడతారని రాష్ట్ర ప్రజలంతా అనుకుంటే.. కేంద్ర పథకాలపై సీఎం జగన్ ఫొటో వేసుకుంటున్నారని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ, బీజేపీ ప్రభుత్వాల మధ్య బంధం కేంద్ర, రాష్ట్ర సంబంధాలేనని.. వారు మాకు ఏ విధమైన గౌరవం ఇస్తారో.. తామూ అలాగే ఇస్తామన్నారు. అమర్‌నాథ్ ఇంకా ఏమన్నారంటే..

వీటిపై ఎందుకు మాట్లాడలేదు?

విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి అమిత్ షా ఎందుకు మాట్లాడలేదు? విభజన చట్టంలో వున్న మేరకే కేంద్రం విద్యా సంస్థలను ఏపీకి ఇచ్చింది. అంతకంటే ఏమీ ఇవ్వలేదు. బీజేపీ-టీడీపీలు కలిసి పనిచేసినప్పుడు కేంద్రం నుంచి వచ్చిన డబ్బు ఏమైంది? బీజేపీ నేతృత్వంలో ఏర్పాటైన రాష్ట్రాల్లో అభివృద్ధి చెందిన నగరాలే రాజధానులయ్యాయి..అలాంటప్పుడు వైజాగ్‌ను రాజధాని చేస్తే తప్పేంటి? ఏపీలో ఒక్క సీటులేని బీజేపీ 20 సీట్లు ఎలా ఆశిస్తుంది?.

టీ-బీజేపీ నేతలిచ్చిన స్క్రిప్ట్‌నే చదివిన షా

విశాఖ సభలో అమిత్ షా చుట్టూ కుర్చున్న వారంతా టీ-బీజేపీ (బీజేపీలోని టీడీపీ నేతలు) నాయకులే. వారిచ్చిన స్క్రిప్ట్‌నే ఆయన చదివి వినిపించారు. బాబు హయాంలో అమరావతిలో జరిగిన స్కాముల గురించి చెప్పాలని అమిత్ షాకు అనిపించలేదా? తిరుపతిలో అమిత్ షాపై రాళ్లు వేయించిన చంద్రబాబును అక్కున చేర్చుకోవాలని అనిపిస్తోందా? అసలు సొంతంగా పోటీచేసే బలంలేక చంద్రబాబు పొత్తులు కోరుకుంటున్నాడు.



పల్నాడు జిల్లా క్రోసూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం. (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఏపీ సీఎం జగన్

పెత్తందారు.. పేదలపై పగ!

- డిక్లరేషన్లంటూ చంద్రబాబు డ్రామాలు: క్రోసూరు సభలో ఏపీ సీఎం జగన్ ధ్వజం
- 14 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం గాడిదలు కాశావ్?
- మళ్లీ మళ్లీ వాగ్దానాలు, వెన్నుపోట్లే బాబు సైకిల్ చక్రం
- టీడీపీ మూసివేతకు సిద్ధమైన దుకాణం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'పేద పిల్లలు చదువుకుంటుంటే.. అందులోనూ ఇంగ్లిషు మీడియంలో చదువుకుంటే.. వారికి గవర్నమెంట్ స్కూళ్లలో డిజిటల్ బోధన జరుగుతుంటే.. వారి చేతుల్లో ట్యాబ్‌లు కనిపిస్తే తట్టుకోలేని మనస్తత్వం చంద్రబాబుది'అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం పల్నాడు జిల్లా క్రోసూరులో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.

గ్యాస్ సిలిండర్ల డిక్లరేషన్..

టీడీపీ మూసివేయడానికి సిద్ధంగా ఉన్న దుకాణం కాబట్టే పక్క రాష్ట్రాల్లో మేనిఫెస్టో కాపీకొట్టి తెచ్చి 'బిస్‌బెళి బాత్'లా వండుతున్నారు. మనం అమలు చేసిన పథకాలన్నింటినీ కూడా కిచిడీ చేసి పులిహోరలా వండే కార్యక్రమం చేస్తున్నారు. సీఎంగా పనిచేసిన 28 ఏళ్ల తరువాత, 14 ఏళ్లు సీఎంగా చేసిన తర్వాత ఇప్పుడు రాయలసీమ డిక్లరేషన్ అంటూ మొదలు పెడుతున్నారు. బీసీ డిక్లరేషన్, ఎస్సీ ఎస్టీ, డిక్లరేషన్, మైనార్టీ డిక్లరేషన్, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు చివరికి గ్యాస్ సిలిండర్ల డిక్లరేషన్ అంటూ ఇవాళ డ్రామాలు మొదలు పెట్టారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసినప్పుడు ఏం గాడిదలు కాశావయ్యా చంద్రబాబూ? అని అడుగుతున్నా. ఇవాళ ప్రజల్ని మళ్లీ మోసం చేస్తూ, మరోసారి అవకాశం ఇస్తే మయసభ నిర్మిస్తానంటున్నాడు. ఇంటింటికీ కేజీ బంగారం ఇస్తానంటున్నాడు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తానంటున్నాడు. ఈ కొత్త డ్రామాలు నమ్మవచ్చా? అని అడుగుతున్నా. చంద్రబాబు బతుకంతా వాగ్దానాలు, ఆ తర్వాత వెన్నుపోట్లు! మళ్లీ ఎన్నికలొచ్చినప్పుడు మళ్లీ వాగ్దానాలు, మళ్లీ వెన్నుపోట్లు! ఈ చక్రమే బాబు సైకిల్ చక్రం!

> **బాబు బతుకే మోసం, అబద్ధం..!**
>
> 'ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేయడం.. ఆ తర్వాత మోసం చేయడం చంద్రబాబు నైజం. చంద్రబాబు బతుకే మోసం, పెద్ద అబద్ధం. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయన పేరు చెబితే ఏ ఒక్క సంక్షేమ పథకమూ గుర్తు రాదు. చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చేది వెన్నుపోట్లు, మోసం, కుట్ర, దగా! ప్రజలందరినీ మోసం చేస్తున్నా అన్ని విషయాల్లో చంద్రబాబును వెనకేసుకురావడానికి ఆయన వల్ల బాగా వెనకేసుకున్న ఓ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ- 5, దత్తపుత్రుడున్నారు. చంద్రబాబు పాలన వల్ల, ఆయన చేసిన పనుల వల్ల తమకు మేలు జరిగిందని చెప్పే ఒక సామాజికవర్గంగానీ, ప్రాంతంగానీ, పేదలుగానీ ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు..'
>
> – పల్నాడు జిల్లా క్రోసూరు సభలో ఏపీ సీఎం జగన్ ధ్వజం

ఇటు పేదలు – అటు పెత్తందార్లు

ఈరోజు మన పేదలకూ – బాబు పెత్తందార్లకూ మధ్య యుద్ధం జరుగుతోంది. బాబు పెత్తందారీ భావజాలానికి, మనందరి పేదల ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న యుద్ధమిదీ! చంద్రబాబు దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ భావజాలానికి, ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి రూ.2.16 లక్షల కోట్లు నేరుగా పంపిన మన డీబీటీ పద్ధతికి మధ్య యుద్ధం జరుగుతోంది. వారి సామాజిక అన్యాయానికి, మన సామాజిక న్యాయానికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. ఇదే రాష్ట్రంలో, ఇదే బడ్జెట్‌లో వారు చేసిన స్కామ్‌లకు, అదే బడ్జెట్‌లో మనం అందజేస్తున్న మంచి స్కీములకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. వారి ఎల్లో మీడియా విష ప్రచారాలకు, ఇంటింటికీ మనం చేసిన మంచికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది.

నా ధైర్యం మీరే..

ఈ కురుక్షేత్ర మహాసంగ్రామంలో వారిది పేదలపై యుద్ధం అని గుర్తు పెట్టుకోవాలి. ఈ యుద్ధంలో వారి మాదిరిగా నాకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఢంకా బజాయించకపోవచ్చు. ఒక దత్తపుత్రుడు అండగా నిలబడకపోవచ్చు. బీజేపీ అనే పార్టీ అండగా ఉండకపోవచ్చు. కానీ జగనన్న వీళ్లను నమ్ముకోలేదు. మీ జగనన్న దేవుడి దయను, మీ చల్లని ఆశీస్సులను మాత్రమే నమ్ముకున్నాడు. ఈ కురుక్షేత్ర మహాసంగ్రామంలో నా ధైర్యం మీరే. ఇంటింటికీ మనందరి ప్రభుత్వం చేసిన మంచే నా బలం అని చెప్పడానికి గర్వపడుతున్నా. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అనేది ఒక్కటే ప్రామాణికంగా తీసుకోండి. మీబిడ్డ వల్ల మీఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా తోడుగా నిలబడాలని కోరుతున్నా. ఈ యుద్ధంలో చివరకు మంచే గెలుస్తుందని మనసారా నమ్ముతున్నా.

పులిచింతలలో పుల్లుగా నీళ్లు

పులిచింతల ప్రాజెక్టు నాన్న స్వప్నం. ఆయన పూర్తి చేయగా మిగిలిపోయిన ఆర్‌అండ్‌ఆర్ కూడా ఇవ్వకుండా, 45 టీఎంసీలను నిల్వ చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మన ప్రభుత్వ హయాంలో రూ.140 కోట్లు కేటాయించి 45 టీఎంసీల నీళ్లు నింపి ఆర్‌అండ్‌ఆర్ కార్యక్రమం కూడా పూర్తి చేశాం. ఎమాజిగూడెంలో పొరపాటున 128 ఇళ్లకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ మిగిలిపోయినట్లు ఎమ్మెల్యే నా దృష్టికి తెచ్చారు. అది కూడా పూర్తి చేస్తాం. రూ.45 కోట్లతో అచ్చంపేట మండలం తాళ్ల చెరువులో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కోరారు. దాన్ని కూడా మంజూరు చేస్తున్నాం. మాదిపాడును పులిచింతల డ్యామ్‌కు కనెక్ట్ చేస్తూ రూ.3.50 కోట్ల వ్యయంతో రోడ్డు కూడా మంజూరు చేస్తున్నాం.

రూ.60 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన

మాదిపాడు వద్ద రూ.60 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. దీని వల్ల హైదరాబాద్ వెళ్లేందుకు 80 కి.మీ. దూరం తగ్గుతుంది. కీలకమైన అమరావతి – రాజుపాలెం రోడ్డుకు మరో రూ.150 కోట్లతో సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.

నల్లగొండలో నీళ్ల మంటలు!

▶ మొదటి పేజీ తరువాయి

పాదయాత్ర ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులే లక్ష్యంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ హయాంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన శ్రీశైలం సొరంగ మార్గం, నక్కలగండి, పెండ్లిపాకల, బ్రాహ్మణ వెల్లంల వంటి ప్రాజెక్టులపై భట్టి చర్చ పెడుతున్నారు. ఈ ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్ సర్కారు నిర్లక్ష్యం చూపుతోందని.. జిల్లాకు చెందిన మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పట్టించుకోవడం లేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నక్కలగండి రిజర్వాయర్ కింద నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఆ తర్వాత రెండు రోజులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు. జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పూర్తి చేయడంలో తన కృషి ఉందని.. హైదరాబాద్‌కు దాని ద్వారానే తాగునీళ్లు వచ్చాయని చెప్పారు. ఇక జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదివారం మీడియా సమావేశం పెట్టి.. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని దుర్మార్గమైన టెక్నాలజీతో తెచ్చారని, పర్యావరణ అనుమతుల పేరుతో ఆగిపోయేలా చూశారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. దీనికి ప్రతిగా సోమవారం భట్టి విక్రమార్క మరోసారి విరుచుకుపడ్డారు. ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదన్న దానికి నేరుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

భట్టికి తోడుగా కోమటిరెడ్డి, ఉత్తమ్..

భట్టి పాదయాత్రలో పాల్గొన్న ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బీఆర్‌ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ఎస్‌ఎల్‌బీసీ కోసం నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి, 2005లో అనుమతి తీసుకొని పనులు మొదలుపెట్టి 70శాతం పూర్తి చేస్తే.. బీఆర్‌ఎస్ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని పనులు పూర్తి చేయిస్తానని 2014లో ప్రకటించిన సీఎం కేసీఆర్.. తర్వాత దీనిని పట్టించుకోకుండా, కమీషన్ల కాళేశ్వరంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. ఇక పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా నల్లగొండ రైతులను సీఎం కేసీఆర్ మోసం చేశారని, దీనిపై క్షమాపణ చెప్పాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాగా.. భట్టి పాదయాత్ర సందర్భంగా ఈ నెల 15న నల్లగొండ పట్టణంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

> బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చి పదేళ్లు కావస్తున్నా ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. ఈ ప్రాజెక్టులు పూర్తి కాకుండా అడ్డుకున్నది ఎవరు? వాటి ద్వారా నల్లగొండ జిల్లా ప్రజలకు నీళ్లు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలి. దీనిపై ఎక్కడైనా చర్చించేందుకు నేను సిద్ధం. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు హయాంలో నల్లగొండ జిల్లా ప్రజలకు నీళ్లు ఇవ్వకుంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని సుఖేందర్ రెడ్డి అన్నారట. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే.. ఇన్నేళ్లయినా డిండి, ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండిని పూర్తి చేయనందుకు ఇప్పుడు రాజీనామా చేయాలి. ఎస్‌ఎల్‌బీసీని పూర్తి చేయడానికి కేసీఆర్ నుంచి నిధులు తీసుకురావాల్సిన జిల్లా మంత్రి.. నాగార్జున సాగర్ నుంచి నీళ్లు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు.
>
> – సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

> 2014కు ముందు జిల్లాలో సాగులోకి వచ్చిందెంత? ఇప్పుడు సాగులో ఉన్న భూమి ఎంత? దిగుబడి ఎంత? 40 లక్షల టన్నులకుపైగా ధాన్యం దిగుబడితో రికార్డ్ సృష్టించాం. సాగర్ కింద వరుసగా 16 పంటలకు నీళ్లు ఇచ్చాం. 2014కు ముందు ఏనాడైనా లాఠీచార్జిలు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించారా? ఫ్లోరైడ్ సమస్యను పట్టించుకోకుండా లక్షల మంది నడ్డి విరిచారు. మిషన్ భగీరథతో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టింది కేసీఆర్ కాదా? ఇప్పుడున్న నిరుద్యోగులు డిగ్రీలు ఎప్పుడు పూర్తిచేశారో లెక్కలు తీద్దామా? జిల్లా అభివృద్ధిపై ఎక్కడ చర్చ పెడదామో చెప్పండి. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏరియా జాన్‌పహాడ్‌లో పెడదామా? లేక జానారెడ్డి ఏరియా రాజవరంలో పెడదామా? విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద కరెంటుపై చర్చపెడదామా? మీరే చెప్పండి.
>
> – విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

లారీని ఢీకొన్న కారు.. ఏడుగురి దుర్మరణం

తూర్పు గోదావరి జిల్లాలో ప్రమాదం

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద గుండుగొలను-కొవ్వూరు జాతీయరహదారి (ఎన్‌హెచ్-16)పై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఎనిమిదిమంది బంధువులు మూడురోజుల కిందట సికింద్రాబాద్‌లో బంధువుల గృహప్రవేశ వేడుకకు రైలులో వెళ్లారు. వారంతా రాజమహేంద్రవరానికి చెందిన బంధువుల కారులో ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో అనంతపల్లి వద్దకు చేరుకున్న కారు అతివేగంగా.. హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మిద్దే సత్యనారాయణ (46), మిద్దే రవితేజ (25), మిద్దే అరుణ (20), దాసరి శ్రావణ కుమారి (21), రేలంగి లక్ష్మి (50), దాసరి లోహిత్ గగనసాయి (9 నెలలు) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అత్కూరి దుర్గ (50) ఆస్పత్రిలో మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన మిద్దే విద్యాసాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.


నగర వార్తలు

రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు జేసీఐ అక్రిడిటేషన్



లక్డీకాపూల్: రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రతిష్టాత్మక 'జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ)' నుంచి 'గోల్డ్ సీల్ ఆఫ్ క్వాలిటీ అప్రూవల్' అందుకున్నట్లు హాస్పిటల్ చైర్మన్, ఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల తెలిపారు. తమ ఆస్పత్రిలో ఫెసిలిటీ నాణ్యతను ఈ అక్రిడిటేషన్ గుర్తించిందని, ప్రపంచ స్థాయిలో ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్నామనేందుకు ఈ గుర్తింపు నిదర్శనంగా పేర్కొన్నారు. ఇది రెయిన్ బో కుటుంబంలోని ప్రతి ఒక్కరి విజయంగా ఆయన అభివర్ణించారు. గతంలో కొండాపూర్‌లోని బర్త్‌రైట్ ఫెర్టిలిటీ రెయిన్‌బో హాస్పిటల్‌కు జేసీఐ గుర్తింపు లభించిందన్నారు. హాస్పిటల్ ఇంటెన్సివ్ కేర్ సర్వీసెస్ డైరెక్టర్, డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల మాట్లాడుతూ ఈ గుర్తింపు తమను మరింత ప్రోత్సహిస్తుందని తెలిపారు. క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రణతి రెడ్డి, రెయిన్‌బో గ్రూప్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రశాంత్, హాస్పిటల్ సిఓఓ సంజీవ్ సుకుమారన్ సమావేశంలో పాల్గొన్నారు.

కేన్సర్ విజేతల కోసం 'హెయిర్ డొనేషన్ డ్రైవ్'



సాక్షి, సిటీ బ్యూరో: ప్రముఖ క్రౌడ్ ఫండింగ్ సంస్థ మిలాప్, నగరానికి చెందిన 'హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఒక విగ్ తయారీ కేంద్రంలో 'హైదరాబాద్ హెయిర్ డొనేషన్' కార్యక్రమం నిర్వహించారు. పలువురు నగరవాసులు కార్యక్రమంలో పాల్గొని కేశాలను దానం చేశారు. ఈ సందర్భంగా మిలాప్ అధ్యక్షులు, సహ వ్యవస్థాపకులు అనోజ్ విశ్వనాథన్ మాట్లాడుతూ కేన్సర్‌పై పోరాడి విజయం సాధించిన వారికి అండగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన నగర వాలంటీర్లకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ డ్రైవ్ ద్వారా సేకరించిన జుట్టును విగ్‌లుగా తయారు చేసి అవసరమైన వారికి పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకు నగర హెయిర్ స్టైలిస్ట్ శివ ప్రసాద్ సహకరిస్తున్నట్లు తెలిపారు. హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు హిమజా రెడ్డి తదితరులు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

ఆద్య కళలను కాపాడేందుకు కృషి

- పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్
- సాలార్‌జంగ్ మ్యూజియంలో ఆద్య కళల ప్రత్యేక ప్రదర్శన



ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు తదితరులు

బహదూర్‌పురా: ఆద్య కళలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కృషి చేస్తామని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆద్య కళల ఎగ్జిబిషన్‌ను ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, డ్యానియల్, మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అడవుల్లో గిరిజన ప్రజలు వినియోగించిన కళా ఖండాలు, సంగీత వాయిద్యాలతో పాటు దినచర్యల్లో భాగంగా మానవుడికి అవసరమైన పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. కళాఖండాలు, చిత్రాలను తిలకించిన అర్వింద్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యంత ప్రాచీనమైన సంస్కృతి, సంప్రదాయం, కళా ఖండాలు ఉండటం గొప్ప విషయమని... వీటిని సంరక్షించేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తామన్నారు. ప్రొఫెసర్ తిరుమలరావు మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, గ్రామాల్లోని ప్రాచీన కళాఖండాలను, ప్రాచీన కళలను వెలికితీసేందుకు 45 సంవత్సరాలుగా కృషి చేశానన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో 2 వేల పైచిలుకు కళాఖండాలు, సంగీత వాయిద్యాలను అప్పటి నాగరికతను తెలిపే వస్తువులను ప్రదర్శనలో ఉంచామన్నారు. ఆదివాసుల జీవనశైలి, జానపద కళలు, ఇంట్లో వాడుకునే వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తుల్లో వాడే వస్తువులను, కాలానుగుణంగా మారుతూ వచ్చిన సంగీత వాయిద్యాలు, తోలు, చెక్క, కీలు బొమ్మలతో పాటు ఇనుప కళాఖండాల ఒకే వేదికపైన ఏర్పాటు చేశామన్నారు. 20 రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ప్రాశ్చ్య, భాషా, నాగరికత, జాతీయ సంస్థ పారిస్ అసోసియేట్ ప్రొఫెసర్ డ్యానియర్ నెజర్ మాట్లాడుతూ... మ్యూజియంలోని కళా ఖండాలు ఎంతో అద్భుతమైనవని... పురాతన కళాఖండాలతో వారి జీవన శైలి ఎంతో ప్రత్యేకంగా ఉందన్నారు. ఈ కళాఖండాలపై లోతుగా పరిశోధన చేసి అనేక విషయాలను తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మ్యూజియం కీపర్లు డాక్టర్ కుసుం, బి.ఆర్.నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ తిరుమల్ జయవీర్, డిప్యూటీ కీపర్ చింతమల్ల శ్రీనివాస్ రావుతో పాటు వివిధ కళాకారులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

సినీ నటుడు మంచు మనోజ్



మంచు మనోజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

గౌతంనగర్: యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సినీ నటుడు మంచు మనోజ్ అన్నారు. బీజేవైఎం జాతీయ కోశాధికారి పి.ఎం. సాయి ప్రసాద్ (టీమ్ సాయి) ఆధ్వర్యంలో సాయి స్పోర్ట్స్ ఉత్సవ్ పేరుతో రూ.42 లక్షల ప్రైజ్ మనీతో మల్కాజిగిరి, కంటోన్మెంట్ నియోజకర్గాల పరిధిలోని యువతీ, యువకులకు వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్స్ క్రికెట్, బ్యాడ్మింటన్, స్నూకర్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మల్కాజిగిరి లక్ష్మీ సాయి గార్డెన్స్ అవరణలో గత రెండు రోజులుగా వాలీబాల్ పోటీలు జరిగాయి. శనివారం ఎంపీ ధర్మపురి అరవింద్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పోటీల్లో 28 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో సుభాష్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన సినీ నటుడు మంచు మనోజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, కార్పొరేటర్లు శ్రావణ్, రాజ్యలక్ష్మీ, గున్నాల సునీతయాదవ్, నాయకులు జీకే. హన్మంతరావు, వికే. మహేష్, గోపు రమణారెడ్డి, ఆర్‌కే. శ్రీనివాస్, సదానంద్‌గౌడ్, మణిరత్నం, చందు, రాకేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టం అమలు చేయాలి

14న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా

పంజగుట్ట: రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టం కఠినంగా అమలు చేయాలని, బక్రీద్ సందర్భంగా గోవులను వధించడం మానుకోవాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 14న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, వీహెచ్‌పీ గోరక్ష దక్షిణ భారత్ ప్రముఖ్ యాదగిరి రావు, గోరక్ష తెలంగాణ రాష్ట్ర సహ ప్రముఖ్ జి.రమేష్, వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముక్కోటి దేవతలకు నిలయమైన గోవు హిందువులకు ఎంతో పవిత్రమైనదని, కానీ ఏటా బక్రీద్ పండగ సందర్భంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా గో హత్యలు జరుగుతున్నాయన్నారు. గోవులకోసం ఏర్పాటు చేసే చెక్ పోస్టులు నామమాత్రంగా మారాయని, ఓటు బ్యాంకు రాజకీయాలకోసం ఆవులను వధిస్తున్నా కేసులు నమోదు చేయడం లేదని ఆరోపించారు. పోలీసులు ఇలాగే వ్యవహరిస్తే వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు పార్టీలకు అతీతంగా హిందువులందరూ హాజరుకావాలని కోరారు.

వెటర్నరీ వర్సిటీని సందర్శించిన పాండిచ్చేరి మంత్రి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయాన్ని పాండిచ్చేరి వ్యవసాయ శాఖ మంత్రి జైకుమార్ సోమవారం సందర్శించారు. వర్సిటీలోని పశువైద్య కళాశాల, డైరీ ఫామ్, మేకల ఫామ్‌ను పరిశీలించారు. పశు వైద్య కళాశాలలో అమలవుతున్న గోకుల్ గ్రామ్ పథకం కింద చేపట్టిన వివిధ అంశాలను, గోట్ ఫామ్‌లోని వివిధ జాతుల మేకలను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అత్తాపూర్‌లోని కేజీమ్ డైరీని సందర్శించిన ఆయన ముర్రా జాతి గేదెల యాజమాన్య పద్ధతులు వాటి లభ్యతను మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన రంగారెడ్డి జిల్లాలోని భోస్తేపూర్, సింగప్పగూడెం గ్రామాల్లో అత్యాధునిక పద్ధతులతో పెంచుతున్న మేకల ఫారాలను సందర్శించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ మహేందర్, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ షేక్ మీరా, డాక్టర్ జేవీ ప్రసాద్, భాస్కరన్, రాజన్న, ఆర్‌ఎంవీ ప్రసాద్ ,హరికృష్ణ పాల్గొన్నారు.



గోట్ ఫామ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

విలువతో కూడిన విద్య అవసరం

సీఎం ముఖ్య సలహాదారు సోమేష్‌కుమార్



స్కూల్‌ను ప్రారంభిస్తున్న సోమేష్‌కుమార్, మిథాలీరాజ్ తదితరులు

శంషాబాద్: విలువలతో కూడిన విద్యతో సమాజానికి గొప్ప పౌరులను అందించాలని సీఎం ముఖ్య సలహాదారు సోమేష్‌కుమార్ అన్నారు. 'హరే కృష్ణ' మూమెంట్ సంస్థ సాతంరాయిలో ఏర్పాటు చేసిన 'బేసిల్ ఉడ్స్ స్కూల్'ను మాజీ క్రికెటర్ మిథాలీరాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. హరేకృష్ణ మూమెంట్ సంస్థ సామాజిక బాధ్యతతో అనేక సేవలందిస్తోందన్నారు. చదువులు, క్రీడలు సమాంతరంగా ఉండాలని మిథాలీ రాజ్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ చైర్మన్ చంచలపతిదాస్, హరేకృష్ణ మూమెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు గౌరచంద్రదాస్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి 'స్వాస్థ్య గ్లోబల్ ఆయుష్, వెల్‌నెస్ ఎక్స్‌పో'



ఎక్స్‌పో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఆరోగ్యంపై అందరికీ అవగాహన కల్పిస్తూ, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులన్నీ ఒకే గొడుగు కిందకు తెస్తూ, హోమియోపతి, ఆయుర్వేదాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నగరంలో మూడు రోజులపాటు 'స్వాస్థ్య గ్లోబల్ ఆయుష్, వెల్‌నెస్ ఎక్స్‌పో'ను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు హైటెక్స్ ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్, ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించే ఎక్స్‌పోను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ప్రారంభిస్తారన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్వాస్థ్య ఎక్స్‌పో అధ్యక్షురాలు ఫణిశ్రీ కొంటె, సెక్రటరీ జనరల్ డాక్టర్ సత్యనారాయణ దోర్నాల, కన్వీనర్లు డాక్టర్ సునీతా గ్రేస్ ఎక్స్‌పో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్లోబల్ ఆయుష్ ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్, యునానీ, యోగా, నేచురోపతి, సిద్ధ, హోమియో వైద్యసేవలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ ఎక్స్‌పో ముఖ్య ఉద్దేశమన్నారు. ఆయా విభాగాల హెల్త్, వెల్‌నెస్, బ్యూటీ, ఫుడ్, న్యూట్రీషన్, ఫార్మా ఉత్పత్తులతో పాటు మనిషి ఆరోగ్యంగా, అందంగా ఎలా ఉండాలో ప్రదర్శనలో వివరిస్తారన్నారు. 20 రాష్ట్రాలు, అమెరికా, కెనడా, యూకే నుంచి ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. సైంటిఫిక్ పేపర్ ప్రజంటేషన్, కరోనా సమయంలో వారు చేసిన బెస్ట్ ప్రాక్టీస్ వివరిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కల్పన, సత్యదీప, వైదేహి, వెంకట్ నాయక్ పాల్గొన్నారు.

మళ్లీ ఆ ఇద్దరే కొట్టేశారు!

హిమాయత్‌నగర్: తమ సంస్థలో పనిచేసే ఇద్దరు కస్టోడియన్లు ఏటీఎం మెషిన్స్‌లో లోడ్ చేయాల్సిన డబ్బును స్వాహా చేశారంటూ 'సీఎంఎస్ ఇన్ఫోసిస్టం లిమిటెడ్' సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంలలో లోడ్ చేయాల్సిన డబ్బును మాయం చేయడంతో సీఎంఎస్ సీనియర్ మేనేజర్ పి.రాజేశ్వర్ ఇటీవల గోల్కొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేశారు. తాజాగా అదే కేసును సీసీఎస్‌కు బదిలీ చేయడంతో రీ-రిజిష్టర్ చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల లక్డీకాపూల్-అత్తాపూర్ రూట్‌లో రూ. రూ. 32 లక్షల నగదును 31 హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలలో లోడు చేయాలని నల్లకుంటకు చెందిన కస్టోడియన్స్ ఎం.సిరాజ్, కె.శ్రీనివాస్‌లకు సీఎంఎస్ అప్పగించింది.అయితే వారు ఒక్క ఏటీఎంలోనూ నగదు లోడ్ చేయలేదని ఆడిటర్ సురేందర్‌రెడ్డి సంస్థ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సదరు సంస్థ సమగ్ర విచారణ చేపట్టి సిరాజ్, కె.శ్రీనివాస్ డబ్బుతో పరారైనట్లుగా గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మళ్లీ ఆ ఇద్దరిపైనే ఫిర్యాదు

లక్డీకాపూల్ నుంచి అత్తాపూర్ రూట్‌లోని హెచ్‌డీఎఫ్ ఏటీఎంలలో అమర్చాల్సిన డబ్బును స్వాహా చేశారంటూ సీనియర్ మేనేజర్ పి.రాజేశ్వర్ ఏప్రిల్ 10న సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీసీఎస్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. సరిగ్గా రెండు నెలల తర్వాత మళ్లీ అదే రూట్‌లో గతంలో నేరానికి పాల్పడిన వారు ఇద్దరే తాజాగా రూ. 32 లక్షలు స్వాహా చేశారంటూ గోల్కొండ పీఎస్‌లో ఫిర్యాదు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో 33 ఏటీఎంలలో లోడు చేయాల్సిన రూ. 92 లక్షలను కాజేశారని అప్పట్లో ఆడిటర్ సురేందర్‌రెడ్డి సంస్థ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పుడు కూడా సేమ్ అదే సీన్ రిపీట్ కావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



● పేడతో కళాకృతులు తయారు చేస్తూ...

భలే... పేడ కళ

'ఇంకేం మిగిలింది పేడ' అని వ్యంగ్యంగా అనవచ్చు. పేడ విలువ మన పూర్వికులకు తెలుసు. దాని ఉపయోగాలూ తెలుసు. పేడ అలికిన ఇల్లు శుభదాయకమైనది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇప్పుడొక టీచరమ్మ పేడతో కళాకృతులు తయారు చేస్తోంది. ఆధ్యాత్మిక చిహ్నాలను పేడతో రూపొందిస్తోంది. వీటి అలంకరణ ఇంటికి సంప్రదాయకళ తెస్తుందని చెబుతోంది. ప్రస్తుతం జనం వాటిని కొనేందుకు సిద్ధమవుతున్నారు.

పేడతో పిడకలు కొట్టడం, కళ్లాపి చల్లుకోవడం, ఇల్లు అలుక్కోవడం తరతరాలు చేస్తున్నదే. కాని పేడతో కళాకృతులు చేయడం ద్వారా ఒట్టిపోయిన ఆవులను, ఎడ్లను కూడా రోడ్ల మీద వదలడమో, కబేళాకు తరలించడమో చేయకుండా వాటి ఆలనా పాలనా చూడొచ్చు అంటుంది 42 ఏళ్ల పూజా గాంగ్వర్.

తేలిక బొమ్మలు

పేడతో తయారయ్యే వస్తువులు తేలిగ్గా ఉంటాయి. ఎందుకంటే పేడను సేకరించి, ఎండబెట్టి, పొడి చేసుకుని, జల్లెడ పట్టుకుని, ఆ వచ్చిన మెత్తటి పొడికి మైదా పిండిగాని, చెట్టు బంక గాని, ముల్తానీ మట్టిగాని కలిపి సాగే లక్షణం కలిగిన బంక పదార్థంగా (క్లే) చేసుకుని దానితో కళాకృతులు తయారు చేస్తారు. 'ఇనుము, రాగి, ఫైబర్ మూసల్లో పేడ క్లేను మూసబోసి ఆరబెట్టి బొమ్మలను తయారు చేస్తాం' అని తెలిపింది గాంగ్వర్.



● తాము తయారుచేసిన కళాకృతులతో పూజా బృందం

కిలో పేడ ఎంత?

కిలో పేడ మనం ఎంతకు కొంటాం? ఎంతకీ కొనం. ఎందుకంటే పేడ ఎక్కడైనా దొరుకుతుంది. 'కాని వాటితో కళాకృతులు చేస్తే కిలో పేడ కళాకృతులకు 2000 రూపాయలు వస్తాయి. సంపాదించవచ్చు' అంటోంది పూజా గాంగ్వర్. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌కు సమీపంలోని రాజన్‌పూర్ అనే గ్రామంలో ప్రైమరీ టీచర్‌గా పని చేస్తున్న పూజా గాంగ్వర్ పేడతో కళాకృతులు చేయడమే కాదు. వాటివల్ల ఒక డజను మందికి ఉపాధి కల్పిస్తోంది, ఆదాయమూ గడిస్తోంది. వాల్ హ్యాంగింగులు, నేమ్ ప్లేట్లు, బొమ్మలు, పెన్ హోల్డర్లు, అగర్ బత్తీలు, చెప్పులు... ఇలా ఎన్నో తయారు చేస్తూ ఆకట్టుకుంటోంది.

బొప్పాయి పాలు


'మూసలో పోసి ఆరబెట్టుకున్న కళాకృతులకు పాలిష్ కోసం బొప్పాయి పాలుగాని, అవిసె గింజల నూనె గాని వాడతాం. ఈ కళాకృతులు పాడుగావు. నీళ్లు తగలకుండా చూసుకుంటే ఐదారేళ్లు ఉంటాయి. మా ఊళ్లోని యాభై ఆవుల పేడను నేను ఈ బొమ్మల కోసం వాడుతున్నాను. ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల నుంచి స్త్రీలు వచ్చి నేర్చుకుంటామంటున్నారు. వారికి ట్రయినింగ్ ఇస్తే ఆవు పేడ సద్వినియోగం అవుతుంది. ఆవుల సంరక్షణా జరుగుతుంది' అని తెలిపింది పూజ.

కిచెన్ టిప్స్

- పకోడీలు కరకరలాడాలంటే శనగ పిండిలో ఒక గరిటెడు వేడి నూనె కలపాలి.
- పూరీలు బాగా పొంగాలంటే పావుకేజీ గోధుమ పిండిలో ఒక టేబుల్ స్పూన్ వరి పిండి కలపాలి లేదా పూరీల పీట మీద వరి పిండి చల్లి పూరీలు వత్తాలి.



- వేపుడు చేసే బాణలిలో నూనె వేయడానికి ముందు చిటికెడు ఉప్పు చల్లితే తక్కువ నూనెతో వంట పూర్తి చేయవచ్చు.
- కొబ్బరి మసాలా రుబ్బడానికి ముందు కొబ్బరిని తక్కువ సమయం వేయించాలి, రంగు మారే వరకు వేయిస్తే కొబ్బరి రుచి మారిపోతుంది.
- మసాలా పొడి కోసం ధనియాలు, మెంతులు వంటి దినుసులను వీలయినంత తక్కువ మంట మీద వేయించాలి.
- టొమాటోలు దొరకని రోజుల్లో వంటల్లో టొమాటో కెచప్ లేదా టొమాటో సాస్‌లను కలిపి దాదాపు అదే రుచిని తీసుకురావచ్చు.



- అల్లం వెల్లుల్లి మసాలా తయారీలో ఏది ఎంత మోతాదులో వేయాలా అనే సందేహం పీడిస్తుంది, అల్లం నలభై శాతం, వెల్లుల్లి 60 శాతం ఉండాలి.
- కంది పప్పు ఉడికేటప్పుడు ఒక స్పూన్ నూనె లేదా నెయ్యి వేస్తే రుచి ఇనుమడిస్తుంది. పప్పు పలుకుగా ఉండకుండా మృదువుగా ఉంటుంది కూడా.
- డెజర్ట్ తయారీలో వాడే పాలు తప్పనిసరిగా ఫుల్ క్రీమ్ మిల్క్ అయి ఉండాలి. అప్పుడే చక్కటి రుచి వస్తుంది.

గెలుపు దారి

కాగితానికి కొత్త ఊపిరి

'నేను ఇల్లు దాటి బయట అడుగు వేయలేకపోవచ్చు. అయితే నేను తయారు చేసిన బొమ్మలు మాత్రం దేశదేశాలకు వెళుతున్నాయి' ఆనందంగా అంటుంది రాధిక. ఆమె చేతిలో కాగితం కూడా కొత్త ఊపిరి పోసుకుంటుంది. పాతన్యూస్ పేపర్లతో ఆమె తయారు చేసిన బొమ్మలలో ఆత్మవిశ్వాస కళ ఉట్టిపడుతుంది. 'చీకటిని చూసి దిగులు పడకు. అదిగో వెలుగు' అని ఆ బొమ్మలు మౌనంగానే చెబుతుంటాయి...



● మోటివేషనల్ స్పీకర్‌గా... రాధిక

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన రాధిక బోస్ డీసీజ్ వల్ల నడకకు దూరమైంది. బడి మానేయవలసి వచ్చింది. రోజంతా బెడ్ మీద కూర్చోక తప్పనిసరి పరిస్థితి. 'ఇక ఇంతేనా!' అనే చింత ఆమెలో మొదలైంది. తన మనసులోని బాధను పంచుకోడానికి స్నేహితులు కూడా లేరు. కిటికీ నుంచి అవతలి ప్రపంచాన్ని చూస్తే... పిల్లలు బడికి వెళుతుంటారు... ఇలా ఎన్నో దృశ్యాలు ఆమె కంట పడేవి. తన విషయానికి వస్తే... బయటి ప్రపంచంలోకి వెళ్లడమంటే ఆస్పత్రికి వెళ్లడమే.



తనలో తాను మౌనంగా కుమిలిపోతున్న సమయంలో 'ఆర్ట్' అనేది ఆత్మీయనేస్తమై పలకరించింది. పద్నాలుగేళ్ల వయసులో డ్రాయింగ్, పెయింటింగ్ మొదలుపెట్టింది. ఆర్ట్‌పై సోదరి ఆసక్తిని గమనించిన రాజ్‌మోహన్ పాత న్యూస్‌పేపర్లు, మెటల్ వైర్లతో ఆఫ్రికన్ బొమ్మలు తయారు చేసే యూట్యూబ్ వీడియోలను చూపెట్టాడు. అవి చూసిన తరువాత రాధికకు తనకు కూడా అలా తయారు చేయాలనిపించింది.

పాత న్యూస్‌పేపర్‌ల నుంచి నవదంపతులు, సంగీతకారులు, వైద్యులు, దేవతలు... ఇలా రకరకాల బొమ్మలు తయారు చేసింది.

పొరుగింటి వ్యక్తికి రాధిక తయారు చేసిన బొమ్మ బాగా నచ్చి కొనుగోలు చేసింది. అది తన ఫస్ట్ సేల్.

ఆ సమయంలో రాధికకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. రాజ్‌మోహన్ స్నేహితుడు రాధిక తయారు చేసిన అయిదు బొమ్మలను తన షాప్‌లో పెడితే మంచి స్పందన వచ్చింది. ఆ తరువాత మరి కొన్ని బొమ్మలు కొన్నాడు. వారం వ్యవధిలో 25 బొమ్మలను అమ్మాడు.

సోషల్ మీడియా ద్వారా రాధిక బొమ్మల వ్యాపారం ఊపు అందుకుంది. ఊటీకి చెందిన ఒక హోటల్ యజమాని 25 బొమ్మలకు ఆర్డర్ ఇచ్చాడు. ఊటీలోని ఆ హోటల్‌ను తాను తయారు చేసిన బొమ్మలతో అలంకరించడం రాధికకు సంతోషం కలిగించింది.

తన బొమ్మల గురించి ప్రచారం చేయడానికి పైసా ఖర్చు చేయకపోయినా సోషల్‌మీడియాలోని పోస్ట్‌ల వల్ల ఆర్డర్లు వెల్లువెత్తాయి.

మూడువేలకు పైగా బొమ్మలు తయారు చేసిన రాధిక...

'బొమ్మలకు ప్రాణం పోస్తుంటే నన్ను నేను మరిచిపోతాను. కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లుగా అనిపిస్తుంది. టైమే తెలియదు. బొమ్మలు చేస్తున్నప్పుడు ఎంతో ఏకాగ్రత కావాలి. ఆసక్తి ఉన్నచోట సహజంగానే ఏకాగ్రత ఉంటుంది' అంటుంది. రాధిక ఇప్పుడు ఆర్టిస్ట్ మాత్రమే కాదు. మోటివేషనల్ స్పీకర్ కూడా. తన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలతో ఎంతోమందికి ధైర్యాన్ని ఇస్తోంది. ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తోంది.

బీజీ-3 పత్తితో డేంజర్!

సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 21 వరకు
ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

కలుపు మందును తట్టుకునే (హెర్బిసైడ్ టాలరెంట్) విధంగా జన్యుమార్పిడి చేసిన పత్తి రకం (దీన్నే 'బీజీ 3 పత్తి' అని కూడా అంటున్నారు) దేశవ్యాప్తంగా అక్రమంగా సాగులో ఉంది. దీనికి ప్రభుత్వ అనుమతి లేదు. గ్లైఫోసేట్ అనే ప్రమాదకరమైన కలుపు మందు చల్లినా తట్టుకునే విధంగా జన్యుమార్పిడి చేసిన పత్తి పంట ఇది. సాధారణ బీజీ 2 పత్తి రకాలకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది. ప్రభుత్వ అనుమతి లేకపోయినా కొందరు రైతులకు వ్యాపారులు బీజీ 3 పత్తి విత్తనాలను అంటగడుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల అనేక సార్లు అక్రమంగా తరలిస్తున్న క్వింటాళ్ల కొద్దీ బీజీ 3 పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నిషిద్ధ హెచ్.టి. పత్తి సాగు వల్ల కలిగే అనర్థాలేమిటో రైతులకు తెలియజెప్పే ప్రయత్నమే ఈ కథనం. గ్లైఫోసేట్ కలుపు /గడ్డి మందు వల్ల కేన్సర్ వంటి జబ్బులు రావటంతో పాటు భూమి, నీరు, గాలి కలుషితం అవుతాయని, రైతులు వాస్తవాలు తెలుసుకొని ఈ విత్తనాలు వాడకుండా జాగ్రత్తపడాలని ప్రముఖ శాస్త్రవేత్త, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా. కేశవులు 'సాక్షి సాగుబడి' ద్వారా సూచిస్తున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...



ప్రతీకాత్మక చిత్రం



● డా. కె. కేశవులు

హెర్బిసైడ్ టాలరెంట్ (హెచ్.టి.) పత్తి అనేది ప్రభుత్వ ఆమోదం లేని కలుపు మందును తట్టుకునే జన్యువును కలిగి ఉన్న ఒక రకమైన జన్యుమార్పిడి పత్తి. దీన్ని సాధారణంగా బీజీ–3 (రౌండ్ అప్ రెడీ ఫ్లెక్స్)గా వ్యవహరిస్తుంటారు. దీని సాగుకు భారత ప్రభుత్వ ఆమోదం లేదు. బీజీ 3 పత్తి విత్తనాలను ఉత్పత్తి చేయటం, అమ్మటం మన దేశంలో చట్టవిరుద్ధం. కలుపు మందును తట్టుకునే పత్తి రకాన్ని మోన్‌శాంటో అభివృద్ధి చేసి 'రౌండ్-అప్ రెడీ ఫ్లెక్స్ (ఆర్.ఆర్.ఎఫ్.) పేరుతో అమెరికాలో విక్రయిస్తూ ఉంది. మన దేశంతో సహా ప్రపంచదేశాల్లో కూడా అమ్మటానికి ఆ కంపెనీ ప్రయత్నిస్తోంది.

హెచ్.టి. పత్తి గింజలో గ్లైఫోసేట్ కలుపు మందును తట్టుకునే అదనపు జన్యువు ఉంది. అందువల్ల, ఈ పంటను పొరపాటున సాగు చేసే రైతులు పొలాల్లో కలుపు మొక్కల నియంత్రణ కోసం గ్లైఫోసేట్‌ను గుడ్డిగా పిచికారీ చేసే ప్రమాదం ఉంది. అయితే, గ్లైఫోసేట్ కలుపు మందు క్యాన్సర్ కారక ప్రభావాన్ని కలిగి ఉందని రైతులు తెలుసుకోవాలి. అంతేకాదు, మీరు పొలాల్లో అనుమతి లేని ఈ పంటను సాగు చేస్తే పరాగ సంపర్కం ద్వారా సమీపంలోని మొక్కలకు కలుపు మందును తట్టుకునే జన్యువు అనియంత్రితంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఇది వివిధ రకాల 'సూపర్ వీడ్(కలుపు మందులకు లొంగని మొండి జాతి కలుపు మొక్క)లను సృష్టిస్తుంది.

భారత ప్రభుత్వ ఆమోదం లేని కలుపు మందులను తట్టుకునే లక్షణం కలిగిన జన్యువు ఉద్దేశపూర్వకంగానో లేదా అనుద్దేశపూర్వకంగానో గుర్తు తెలియని సంస్థలు/ఏజెన్సీల ద్వారా మన దేశంలోని రైతుల పొలాల్లోకి, పర్యావరణంలోకి విడుదలైంది. అది ఇప్పుడు రైతులు పండించిన పత్తి పొలాల్లోకి చేరి ఇతర సంకరజాతి పత్తి రకాలను కూడా కలుషితం చేస్తూ.. జీవవనరుల స్వచ్ఛతకు ముప్పుగా పరిణమించింది.

జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ(జీఈఏసీ) అనుమతి లేకుండా ఏదైనా పత్తి విత్తనాన్ని ఉత్పత్తి చేయడం/అమ్మటం పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం చట్టవిరుద్ధం. ఇది జీఈఏసీ ఆమోదం పొందనందున, మన దేశంలో అక్రమంగా విక్రయిస్తున్న బీజీ3 విత్తనం నాణ్యతపై జవాబుదారీతనం లేదు. అంతేకాదు, పర్యావరణం కలుషితమవుతున్నది. చట్టవిరుద్ధమైన బీజీ 3 పత్తి విత్తనాలు చిన్న, సన్నకారు పత్తి రైతులను నాశనం చేయడమే కాకుండా దేశంలోని మొత్తం చట్టపరమైన పత్తి విత్తన మార్కెట్‌కు కూడా ముప్పుగా తయారయ్యాయి.

అంతేకాదు, గ్లైఫోసేట్ కలుపు మందును పంటలు వేయని ప్రాంతాల్లో మాత్రమే వాడటానికి చట్టం అనుమతిస్తుంది. అందువల్ల, అనుమతి లేని బీజీ 3 పత్తి విత్తనాలు వేసి గ్లైఫోసేట్ కలపు మందును రైతులు విచక్షణారహితంగా పొలాల్లో పిచికారీ చేస్తే.. అది మనుషులు, జంతువుల ఆరోగ్యంతో పాటు జీవవైవిధ్యం, నేల ఆరోగ్యంపై, భూసారంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.



● అమెరికాలో గ్లైఫోసేట్ కలుపు మందుకు కూడా లొంగకుండా పెరుగుతున్న హార్స్‌విడ్

అందువల్ల రైతులు కలుపు మందును తట్టుకునే (హెచ్.టి.) బీజీ 3 పత్తిని ఎందుకు సాగు చేయకూడదంటే : ● బీజీ 3 పత్తి సాగుకు ప్రభుత్వ అనుమతి లేదు. దేశంలో దీని సాగు చట్టవిరుద్ధం. ● బీజీ 3 పత్తి సాగు గ్లైఫోసేట్ వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది క్యాన్సర్‌కు కారణం కావచ్చు. నేల ఆరోగ్యంపై, భూ సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. నీటిని కలుషితం చేస్తుంది. జంతువులు, మనుషుల ఆరోగ్యాన్ని కూడా దెబ్బ తీస్తుంది. ● రైతులు ఈ అక్రమ విత్తనాలను ఉపయోగించడం వలన పంట పోవచ్చు/ దిగుబడి నష్టం జరగొచ్చు/ ఆదాయం తగ్గిపోవచ్చు. ● ఈ రకం పత్తి సాగు వల్ల కొన్నాళ్లకు కలుపు మందులు చల్లినా చనిపోని మొండి కలుపు మొక్కలు తయారు కావచ్చు. మొండి కలుపును నియంత్రించడం చాలా కష్టం. అంటే, రైతులు ఈ కలుపు మొక్కల నియంత్రణకు మరింత ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పైగా తక్కువ దిగుబడి/పంట నష్టానికి దారితీయవచ్చు. కాబట్టి, బీజీ 3/హెచ్.టి. పత్తి విత్తనాలకు రైతులు దూరంగా ఉంటే మంచిది.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

● ఎత్తు మడులపై లేదా బోదెలు తోలి విత్తుకుంటే వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా పంటకు ధోకా ఉండదు

బోదెలు తోలి విత్తుకుంటే మేలు!



● ఎత్తు మడులపై ఏపుగా ఎదిగిన పత్తి పంటలో డా.ప్రవీణ్‌కుమార్ తదితరులు



● దుక్కి చేసిన పొలంలో ట్రాక్టర్ ద్వారా ఇలా ఎత్తు మడులు/బోదెలు తోలుకోవాలి



● వర్షం పడిన తర్వాత ఒక వరుసలో పత్తి విత్తనం వేసుకోవాలి



● ఎత్తు మడులపై ఆరోగ్యంగా పెరుగుతున్న పత్తి పైరు

వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా, వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజుల వ్యవధి వచ్చినా.. పత్తి, కూరగాయలు, సోయా, వేరుశనగ.. పంట ఏదైనా సరే.. నల్ల రేగడైనా, ఎర్ర నేలైనా, బంక మట్టి అయినా సరే.. ఎత్తు మడులు(రెయిజ్డ్ బెడ్స్) చేసి లేదా బోదెలు తోలి పంటలు విత్తుకోవటం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆదిలాబాద్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ప్రవీణ్ కుమార్ (99896 23829) గత కొన్ని సంవత్సరాలుగా ఎత్తుమడులపై పత్తిని సాగు చేయటంపై ప్రయోగాలు చేస్తూ చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు.

దుక్కి దున్ని, ట్రాక్టర్‌కు అమర్చిన బెడ్ మేకర్ ద్వారా బోదెలు తోలాలి. తగుమాత్రంగా వర్షం పడిన తర్వాత ఆ బెడ్‌పై ఒకే వరుసలో విత్తుకోవాలి. చదునుగా ఉండే పొలంలో సాగు చేసిన పత్తి పంట కంటే బోదెలు తోలి సాగు చేసిన పత్తి పంట మంచి దిగుబడినిచ్చింది. వర్షాలకు అధిక నీరు పొలంలో నిల్వ ఉండకుండా బయటకు వెళ్లిపోవటం వల్ల పత్తి పంట ఉరకెత్త లేదు. గాలి, వెలుతురు మొక్కల మొదళ్లకు బాగా తగలటం వల్ల, ఎత్తు మడిలో మట్టి గుల్లగా ఉండటంతో వేరు వ్యవస్థ బాగా విస్తరించటం వల్ల పంట ఆరోగ్యంగా ఎదిగింది. ఫ్లాట్ బెడ్‌పై విత్తనాలు నాటిన దానితో పోల్చితే అధిక పత్తి దిగుబడులు రావటానికి ఎత్తు మడుల పద్ధతి బాగు ఉపయోగపడిందని డా. ప్రవీణ్ కుమార్ 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. ఒక వేళ వర్షాలు తక్కువ పడితే, వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజులు గ్యాప్ వచ్చినా కూడా ఎత్తుమడిపై ఉన్న పంట వేరు వ్యవస్థలో తేమ త్వరగా ఆరిపోదు. అందువల్ల బెట్టను తట్టుకునే శక్తి కూడా బోదెలపై నాటిన పంటకు చేకూరుతుంది. ఎత్తు మడులు / బోదెలపై పత్తి పంటను విత్తుకోవటం గురించి తాజా వీడియోను 'కేవీకే ఆదిలాబాద్' యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశారు. రైతులు ఆ వీడియోను చూసి అవగాహన పెంచుకోవచ్చు.

www.youtube.com/@kvkadilabad3800

జూలై 15 వరకు ఆంగ్రూ ఇంక్యుబేటర్ గడువు

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను గుర్తించి, ప్రోత్సహించే లక్ష్యంతో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా తిరుపతిలో ఏర్పాటైన పోషణ్ ఇంక్యుబేటర్ విభాగం ఆరో విడత ప్రవేశాల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆర్‌కెవీవై రఫ్తార్ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి 2 నెలల సాంకేతిక, వాణిజ్య అంశాలపై శిక్షణతో పాటు సంకల్ప్ ప్రోగ్రామ్‌లో రూ. 5 లక్షలు, సమృద్ధి ప్రోగ్రామ్‌లో రూ. 25 లక్షల వరకు ఆర్థిక తోడ్పాటును అందిస్తారు. ఆవిష్కర్తలకు విద్యార్హతల పరిమితి లేదు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలకు చెందిన ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 15 ఆఖరు తేదీ. వివరాలకు.. ఆంగ్రూ పోషణ్ ఇంక్యుబేటర్ విభాగం – 94416 70829.

భూ సమస్యలపై 23న గుంటూరులో శిక్షణ

'భూమి సమస్యలు –చట్టాలు –పరిష్కార మార్గాలు' అనే అంశంపై గుంటూరు బృందావన్ గార్డెన్స్ రోడ్డు నంబర్–1 లోని ల్యాఫ్ (ది రురల్ లా ఫర్మ్) కార్యాలయంలో ఈ నెల 23(శుక్రవారం)న ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు సాధనా అకాడమీ ఆఫ్ ఇంపరటివ్ లా అండ్ లైఫ్ స్కిల్స్(సెయిల్స్)కు చెందిన 'భూమి సునీల్' తదితర నిపుణులు అవగాహన కల్పిస్తారు. ఆర్‌ఓఆర్ చట్టం –నూతన సవరణలు, భూముల సర్వే, టైటిల్ గ్యారంటీ, చుక్కల భూముల సమస్యలు, అసైన్డ్ భూముల సమస్యలు, నిషేధిత భూముల జాబితాలో పట్టా భూములు, ఇనాం భూముల సమస్యలు, భూమి రికార్డులు.. ఈ అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఫీజు, ఇతర వివరాలకు.. 63038 67620.



మళ్లీ నంబర్‌వన్‌గా జొకోవిచ్

కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో కొత్త చరిత్ర సృష్టించిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన అగ్ర స్థానాన్ని మళ్లీ అందుకున్నాడు. ఏటీపీ సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అతను 7,595 పాయింట్లతో రెండు స్థానాలు మెరుగుపర్చుకొని వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. 36 ఏళ్ల జొకోవిచ్ తన కెరీర్‌లో నంబర్‌వన్‌గా 388వ వారంలోకి అడుగు పెట్టడం విశేషం. ఇప్పటివరకు టాప్‌లో ఉండి సెమీస్‌లో జొకోవిచ్ చేతిలో ఓడిన అల్కరాజ్ రెండో స్థానానికి పడిపోగా, రష్యా ప్లేయర్ ఖచనోవ్ మరోసారి టాప్-10లోకి అడుగు పెట్టాడు.

380వ ర్యాంక్‌కు సహజ యమలపల్లి



ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటీఏ) ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తెలుగమ్మాయి సహజ యమలపల్లి పురోగతి సాధించింది. సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో ఆమె 60 స్థానాలు మెరుగుపర్చుకొని 380వ ర్యాంక్‌కు చేరుకుంది. 143 ర్యాంకింగ్ పాయింట్లు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ జాబితాలో భారత్‌నుంచి అంకితా రైనా అందరికంటే మెరుగైన ర్యాంక్ (209)లో ఉంది.

భారత మ్యాచ్ 'భాగ్యం' లేదు!

వరల్డ్ కప్‌లో ఉప్పల్ మైదానానికి దక్కని టీమిండియా వన్డే

- పాకిస్తాన్ 2 మ్యాచ్‌లు ఆడే అవకాశం
- అహ్మదాబాద్‌లో భారత్, పాక్ పోరు
- ఐసీసీకి షెడ్యూల్ డ్రాఫ్ట్ సమర్పించిన బీసీసీఐ



న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అభిమానులను తీవ్రంగా నిరాశపర్చే పరిణామం...వన్డే ప్రపంచకప్ వేదికల్లో ఒకటిగా ఖాయమై రూ. 117 కోట్లతో ఆధునీకరణకు ఉప్పల్ స్టేడియం సిద్ధమవుతోందని, మెగా ఈవెంట్‌లో టీమిండియా మ్యాచ్‌ను వీక్షించవచ్చని భావించిన ఫ్యాన్స్‌కు బీసీసీఐ షాక్ ఇచ్చింది. ఉప్పల్ స్టేడియంలో భారత జట్టు ఆడే అవకాశం లేదని తేలింది. మ్యాచ్ వేదికలు, తేదీలకు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి బీసీసీఐ షెడ్యూల్ డ్రాఫ్ట్ సమర్పించింది. ఇందులో టీమిండియా లీగ్ దశలో ఆడే 9 మ్యాచ్‌ల వేదికల్లో హైదరాబాద్ పేరు లేదు. ఉప్పల్ స్టేడియాన్ని భారత మ్యాచ్ కోసం పరిగణలోకి తీసుకోలేదు. బోర్డు పంపిన జాబితాను వరల్డ్ కప్ ఆడే అన్ని జట్లకూ పంపించి వారి అభిప్రాయం తీసుకున్న తర్వాత ఐసీసీ అధికారిక ప్రకటన చేస్తుంది. అయితే... సాధారణంగా ఆతిథ్య దేశం ఇచ్చిన డ్రాఫ్ట్‌లో మార్పులు లేకుండానే ఐసీసీ ఆమోదిస్తుంది కాబట్టి ఈ షెడ్యూల్ ప్రకటన లాంఛనమే. భారత జట్టు ఆడకపోయినా... 2011 వరల్డ్ కప్‌తో పోలిస్తే ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగడమే అభిమానులకు కాస్త ఊరట. డ్రాఫ్ట్ ప్రకారం పాకిస్తాన్ జట్టు ఇక్కడ రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది.

వరల్డ్ కప్‌లో భారత మ్యాచ్‌ల షెడ్యూల్ (బీసీసీఐ డ్రాఫ్ట్ ప్రకారం)

అక్టోబర్ 8 - ఆస్ట్రేలియా (చెన్నై)
అక్టోబర్ 11 - అఫ్గనిస్తాన్ (ఢిల్లీ)
అక్టోబర్ 15 - పాకిస్తాన్ (అహ్మదాబాద్)
అక్టోబర్ 19 - బంగ్లాదేశ్ (పుణే)
అక్టోబర్ 22 - న్యూజిలాండ్ (ధర్మశాల)
అక్టోబర్ 29 - ఇంగ్లండ్ (లక్నో)
నవంబర్ 2 - క్వాలిఫయర్ (ముంబై)
నవంబర్ 5 - దక్షిణాఫ్రికా (కోల్‌కతా)
నవంబర్ 11 - క్వాలిఫయర్ (బెంగళూరు)



భారత్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2011 వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌ను దాదాపు ఏడాది క్రితమే ఐసీసీ ప్రకటించింది. దీని ప్రకారం శ్రీలంక, బంగ్లాదేశ్ కాకుండా భారత్‌లో 8 వేదికల్లో 29 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు బీసీసీఐ ఖరారు చేసింది. అప్పట్లోనే అన్ని రకాలుగా సిద్ధమైన హైదరాబాద్ స్టేడియం 3 వన్డేలకు ఆతిథ్యమిచ్చింది కూడా. అయితే వరల్డ్ కప్ మైదానాల్లో మాత్రం ఉప్పల్‌కు చోటు దక్కలేదు. 'టెస్టు హోదా ఉన్న స్టేడియాలను మాత్రం బోర్డు పరిశీలించింది' అంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధికారి ఒకరు దానికి వివరణ ఇచ్చారు. ఇప్పుడు పుష్కర కాలం తర్వాత భారత్ మరోసారి వన్డే ప్రపంచ కప్‌ను నిర్వహిస్తోంది. హైదరాబాద్‌కు మ్యాచ్‌లు దక్కాయన్న ఆనందంలో అభిమానులు ఉండగా, ఇప్పుడు భారత్ మ్యాచ్ లేకపోవడం సహజంగానే నిరాశపర్చే అంశం. క్రికెట్ పట్ల చూపించిన ఆదరణను బట్టి చూస్తే ఉప్పల్ స్టేడియం ఎప్పుడూ నిరాశపర్చలేదు. అంతర్జాతీయ మ్యాచ్‌లు మాత్రమే కాదు...ఐపీఎల్ హోం టీమ్ సన్‌రైజర్స్ పేలవ ప్రదర్శన ఇచ్చినా సరే, స్టేడియంలో వారి ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. దేశవ్యాప్తంగా చూస్తే చక్కటి అవుట్‌ఫీల్డ్, ఫిర్యాదులు లేని పిచ్‌తో సహా సౌకర్యాలపరంగా చూస్తే ఇతర అన్ని స్టేడియాలతో పోలిస్తే మేలైన వసతులు ఉన్నాయి. అయితే ఇదంతా బోర్డు పట్టించుకున్నట్లుగా లేదు. వరల్డ్ కప్‌లో వేదికల ఖరారు గురించి గత నెలలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. కార్యదర్శి జై షా నేతృత్వంలో ఇది పని చేసింది. భారత మ్యాచ్‌లకు కేటాయించిన 9 వేదికలను చూస్తే వేర్వేరు కారణాలతో వీటిని ఖాయం చేసినట్లుగా అర్థమవుతుంది. భారత క్రికెట్‌లో మొదటినుంచి 'ప్రధాన' కేంద్రాలుగా గుర్తింపు పొందిన ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ వేదికల విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. సహజంగానే పెద్ద స్టేడియమైన అహ్మదాబాద్‌లో అన్నింటికంటే పెద్ద మ్యాచ్ (పాక్‌తో) నిర్వహించాలని బోర్డు భావించింది. మిగతా మూడు వేదికల విషయంలో బోర్డు అంతర్గత రాజకీయాలు పని చేశాయి. బోర్డు ఉపాధ్యక్షుడైన రాజీవ్ శుక్లా తన సొంత మైదానమైన లక్నోలో, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తమ అసోసియేషన్‌కు చెందిన ధర్మశాలలో మ్యాచ్‌లను తీసుకున్నారు. పుణేకు కూడా మ్యాచ్ కేటాయించుకోవడంలో మహారాష్ట్ర క్రికెట్ సంఘం గట్టిగా ప్రయత్నం చేసి సఫలమైంది. నిజానికి ముందుగా షార్ట్ లిస్ట్ చేసిన 12 వేదికల్లో పుణే పేరు లేదు. ఆ తర్వాత దానిని అదనంగా చేర్చడంలోనే పరిస్థితి అర్థమైంది. బహుశా ఈ మ్యాచ్ ఉప్పల్‌కు దక్కేదేమో. కానీ బోర్డులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరఫున ఎలాంటి ప్రాతినిధ్యమే లేదు. నిత్య కలహాలతోనే అసోసియేషనే లేకుండా మాజీ న్యాయమూర్తి చేతుల్లో ఉన్న వ్యవస్థ మ్యాచ్‌పై పట్టుబట్టే పరిస్థితిలో అసలే లేదు!

తొలి మ్యాచ్, ఫైనల్ అహ్మదాబాద్‌లోనే...

లక్షకు పైగా సామర్థ్యం ఉన్న అహ్మదాబాద్ స్టేడియం సహజంగానే వరల్డ్‌కప్‌కు ప్రధాన వేదిక కానుంది. 2019 వరల్డ్ కప్ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య అక్టోబర్ 5న జరిగే మ్యాచ్‌లో ఈ విశ్వ సమరం మొదలవుతుంది. నవంబర్ 19న ఫైనల్ మ్యాచ్ కూడా ఇక్కడే జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ షెడ్యూల్‌లో లీగ్ దశకే పరిమితం కాగా... నవంబర్ 15, 16న జరిగే సెమీ ఫైనల్ వేదికల గురించి ఇంకా పేర్కొనలేదు. అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో జరిగే తొలి పోరుతో భారత్ వరల్డ్ కప్ వేట మొదలవుతుంది. నిజానికి పూర్తి స్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ ఎప్పుడో ప్రకటించాల్సింది. అయితే భారత గడ్డపై తమ మ్యాచ్‌ల వేదికల విషయంలో పాకిస్తాన్ లేవనెత్తిన అభ్యంతరాలు, ఆసియా కప్‌లో తాము పాల్గొనే అంశంతో ముడిపెట్టడంతో ఇంత ఆలస్యమైంది. పాక్ విజ్ఞప్తిని బట్టి ఆ జట్టు ఆడే మ్యాచ్‌ల విషయంలో బోర్డు కాస్త సడలింపులు ఇచ్చినట్లు తెలుస్తోంది. నాకౌట్ దశకు వెళ్లి తప్పనిసరైతే తప్ప అహ్మదాబాద్‌లో ఆడమని చెబుతూ వచ్చిన పాకిస్తాన్ వెనక్కి తగ్గింది. ఈ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 15న భారత్, పాకిస్తాన్ మధ్య అహ్మదాబాద్‌లోనే మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్ మినహా తమ 8 మ్యాచ్‌లలో పాకిస్తాన్ తాము సూచించిన నాలుగు వేదికలు కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలోనే ఆడనుంది.

జులై 12నుంచి తొలి టెస్టు

భారత జట్టు విండీస్ పర్యటన ఖరారు

న్యూఢిల్లీ: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో ఓడిన నెల రోజుల తర్వాత భారత జట్టు వచ్చే డబ్ల్యూటీసీ (2023-25) కోసం తమ పోరును కొత్తగా ప్రారంభించనుంది. వెస్టిండీస్‌లో జరిగే పర్యటనతో ఇది మొదలవుతుంది. ఈ టూర్‌ను సోమవారం బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్, విండీస్ మధ్య 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇరు జట్ల మధ్య జులై 12-16 మధ్య తొలి టెస్టు (డొమినికాలో), జులై 20-24 మధ్య రెండో టెస్టు (ట్రినిడాడ్)లో జరుగుతాయి. జులై 27, 29న రెండు వన్డేలు బార్బడోస్‌లో, ఆగస్టు 1న మూడో వన్డే ట్రినిడాడ్‌లో నిర్వహిస్తారు. ఆగస్టు 3, 6, 8, 12, 13 తేదీల్లో జరిగే 5 టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో తొలి 3 టి20లు ట్రినిడాడ్, గయానాలలో జరగనుండగా...చివరి 2 టి20లకు ఫ్లోరిడా (అమెరికా)లోని లాడర్‌హిల్ స్టేడియం ఆతిథ్యమిస్తుంది.

భారత్‌కు 100 శాతం జరిమానా



లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత మ్యాచ్ ఫీజులో మొత్తం 100 శాతాన్ని జరిమానాగా విధిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన ఓవర్లకంటే భారత్ ఐదు ఓవర్లు తక్కువగా వేయడంతో ఈ శిక్షకు గురైంది. డబ్ల్యూటీసీ చాంపియన్ ఆస్ట్రేలియాపై కూడా నాలుగు ఓవర్లు ఆలస్యంగా వేసినందుకు మ్యాచ్ ఫీజులో 80 శాతాన్ని జరిమానాగా విధించింది. మరో వైపు గ్రీన్ పట్టిన సందేహాస్పద క్యాచ్‌పై సోషల్ మీడియాలో బహిరంగంగా తన అసంతృప్తిని ప్రదర్శించినందుకు శుబ్‌మన్ గిల్‌పై ఐసీసీ మరో 15 శాతం జరిమానా వేసింది.

నేటినుంచి ఇండోనేసియా సూపర్ -1000 టోర్నీ



జకార్తా: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) టూర్‌లో మరో పెద్ద టోర్నీకి రంగం సిద్ధమైంది. నేటినుంచి జరిగే ఇండోనేసియా సూపర్-1000 టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి ఆటగాళ్లంతా బరిలోకి దిగుతున్నారు. గత రెండు టోర్నీల్లో తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్, డబుల్ ఒలింపిక్ విజేత పీవీ సింధుకు ఈ టోర్నీ కీలకం కానుంది. మొదటి పోరులో ఇండోనేసియాకు చెందిన గ్రెగోరియా మరిస్కాతో సింధు తలపడుతుంది. మరో సీనియర్ ప్లేయర్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్, చైనాకు చెందిన వాంగ్ జి యిని ఎదుర్కొంటుంది. పురుషుల విభాగంలో హెచ్‌ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్ కూడా సింగిల్స్ బరిలో నిలిచారు.

భారత్‌ను గెలిపించిన ఛెత్రి

ఇంటర్ కాంటినెంటల్ కప్



భువనేశ్వర్: ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-0 గోల్ తేడాతో వనుతూను ఓడించింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను కెప్టెన్ సునీల్ ఛెత్రి 81వ నిమిషంలో సాధించాడు. తొలి మ్యాచ్‌లో శుక్రవారం మంగోలియాను 2-0తో ఓడించిన భారత్ తమకంటే చాలా తక్కువ ర్యాంక్‌లో ఉన్న వనుతూపై విజయం సాధించేందుకు కూడా శ్రమించాల్సి వచ్చింది. తొలి అర్ధభాగంలో చాలా వరకు బంతిని తమ ఆధీనంలోనే ఉంచుకున్నా...గోల్ చేసేందుకు భారత్ చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. మైదానంలో తన భార్య సోనమ్ మ్యాచ్‌ను తిలకిస్తుండగా...త్వరలో తండ్రి కాబోతున్న సంకేతాన్ని ఛెత్రి తన గోల్ సంబరంలో ప్రదర్శించాడు. రెండు విజయాల తర్వాత 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న భారత్ తమ చివరి పోరులో గురువారం లెబనాన్‌తో తలపడుతుంది.

సినిమా

సంక్రాంతికి ఈగిల్

మోస్ట్ వాంటెడ్ పెయింటర్, పత్తి పండించే రైతు, 'రా' ఏజెన్సీ పట్టుకోవాలనుకుంటున్న మనిషి... ఇలా ఒకే వ్యక్తి గురించి విభిన్న కథలు వినిపిస్తున్నాయి? అసలు అతను ఎవరు? అతని నిజస్వరూపం ఏంటి? అనేది 'ఈగిల్' సినిమాలో తెలుస్తుంది. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఈగిల్'. అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవదీప్, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'ఈగిల్' సినిమా గురించి అధికారికంగా ప్రకటించి, వీడియోను విడుదల చేయడంతో పాటు సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది చిత్ర యూనిట్. ఈ సినిమాకు సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: దవ్‌జాంద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి.



● 'ఈగిల్' పోస్టర్

పవర్‌ఫుల్ భీమా

పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ 'భీమా'గా గోపీచంద్ చార్జ్ తీసుకున్నారు. గోపీచంద్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భీమా'. ఈ చిత్రంతో కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధా మోహన్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ లుక్‌ని సోమవారం విడుదల చేశారు. ''పోలీసాఫీసర్‌గా ఇంటెన్స్ రోల్‌లో గోపీచంద్ కనిపిస్తారు. ఆయన పాత్రలో వైల్డ్‌నెస్ కనిపిస్తుంది. యాక్షన్ అంశాలకు కుటుంబ భావోద్వేగాలు మిళితమైన చిత్రం ఇది. మిగతా వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్, కెమెరా: స్వామి జె. గౌడ.



● గోపీచంద్

అలీకి పద్మశ్రీ రావాలి

\- నటి రాజశ్రీ



● రాజశ్రీ, జుబేదా, అలీ, శ్రీలక్ష్మి, గీత

''బాలనటుడిగా కెరీర్‌ని ప్రారంభించి నలభై ఐదేళ్లుగా అగ్ర హాస్య నటుడుగా కొనసాగుతున్న అలీ కారణజన్ముడు. అతనికి పద్మశ్రీ అవార్డు వస్తే చూడాలని ఉంది'' అని సీనియర్ నటి రాజశ్రీ అన్నారు. సంగమం ఫౌండేషన్, వివేకానంద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'కామెడీ ఫెస్టివల్' నిర్వహించారు. ఇందులో భాగంగా నటుడు అలీని 'సంగమం-వివేకానంద జీవిత సాఫల్య పురస్కారం' అవార్డుతో సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజశ్రీ మాట్లాడుతూ-''అలీ ఎంత మంచి నటుడో అంత మంచి వ్యక్తి కూడా. తనలోని సేవాగుణం స్ఫూర్తినిస్తుంది'' అన్నారు. కాగా అలనాటి హీరో కాంతారావు కుమారుడు రాజా, వ్యాపారవేత్త రాజశేఖర్‌లు హాస్యనటి పాకీజా, కళాకారిణి హేమకుమారిలకు ఒక్కొక్కరికి రూ. 25000 ఆర్థిక సాయం అందించారు. వివేకానంద హాస్పిటల్స్ అధినేత డా. గీత, నటుడు తనికెళ్ల భరణి, 'సంగమం' సంజయ్ కిషోర్ పాల్గొన్నారు.

ప్రేయసి రాఖీ కడితే...

కాలేజ్ డేస్‌లో బాలసుబ్రహ్మణ్యం (బాలు) ఓ అమ్మాయిని ప్రేమిస్తాడు. కానీ ఆ అమ్మాయి స్టూడెంట్స్ అందరి ముందు బాలూకి రాఖీ కడుతుంది. అప్పటి నుంచి ఎవరైనా అమ్మాయి తనను ప్రేమిస్తుందని తెలిస్తే చాలు వెంటనే ఆ అమ్మాయి చేత రాఖీ కట్టించుకుంటుంటాడు బాలు. మరి.. ఎలాంటి ఘటనలతో బాలు జీవితం మళ్లీ ప్రేమవైపు మలుపు తిరుగుతుంది? అనేది తెలుసుకోవాలంటే 'సామజవరగమన' సినిమా చూడాల్సిందే. ఈ చిత్రంలో బాలు పాత్రలో శ్రీవిష్ణు నటించారు. రెబా మోనికా జాన్ హీరోయిన్. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, సహనిర్మాత: బాలాజీ గుత్తా.



● శ్రీవిష్ణు

ఫోక్సో చట్టంపై అవగాహన ఉండాలి



● మనోజ్ బాజ్‌పాయ్

మనోజ్ బాజ్‌పాయ్ నటించిన తాజా హిందీ చిత్రం 'సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై'. అపూర్వ్ సింగ్ కర్కీ దర్శకత్వంలో జీ స్టూడియోస్, వినోద్ భన్సాలి, కమలేష్ భన్సాలి, విశాల్ గుర్నాని, ఆసిఫ్ షేక్ నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో, ప్రస్తుతం థియేటర్స్‌లో కూడా ప్రదర్శితమవుతోంది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా జూన్ 7 నుంచి వీక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మనోజ్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ- ''ఈ సినిమాలో నేను చేసిన లాయర్ సోలంకి పాత్ర సామాన్య ప్రజలకు దగ్గరగా ఉంటుంది. అందుకే బాగా కనెక్ట్ అవుతున్నారు. కథపరంగా విలన్‌పై ఎక్కువగా ఫోకస్ పెట్టకుండా ఓ పదహారేళ్ల అమ్మాయి అనుభవిస్తున్న బాధ, ఆమె తరఫున న్యాయ పోరాటం చేస్తున్న సోలంకిల కోణంలోనే చూపించే ప్రయత్నం చేశాం. న్యాయవ్యవస్థకు అద్దం పట్టేలా ఈ సినిమాను తెరకెక్కించాం. ఫోక్సో చట్టంపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలి. మంచి స్క్రిప్ట్ దొరికితే మళ్లీ తెలుగులో సినిమా చేస్తాను'' అన్నారు.

హంసలదీవిలో...

సాహస్, దీపికా హీరో హీరోయిన్లుగా నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ '7:11'. చైతూ మాదాలను దర్శకునిగా పరిచయం చేస్తూ, ఆర్కస్ ఫిల్మ్స్ పతాకంపై నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మించారు. ఈ నెల 30న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లుగా సోమవారం ప్రకటించారు. మైత్రీ ద్వారా ఈ సినిమా విడుదల కానుంది. ''టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్‌తో హంసలదీవిలో జరిగే వివిధ ఘటనల సమాహారంగా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● సాహస్

ఆర్జీవీ డెన్ వారి కోసమే!

\- రామ్‌గోపాల్ వర్మ

"చిత్ర పరిశ్రమకి రావాలని ఎంతోమందికి ఉంటుంది. వారిలో చాలామంది ప్రతిభావంతులుంటారు. కానీ, వారికి ఇండస్ట్రీకి ఎలా రావాలి? ఎవర్ని సంప్రదించాలి? ఎవరు అవకాశం ఇస్తారు? అనేది తెలియదు. ప్రతిభ ఉన్న కొత్తవారిని ప్రోత్సహించేందుకే 'ఆర్జీవీ డెన్'ని ఏర్పాటు చేశాను. ఈ డెన్ ప్రతిభావంతులను తీర్చిదిద్దే క్రియేటివ్ హబ్ అవుతుంది" అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. ఇండస్ట్రీకి రావాలనుకునే కొత్తవారికి అవకాశాలు ఇచ్చేందుకు 'ఆర్జీవీ డెన్' అనే కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించారాయన. ఈ సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో రామ్‌గోపాల్ వర్మ చెప్పిన విశేషాలు.

గతంలో ముంబైలో 'ఆర్జీవీ కంపెనీ'ని ప్రారంభించారు. ఇప్పుడేమో హైదరాబాద్‌లో 'ఆర్జీవీ డెన్' ఏర్పాటు చేశారు. ఈ డెన్ గురించి...

వర్మ: కొత్తవారికి ఓ ప్లాట్‌ఫామ్ ఇవ్వాలనే 'ఆర్జీవీ డెన్' ఆరంభించాను. నేనేంటో, నా మనస్తత్వం ఏంటో చూపించడానికి కూడా 'ఆర్జీవీ డెన్' ఉపయోగపడుతుంది. ఈ కార్యాలయానికి వచ్చి, చూశాక నాతో పని చేయాలనుకునేవారు వస్తారు.. వద్దనుకునే వాళ్లు పారిపోతారు (నవ్వుతూ). ఇప్పటి వరకూ నేను చేయని జోనర్స్‌లో దాదాపు పది సినిమాలు కొత్తవారి ద్వారా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాను.

ఇలా కెరీర్ గురించి పక్కా ప్రణాళికలు వేసుకుంటున్న మీరు వ్యక్తిగతంగా బంధాలకు దూరంగా ఉన్నారెందుకు?

కుటుంబం, దేవుడు, సమాజం.. ఈ మూడింటికీ నేను విలువ ఇవ్వను. కానీ, మనుషులకు విలువ ఇస్తాను. మా అమ్మ, నా కూతురు అంటే నాకు ద్వేషం లేదు. ఓ మనిషిగా వాళ్లను గౌరవిస్తాను. కానీ, ఆ బంధాల్లోనే ఉండిపోవడం నాకు ఇష్టం ఉండదు. నేను ప్రేమిస్తాను. కానీ, ఎదుటి వాళ్లు నన్ను ప్రేమిస్తే నాకు బరువుగా ఉంటుంది.

రాజకీయాలంటే ఇష్టం లేదని పలు సందర్భాల్లో మీరు అన్నారు. కానీ, ఆ నేపథ్యంలో సినిమాలు తీస్తుంటారు?

నా కెరీర్‌లో రాజకీయ నేపథ్యంలో మూడు సినిమాలే తీశాను. గతంలో 'సర్కార్, లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాలు తీశా. ఇప్పుడు 'వ్యూహం' చిత్రం తీస్తున్నాను. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు ఎలక్షన్ సీజన్‌లోనే సేల్ అవుతాయి. 'వ్యూహం' తర్వాత మరో ఐదేళ్ల పాటు రాజకీయ నేపథ్యంలో సినిమాలు చేయను.

'వ్యూహం' కథేంటి? ఎంతవరకు వచ్చింది?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిగారి వ్యక్తిత్వం అంటే నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం. మాట ఇస్తే దాని కోసం ఎంతవరకైనా కట్టుబడి ఉంటారాయన. వైఎస్ రాజశేఖర రెడ్డిగారు చనిపోయాక జగన్‌గారిని తొక్కేయాలని కొందరు కుట్రలు పన్నారు. జగన్‌గారి జీవితంలో 2009 నుంచి 2014 ఎన్నికల వరకు ఏం జరిగింది? ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అన్నది 'వ్యూహం' తొలి భాగంలో చూపిస్తాను. ఈ చిత్రానికి తొలుత 'కుట్ర' అని టైటిల్ అనుకున్నా.. అయితే చీప్‌గా ఉంటుందని 'వ్యూహం'గా మార్చాను. షూటింగ్ 30 శాతం పూర్తయింది.. సెప్టెంబరులో రిలీజ్ అవుతుంది.

'వ్యూహం' రెండో భాగం కూడా ఉందన్నారు?

2015 నుంచి 2023 అక్టోబర్ వరకు జగన్‌గారి జీవితంలోని అంశాల నేపథ్యంలో 'వ్యూహం 2' ఉంటుంది. జగన్‌గారు ఆఫ్ స్క్రీన్‌లో ఎలా ఉంటారు? ఆయన వ్యక్తిత్వం ఏంటి? వంటి అంశాలు చూపించబోతున్నాను. 2024 ఫిబ్రవరిలో 'వ్యూహం 2' చిత్రాన్ని విడుదల చేస్తాం.



వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మీపై వచ్చే ట్రోల్స్ గురించి ఏమంటారు?

నన్ను ట్రోల్స్ చేయడాన్ని నేను చాలా ఎంజాయ్ చేస్తాను. నేను ఏదైనా ఓ ట్వీట్ చేసినా, మాట్లాడినా కొందరు విపరీతమైన ట్రోల్స్ చేస్తుంటారు. దాని ద్వారా గంటల కొద్దీ వారి విలువైన సమయం వృథా అవుతుంది.. అందులోనే నాకు ఆనందం ఉంది.

మీరు సివిల్ ఇంజినీర్ కదా? డైరెక్టర్ అయ్యాక ఎప్పుడైనా ఇండస్ట్రీకి వచ్చి తప్పు చేశాననిపించిందా?

అలా ఎప్పుడూ అనిపించలేదు. ఇండస్ట్రీలో నేను సంతృప్తిగానే ఉన్నాను.

మీ జీవితంలో ఏ విషయంలో అయినా పశ్చాత్తాపం?

లేదు. నేను ఏది చేసినా ఆ తర్వాత ఇలా చేశానేంటి? అని పశ్చాత్తాపపడలేదు.

దేవుడంటే నమ్మకం లేదంటారు? అనుకోకుండా దేవుడు ప్రత్యక్షమై వరమిస్తే ఏం కోరుకుంటారు?

దేవుడు ప్రత్యక్షమైతే ముందుగా భయపడతాను.. (నవ్వుతూ). ఎందుకంటే సడన్‌గా వెంకటేశ్వర స్వామి ముందుకు వచ్చి, 'నేను వెంకటేశ్వర స్వామిని.. నీకు ఏ వరం కావాలో కోరుకో' అంటే నమ్ముతామా? నేను, మీరు, ఎవరైనా అంతే.. భయపడతాం.

రాజకీయాలపై మీకు ఆసక్తి లేకపోయినా 'ఒకే ఒక్కడు' సినిమాలోలా ఒక్క రోజు ముఖ్యమంత్రిగా అవకాశం వస్తే ఏం చేస్తారు?

మొదటిది.. ఇప్పుడున్న విద్యా వ్యవస్థను మార్చుతాను. రెండోది.. నా ఆలోచనలన్నింటినీ సమాజంపై రుద్దుతాను. మూడోది.. ప్రస్తుతం ఉన్న సొసైటీని డిస్టర్బ్ చేస్తాను (నవ్వుతూ).

సాక్షి బిజినెస్
మంగళవారం
13-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	99	62,725
నిఫ్టీ ▲	38	18,602

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,362	▲	102
డోజోన్స్	33,994	▲	117
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,571	▲	8
డాక్స్	16,098	▲	148
షాంఘై	3,229	▼	3
నికాయ్	32,434	▲	169

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,921
బంగారం (99.5 స్వచ్ఛత)	59,682
వెండి (కిలో)	73,432



ఐటీ, ఇంధన షేర్లకు డిమాండ్

- రెండు రోజుల నష్టాలకు బ్రేక్
- సెన్సెక్స్ లాభం 99 పాయింట్లు
- 18,600 పైకి నిఫ్టీ

ముంబై: ఐటీ, ఇంధన షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాలతో ముగిశాయి. దీంతో సూచీల రెండురోజుల నష్టాలకు బ్రేక్ పడింది. దేశీయంగా రిటైల్, టోకు ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి డేటా వెల్లడితో పాటు అంతర్జాతీయంగా ఫెడ్ రిజర్వ్, ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య పరపతి సమావేశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయంగా కీలక పరిణామాల నేపథ్యంలో సూచీలు ట్రేడింగ్‌లో పరిమిత శ్రేణిలో లాభ నష్టాల మధ్య ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 34 పాయింట్ల లాభంతో 62,660 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 190 పాయింట్ల పరిధిలో 62,805 వద్ద గరిష్టాన్ని, 62,615 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 99 పాయింట్ల స్వల్పలాభంతో 62,725 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి 18,595 ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,560 – 18,634 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 38 పాయింట్లు బలపడి 18,602 వద్ద ముగిసింది. ఐటీ, ఇంధన రంగాలతో పాటు రియల్టీ, మెటల్, ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లకు సైతం కొనుగోళ్ల మద్దతు లభించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-6-2023	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
12-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

ఆర్థిక వ్యవస్థ శుభ సంకేతాలు

- మేలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.25 శాతం
- రెండేళ్ల కనిష్ట స్థాయి
- ఏప్రిల్ పారిశ్రామిక వృద్ధి 4.2 శాతం



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థలో తాజా గణాంకాలు ఉత్సాహాన్ని నింపాయి. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మేలో 4.25 శాతంగా నమోదయ్యింది. అంటే 2022 మేతో పోల్చితే 2023 మేలో రిటైల్ ధరల బాస్కెట్ 4.25 శాతమే పెరిగిందన్నమాట. గడచిన రెండేళ్ల కాలంలో ఇంత తక్కువ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడ్డం ఇదే తొలిసారి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ప్రకారం 2 ప్లస్ లేదా 2 మైనస్‌తో 4 శాతం వద్ద ఉండాలి. అంటే 6 శాతం పైబడకూడదు. అయితే 2022 నవంబర్, డిసెంబర్, 2023 మార్చి, ఏప్రిల్, మే మినహా మిగిలిన అన్ని నెలలూ 6 శాతం ఎగువనే రిటైల్ ద్రవ్యోల్బణం కొనసాగింది. తాజా సమీక్షా నెల్లో 2021 ఏప్రిల్ కనిష్టాన్ని (4.23 శాతం) చూసింది. గడచిన నాలుగు నెలల నుంచీ రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తుండగా, వరుసగా మూడవనెల నిర్దేశిత 6 శాతం దిగువన నమోదయ్యింది. ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో గత మేలో 4 శాతంగా ఉన్న రెపో రేటును ఆర్‌బీఐ 6.5 శాతానికి పెంచింది. ద్రవ్యోల్బణం అదుపు నేపథ్యంలో గడచిన రెండు త్రైమాసికాల్లో యథాతథంగా కొనసాగించింది. తాజా గణాంకాల ధోరణి కొనసాగితే, ఆర్‌బీఐ 2023లో రెపో రేటును పెంచే అవకాశం లేదని నిపుణులు భావిస్తున్నారు. కాగా ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం రేటు 4.7 శాతం కాగా, గత ఏడాది మే నెల్లో 7.04 శాతంగా ఉంది.

కీలకాంశాలు ఇవీ...

- ఒక్క ఆహార విభాగాన్ని పరిశీలిస్తే, మే నెల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.91 శాతంగా ఉంది. ఏప్రిల్‌లో ఇది 3.84 శాతం. మొత్తం సూచీలో దీని వెయిటేజ్ దాదాపు 50 శాతం. ఆయిల్, ఫ్యాట్స్ ధరల స్పీడ్ తాజా సమీక్షా నెల్లో 16 శాతం తగ్గింది. కూరగాయల ధరలు 8.18 శాతం దిగివచ్చాయి. అయితే తృణధాన్యాలు, పప్పుదినుసుల ధరలు వరుసగా 12.65 శాతం, 6.56 శాతంగా ఉన్నాయి.
- ఫ్యూయెల్ లైట్ విభాగంలో ధరల స్పీడ్ ఏప్రిల్‌లో 5.52% ఉంటే, మేలో 4.64 శాతం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం సగటున 5.1 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ అంచనా. జూన్ త్రైమాసికంలో 4.6 శాతంగా ఉంటుందని భావిస్తోంది.

ఏప్రిల్‌లో తయారీ, మైనింగ్ చక్కని పనితీరు

ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి నెల ఏప్రిల్‌లో పారిశ్రామిక రంగం మంచి ఫలితాన్ని నమోదుచేసింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (సీపీఐ) వృద్ధి రేటు 4.2 శాతంగా నమోదయ్యింది. తయారీ, మైనింగ్ రంగాలు మంచి వృద్ధిరేటును నమోదుచేసుకున్నట్లు అధికారిక గణాంకాలు తెలిపాయి. 2023 మార్చితో పోల్చితే (1.7 శాతం వృద్ధి) గణాంకాల తీరు బాగున్నప్పటికీ, 2022 ఏప్రిల్‌తో పోల్చితే (6.7 శాతం) వృద్ధి రేటు తక్కువగా ఉండడం గమనార్హం. అయితే అప్పటి గణాంకాల్లో బేస్ తక్కువగా ఉండడం మరోఅంశం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన తాజా అంకెలను పరిశీలిస్తే...

రంగాల వారీగా ఏప్రిల్ పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు (క్రితం గణాంకాలతో పోల్చి.. శాతాల్లో)

	2023 ఏప్రిల్	2023 మార్చి	2022 ఏప్రిల్
తయారీ	4.9	0.5	5.6
మైనింగ్	5.1	6.8	8.4
విద్యుత్	1.1	– 1.6	11.8
క్యాపిటల్ గూడ్స్	6.2	8.1	12
కన్జూమర్ డ్యూరబుల్స్	– 3.5	–8.4	7.2
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	10.7	–3.1	–0.8
ఇన్‌ఫ్రా/నిర్మాణం	12.8	5.4	4.0
ప్రైమరీ గూడ్స్	– 1.9	3.3	10.3
ఇంటర్మీడియట్ గూడ్స్	0.8	–0.1	7.1



రేటింగ్ అప్‌గ్రేడ్‌పై ఆర్థికశాఖ దృష్టి

16న మూడీస్‌తో అధికారుల భేటీ

న్యూఢిల్లీ: భారత్ సార్వభౌమ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడంపై కేంద్రం మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా జూన్ 16న రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్‌తో ఆర్థిక శాఖ అధికారులు భేటీ కానున్నారు. భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉండటం, కొనసాగుతున్న ఆర్థిక సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తుండటం, దాదాపు 600 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు తదితర సానుకూల అంశాలను వివరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం భారత్‌కు అతి తక్కువ స్థాయి పెట్టుబడుల రేటింగ్ ఉంది.

ఎగవేతదారులతో సెటిల్మెంట్

ముంబై: మొండిపద్దుల నుంచి బ్యాంకులు సాధ్యమైనంత ఎక్కువగా రాబట్టుకునేందుకు వీలు కల్పించడంపై రిజర్వ్ బ్యాంక్ దృష్టి పెట్టింది. ఉద్దేశపూర్వక ఎగవేతలు, మోసపూరిత ఖాతాల విషయంలో రాజీ కుదుర్చుకుని, మొండిబాకీలను సెటిల్ చేసుకోవడానికి బ్యాంకులకు అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం రాజీ సెటిల్మెంట్లను చేపట్టే క్రమంలో ఉద్దేశపూర్వక ఎగవేతలు, సాంకేతిక రైటాఫ్‌ల అంశాల్లో పాటించాల్సిన ప్రక్రియలకు సంబంధించి బోర్డు ఆమోదిత పాలసీలను నియంత్రిత సంస్థలన్నీ (ఆర్‌ఈ) అమలు చేయాల్సి ఉంటుంది. ఏయే పరిస్థితుల్లో రాజీ యత్నాలు చేయవచ్చనేది వాటిలో నిర్దిష్టంగా పేర్కొనాలి. కనీస బాకీ వ్యవధి, తనఖా పెట్టిన ఆస్తుల విలువ కరిగిపోవడం మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. నోటిఫికేషన్ అంశాలు..

- ఇలాంటి కేసుల్లో ఉద్యోగుల జవాబుదారీతనాన్ని పర్యవేక్షించేందుకు తగు వ్యవస్థ ఉండాలి. బాకీ పరిమాణం, కాలపరిమితులు మొదలైనవి బోర్డు నిర్ణయిస్తుంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు లేదా మోసపూరిత ఖాతాలంటూ వర్గీకరించిన ఖాతాల విషయంలో, రుణదాతలపై క్రిమినల్ చర్యలతో సంబంధం లేకుండా, ఆర్‌ఈలు రాజీ సెటిల్మెంట్ చేసుకోవచ్చు.
- రాజీ సెటిల్మెంట్ విషయంలో తనఖా ఉంచిన ఆస్తి (ఏదైనా ఉంటే) నుంచి ప్రస్తుతం రాబట్టుకోగలిగే మొత్తాన్ని సముచిత రీతిలో మదింపు చేసి, ఎంత మొత్తం వదులుకోవచ్చు, ఎంతకు సెటిల్ చేసుకోవచ్చు అనే నిబంధనలను పాలసీలో పొందుపర్చాలి. తనఖా పెట్టిన వాటి నుంచి రాబట్టుకోగలికే విలువను లెక్కించే విధానాన్ని కూడా నిర్దేశించాలి.
- ఆర్‌ఈకి ప్రయోజనం చేకూర్చేలా మొండిబాకీల నుంచి తక్కువ ఖర్చులో, అత్యధికంగా రాబట్టాలనేది లక్ష్యంగా ఉండాలి.రాజీ సెటిల్మెంట్ చేసుకున్న రుణగ్రహీతలకు ఆర్‌ఈలు నిర్దిష్ట వ్యవధి తర్వాతే మళ్లీ కొత్తగా రుణాలివ్వడానికి వీలుంటుంది.

ఏఐతో కొత్త అవకాశాలు.. ప్రైవసీకి సవాళ్లు

జీ20 షెర్పా అమితాబ్ కాంత్

పాంజిమ్: కృత్రిమ మేధ (ఏఐ)తో మానవాళి అభివృద్ధికి కొత్త అవకాశాలు లభించగలవని జీ20 షెర్పా అమితాబ్ కాంత్ తెలిపారు. పనితీరు, పరివర్తనలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సమాచార సేకరణ, ప్రాసెసింగ్, వితరణ ప్రక్రియ అంతా వేగంగా, సమర్థమంతంగా నిర్వహించేందుకు తోడ్పడుతోందని రెండో జీ20–ఎస్ఏఐ (సుప్రీం ఆడిట్ ఇన్‌స్టిట్యూషన్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ), నకిలీ వార్తలపరమైన సవాళ్లు తలెత్తవచ్చని ఆయన చెప్పారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీ- కేడెట్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ నేవీ.. ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచ్‌ల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సు(10+2 క్యాడెట్ ఎంట్రీ) స్కీమ్‌లో అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దర ఖాస్తులను కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడెమీలో శిక్షణ ఉంటుంది.

» **కోర్సు వివరాలు:** 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్
» **బ్రాంచ్ వివరాలు:** ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ కోర్సు
» **మొత్తం ఖాళీలు:** 30 (మహిళలకు 09)
» **విద్యార్హత:** ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులలో కనీసం 70 శాతం మార్కులు సాధించాలి. ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.
» **వయసు:** అభ్యర్థులు 2004 జూలై 02 నుంచి 2007 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 30.06.2023
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

తెలంగాణ ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల సొసైటీ.. ఎస్సీ గురుకుల కళాశాలల్లో(నాన్ సీవోఈ కాలేజీలు) 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జనరల్, ఒకేషనల్ గ్రూపుల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్.
» **అర్హత:** 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000 (పట్టణ విద్యార్థులు), రూ.1,50,000(గ్రామీణ విద్యార్థులకు) మించకూడదు.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023
» **వెబ్‌సైట్:** www.tswreis.ac.in

నిట్ వరంగల్‌లో ఎంబీఏ ప్రవేశాలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 28 సీట్లు
» **అర్హత:** 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ క్యాట్/మ్యాట్ స్కోర్ సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** క్యాట్/మ్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.06.2023
» **షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 22.06.2023.
» **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేది:** 03.07.2023
» **తుది ఫలితాల వెల్లడి తేది:** 05.07.2023.
» **వెబ్‌సైట్:** www.nitw.ac.in

ఐఏవీ, కేరళలో పీహెచ్‌డీ ప్రవేశాలు

కేరళలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ వైరాలజీ(ఐఏవీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** జనరల్ వైరాలజీ విభాగం, వైరల్ డయాగ్నస్టిక్స్ విభాగం, వైరల్ వ్యాక్సిన్ల విభాగం, యాంటీవైరల్ డ్రగ్ రీసెర్చ్ విభాగం, వైరస్ అప్లికేషన్ విభాగం.
» **అర్హత:** ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్)/ఎంవీఎస్సీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.06.2023
» **వెబ్‌సైట్:** www.iav.kerala.gov.in

సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో ఎమ్మెస్సీ ప్రవేశాలు

మైసూరులోని సీఎస్ఐఆర్–సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ).. 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ(ఫుడ్ టెక్నాలజీ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 34
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ (సైన్స్/అగ్రికల్చర్ /ఇంజనీరింగ్ /టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.06.2023
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 12.07.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 23.07.2023.
» **వెబ్‌సైట్:** www.cftri.res.in

అలీ యావర్ జంగ్ ఇన్‌స్టిట్యూట్, ముంబైలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ముంబైలోని అలీ యావర్ జంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబిలిటీస్(దివ్యాంగజన్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏవైజేఎన్ ఐఎస్‌హెచ్‌డీడీ క్యాంపస్‌లలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **క్యాంపస్‌లు:** ముంబై, కోల్‌కతా, సికింద్రాబాద్, జన్లా, భోపాల్.
» **కోర్సుల వివరాలు:** ఎమ్మెస్సీ(ఆడియాలజీ)–రెండేళ్లు; ఎమ్మెస్సీ(స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ)–రెండేళ్లు; డిగ్రీ(ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ)–నాలుగేళ్లు; డిప్లొమా(హియరింగ్, లాంగ్వేజ్ అండ్ స్పీచ్)–ఏడాది; ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపైర్‌మెంట్)–రెండేళ్లు; బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపైర్‌మెంట్)–రెండేళ్లు; డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపైర్‌మెంట్)–రెండేళ్లు; డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రెటర్ కోర్సు–రెండేళ్లు; పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఆడిటరీ వెర్బల్ థెరపీ–ఏడాది; పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ–ఏడాది; డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్(ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్స్)–రెండేళ్లు; డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ)–రెండేళ్లు.
» **అర్హత:** కోర్సును అనుసరించి 10+2, డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023
» **ప్రవేశ పరీక్ష తేదీలు:** 08.07.2023, 15.07.2023, 30.07.2023.
» **వెబ్‌సైట్:** www.ayjnihh.nic.in

ఆర్‌బీఐలో 35 జూనియర్ ఇంజనీర్ పోస్టులు

ముంబయి ప్రధాన కేంద్రంగా గల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. వివిధ విభాగాల్లో జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజినీర్ (సివిల్)–29, జూనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)–06
» **అర్హత:** డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లలో 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 55 శాతం ఉండాలి). సంబంధిత విభాగంలో ఏడాది నుంచి రెండేళ్ల అనుభవం తప్పనిసరి.
» **వయసు:** 01.06.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి(ఎస్సీ,ఎస్టీ, బీసీలకు మినహాయింపు ఉంటుంది.)
» **వేతనం:** రూ.33,900 – రూ.71,032
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు చివరి తేది:** 30.06.2023
» **పరీక్ష తేది:** 15.07.2023
» **వెబ్‌సైట్:** www.rbi.org.in

ఇంటర్‌తో నేవీలో అగ్నివీరులు

నౌకదళంలో అగ్నివీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా ఎస్ఎస్ఆర్, ఎంఆర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభతోపాటు, ఫిజికల్, మెడికల్ టెస్టుల్లో అర్హత సాధించిన వారిని అగ్నివీరులుగా నియమిస్తారు. వీరికి ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఉంటుంది. అనంతరం అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా నాలుగేళ్లపాటు ఇండియన్ నేవీలో సేవలు అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో.. నేవీలో అగ్నివీర్ ఖాళీలు, ఎంపిక విధానం వివరాలు..

- **మొత్తం పోస్టుల సంఖ్య:** ఎస్ఎస్ఆర్–1365(మహిళలకు 273),ఎంఆర్–100(మహిళలకు-20)

అర్హత

- అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.
- అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) పోస్టులకు దరఖాస్తుకు ఇంటర్మీడియట్/10+2లో ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులతోపాటు కెమిస్ట్రీ/బయాలజీ /కంప్యూటర్‌ల్లో ఏదైనా ఒక సబ్జెక్టు చదివి ఉండాలి.
- **అగ్నివీర్(ఎంఆర్):** పదోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.
- **వయసు:** 17 1/2 నుంచి 21ఏళ్ల లోపు ఉండాలి. నవంబర్ 01, 2002 నుంచి ఏప్రిల్ 30, 2006 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు

అన్ని విభాగాలకు పురుషులు 157 సెం.మీ., మహిళలు 152 సెం.మీ ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు ఛాతీ వ్యత్యాసం 5 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ఇలా

ఎంపిక ప్రక్రియలో మూడు దశలు ఉంటాయి. రాత పరీక్ష, ఫిజికల్, మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు. ఈ మూడింటిలో అర్హత సాధించిన వారినే తుదిగా ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ఎస్ఎస్ఆర్ అర్హత పరీక్షలు

- ఈ పోస్టులకు సంబంధించి రెండు స్టేజీలుగా అర్హత పరీక్షలు నిర్వహిస్తారు. స్టేజ్–1 రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మాత్రమే స్టేజ్–2 రాత పరీక్ష, మెడికల్ టెస్టులకు అనుమతిస్తారు. స్టేజ్ 1కు సంబంధించిన రాత పరీక్ష, సిలబస్ వివరాలు ఇండియన్ నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
- **స్టేజ్–1:** ఈ పరీక్ష ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్, సైన్స్, మ్యాథ్స్, జనరల్ అవేర్‌నెస్.. ఇలా నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కును కేటాయిస్తారు. పొరపాటుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు చొప్పున కోతవేస్తారు. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీలో ఉంటాయి. ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులు సాధించడం తప్పనిసరి.



ఎంఆర్ రాత పరీక్ష

ఈ పరీక్షను ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్ రెండు విభాగాల నుంచి 50 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారికి స్టేజ్–2 పరీక్షలుంటాయి. వీరికి ఫిజికల్ స్టాండర్డ్ టెస్టులు, మెడికల్, ట్రైనింగ్ తదితర అన్ని నిబంధనలు అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) మాదిరిగానే ఉంటాయి.

ఫిజికల్ టెస్టులు

- మొదటి దశ రాత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు. ఫిజికల్ టెస్టులకు ఎంపికైన వారు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు అవసరమైన సర్టిఫికేట్లతో హాజరవ్వాలి.
- ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా 1.6 కిలోమీటర్ల దూరాన్ని పురుషులు 7 నిమిషాలు, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు 20, మహిళలు 15 గుంజీలు తీయగలగాలి. పురుషులు 12 పుషప్స్, మహిళలు 10 సీట్అప్‌లు తీయగలగాలి. వీటిలో అర్హత సాధించిన వారికి మాత్రమే మెడికల్ టెస్టులను నిర్వహిస్తారు. మెడికల్ టెస్టులోనూ అర్హత సాధించిన వారికి తుది ఎంపికగా చేసి ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఇస్తారు.

రాత పరీక్ష ప్రిపరేషన్ ఇలా

సిలబస్ 10+2 సీబీఎస్ఈ స్థాయిలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు సంబంధిత టాపిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. సరైన ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. మాక్ టెస్టులు రాయడం ద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది. చేస్తున్న పొరపాట్లు తెలుస్తాయి. ఇంగ్లిష్‌కు సంబంధించి వ్యాకరణంపై పట్టు సాధించాలి. మేథమెటికల్ విభాగంలో మాదిరి ప్రశ్నలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి తాజాగా రక్షణ శాఖలో తీసుకొచ్చిన నూతన సాంకేతికత, సంభవించిన కీలక పరిణామాలపై దృష్టిపెట్టాలి. వీటితోపాటు స్పోర్ట్స్, అవార్డ్స్, బుక్స్, ఎన్నికలు తదితర తాజా సమకాలీనాంశాలపై అవగాహన మేలు చేస్తుంది.

సేవానిధి

ప్రతినెల అగ్నివీరులు అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్(సేవా నిధి)కి జమచేస్తారు. మొదటి ఏడాది ప్రతి నెల రూ.30 వేలు వేతనంగా పొందితే.. అందులో రూ.9 వేలు సేవానిధిలో జమ అవుతుంది. రెండో ఏడాది రూ.33,000 వేతనంగా అందుతుంది. ఇందులో నుంచి రూ.9900 నిధికి జమవుతుంది. అలాగే మూడో ఏడాది రూ.36,500 వేతనం లభిస్తుంది. ఇందులో నుంచి రూ.10,950 నిధికి జమచేస్తారు. ఇలా నాలుగో ఏడాదికి వచ్చేసరికి అగ్నివీరుని రూ.40000 వేతనంలో రూ. 12,000 సేవా నిధికి వెళ్తాయి. మొత్తం నాలుగేళ్ల కాలానికి సేవా నిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని వేతనం నుంచి జమవుతాయి. అంతేమొత్తాన్ని ప్రభుత్వమూ జమచేస్తుంది. రెండూ కలిపి రూ. 10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని కలిపి నాలుగేళ్ల అనంతరం అందజేస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌లో మధ్యలో కావాలంటే.. వైదొలిగే అవకాశం కూడా ఉంటుంది. అలాంటి సందర్భంలో వేతనం నుంచి జమ అయిన మొత్తాన్ని అగ్నివీరులకు అందిస్తారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం మాత్రం వీరికి దక్కదు.

ఇతర ప్రయోజనాలు

అగ్నివీరులకు 30 వార్షిక సెలవులు లభిస్తాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్‌లీవ్‌లు కూడా ఇస్తారు. నాలుగేళ్ల సర్వీస్ కాలంలో రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గాను వారు పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్ సర్టిఫికేట్ అందుతుంది. వీరికి పింఛను, గ్రాట్యుటీ, కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే(ఎంఎస్‌పీ), ఎక్స్‌సర్వీస్‌మెన్ హోదా వంటివి వర్తించవు. ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) ఉండదు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2023, జూన్ 15
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

క్లుప్తంగా...



శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల:సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో ఆయనకు పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఆ తర్వాత జస్టిస్ అజయ్ రస్తోగి తిరుచానూరు చేరుకుని పద్మావతీ అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. అలాగే కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్, తెలంగాణ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

కోర్టుల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోర్టుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆ పోస్టుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉంటే వారిని క్రమబద్ధీకరించాలని రిజిస్ట్రార్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. కొందరు పది పదిహేనేళ్లుగా పని చేస్తున్నారని, వారి సేవలను పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించింది. కోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వీరితో భర్తీ చేయాలని సూచించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నవారిని తొలగిస్తూ 2021, ఏప్రిల్ 1న రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిని సవాల్ చేస్తూ 200 మంది వరకు ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం సోమవారం విచారణ నిర్వహించింది.

ఆర్టీసీలో ఐక్య పోరాటం

బీఎంఎస్ కార్యాలయంలో ఆరు కార్మిక సంఘాల నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మిక సంఘాలు మరోసారి ఐక్య కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. బీఎంఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆర్టీసీలోని ఆరు యూనియన్లు టీఎంయూ, టీజేఎంయు, బీఎంఎస్, బీడబ్ల్యూయూ, ఎస్.డబ్ల్యూయు, ఎస్ఎంయూ ప్రతినిధులు సోమవారం సమావేశమై సమస్యలపై చర్చించారు. పరిష్కారానికి ఉమ్మడి పోరాటం అవసరమని, మిగతా సంఘాలు కలిసిరావాలని కోరారు. తదుపరి సమావేశానికి అన్ని సంఘాలూ వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో అశ్వత్థామరెడ్డి, హన్మంతు, స్వామి, అబ్రహం, సురేష్, సాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'తెలంగాణ రన్'

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహణ ● ప్రారంభించిన మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పోలీసు శాఖ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన 'తెలంగాణ రన్' ఉత్సాహంగా జరిగింది. మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్‌లు జెండా ఊపి 2కె, 5కె రన్‌లను ప్రారంభించగా.. అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై నెక్లెస్ రోడ్డు మీదుగా సాగాయి. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధితో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే నెంబర్ వన్ సీఎం అని కొనియాడారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఐటీ పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ రాష్ట్రంతో ఎవరూ పోటీ పడలేరని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. దేశంలోనే హైదరాబాద్ సురక్షిత నగరమైతే, తెలంగాణ ఆరోగ్యవంతమైన రాష్ట్రమని పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహ స్ఫూర్తిగా తెలంగాణ రన్ నిర్వహించడం గర్వకారణమన్నారు. రన్ ప్రారంభోత్సవానికి ముందు ప్రముఖ గాయకులు మంగ్లీ, రామ్‌లు ఆలపించిన పాటలు ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి. బోనాలు, బతుకమ్మలతోపాటు పోలీసులు అశ్వక దళం, డప్పులు, ఇతర నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్రీడాకారిణి ఈషాసింగ్, సినీ నటి శ్రీలీల, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, 4వేల మందికిపైగా ప్రజలు పాల్గొన్నారు. కాగా, పీర్జాదిగూడలో జరిగిన 2కెరన్‌లో మంత్రి మల్లారెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్.. పాటలకు స్టెప్పులేశారు.

హస్తినలో 2కె తెలంగాణ రన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో 2కె తెలంగాణ రన్ సోమవారం ఉదయం నిర్వహించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ రన్‌ను ప్రారంభించారు. తెలంగాణ భవన్ నుంచి మొదలై ఇండియా గేట్ మీదుగా కొనసాగింది. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల స్ఫూర్తిని దేశ రాజధాని ఢిల్లీలో సైతం కొనసాగించాలన్నదే తమ లక్ష్యమని గౌరవ్ ఉప్పల్ తెలిపారు.



రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో నటి శ్రీలీల, డీజీపీ అంజనీ కుమార్, మేయర్ విజయలక్ష్మీ ఎమ్మెల్యే దానం నాగేందర్, సీఎస్ శాంత కుమారి.



రన్‌లో పాల్గొన్న యువతీ యువకులు

హైదరాబాద్‌లో జీ-20

వ్యవసాయ సమావేశాలు

ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహణ

- హాజరుకానున్న 30 దేశాల వ్యవసాయ మంత్రులు
- ఘనంగా ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ
- వ్యవసాయంలో ఆధునిక ఆవిష్కరణలపై చర్చలు
- ఆహార భద్రత, రైతులకు ఆర్థిక సహకారంపైనా చర్చించే అవకాశం

G20

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన జీ-20 వ్యవసాయ మంత్రుల సమావేశాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగనున్నాయి. ఈ మేరకు హెచ్ఐసీసీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఆ శాఖ ఉన్నతాధికారులు ఈ పనిలో తలమునకలై ఉన్నారు. ఈ సమావేశాల్లో జీ-20లో భాగమైన ఇండోనేషియా, బ్రెజిల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, కెనడా, చైనా, యూరోపియన్ యూనియన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, యూకే, యూఎస్ఏ, ఇండియాలతో పాటు సదస్సుకు ఆహ్వానించిన 10 దేశాలు బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్, నెదర్లాండ్స్, ఒమన్, నైజీరియా, సింగపూర్, స్పెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, వియత్నాంల వ్యవసాయ మంత్రులు.. ఇక్రిశాట్, ఓఈసీడీ, ఏడీబీ, ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ, ప్రపంచ బ్యాంకు తదితర సంస్థల ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు. మొత్తంగా 30 దేశాలకు చెందిన 180 మంది ప్రతినిధులు రానున్నట్టు వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

నాలుగో వ్యవసాయ సదస్సు

జీ-20 దేశాల సదస్సులో భాగంగా ఇప్పటివరకు మూడు వ్యవసాయ సంబంధిత సమావేశాలు జరిగాయి. ఫిబ్రవరిలో ఇండోర్‌లో, తర్వాత మార్చి చివరి వారంలో చండీగఢ్‌లో అగ్రికల్చర్ డిప్యూటీల భేటీలు జరిగాయి. ఏప్రిల్ మూడో వారంలో వారణాసిలో మూడు రోజులపాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సదస్సు జరిగింది. ఇప్పుడు నాలుగో వ్యవసాయ సదస్సు హైదరాబాద్‌లో జరుగుతోంది. దీనిలో మంత్రులు పాల్గొననున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరిస్తారు. మన దేశంలో రైతు బంధు, కిసాన్ సమ్మాన్ వంటి పథకాల ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహకారంపై చర్చించే అవకాశముంది. ఆధునిక, వినూత్న సాంకేతిక ఆవిష్కరణల ప్రదర్శన ఉండనుంది.

ఆధునిక పరిజ్ఞానం.. సభ్య దేశాల మధ్య సహకారం..

ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు లక్ష్యంతో.. సభ్య దేశాల మధ్య వ్యవసాయ రంగంలో సహకారమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతున్నాయి. వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం, విత్తన నాణ్యత, ఎగుమతులు, దిగుమతులు, కొత్త ఒరవడులు.. వ్యవసాయానికి సంబంధించి సభ్య దేశాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లు, ఆహార భద్రత, అంతరాలు, వాతావరణ మార్పుల కారణంగా పంటల ఉత్పాదకతపై ప్రభావం, ఉపాధి సమస్యలను ఇందులో చర్చిస్తారు. సభ్య దేశాల మధ్య వివిధ అంశాలపై ఒప్పందాలు కూడా జరుగనున్నాయి. వివిధ దేశాల వ్యవసాయశాఖ మంత్రులతో కేంద్ర ప్రభుత్వం పలు ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనుంది. ఇందుకు అనుగుణంగా కేంద్ర వ్యవసాయశాఖ ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాదిని ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ సంవత్సరంగా జరుపుతున్న నేపథ్యంలో.. మిల్లెట్ల (చిరుధాన్యాలు)ను ప్రోత్సహించే చర్యలు, ఆహారం, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా సమావేశాల్లో చర్చించనున్నారు.

సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రతే లక్ష్యం

- జీ-20 వ్యవసాయ సదస్సుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- జూన్ 19 నుంచి 22 వరకు గోవాలో జీ-20 పర్యాటక మంత్రుల సమావేశాలు



సాక్షి, హైదరాబాద్: ఆహార భద్రత, సుస్థిర వ్యవసాయం లక్ష్యంగా జీ-20 వ్యవసాయ సదస్సులో చర్చలు ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. మంత్రుల స్థాయిలో జరుగుతున్న సమావేశాలు వ్యవసాయ రంగానికి దిశానిర్దేశం చేస్తాయన్నారు. హైదరాబాద్‌లో వ్యవసాయానికి సంబంధించిన పరిశోధన సంస్థలు అధికంగా ఉన్నందునే ఇక్కడ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. జూన్ 19 నుంచి 22 వరకు గోవాలో జీ-20 దేశాల పర్యాటక మంత్రుల సమావేశాలు ఉంటాయని తెలిపారు. పర్యాటక శాఖకు సంబంధించి తొలి వర్కింగ్ గ్రూప్ సమావేశం గుజరాత్‌లోని రణ్ ఆఫ్ కచ్‌లో, రెండోది పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలో, మూడోది ఇటీవలే శ్రీనగర్‌లో జరిగిందన్నారు. గోవాలో జరిగే సమావేశాల్లో గోవా రోడ్ మ్యాప్ పేరుతో పర్యాటకానికి సంబంధించిన డిక్లరేషన్‌ను వెలువరించనున్నట్టు చెప్పారు. ఈ నెల 24, 25 తేదీల్లో వారణాసిలో జీ-20 సమావేశాలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 9, 10 తేదీల్లో ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జీ-20 దేశాలు, ఆతిథ్య దేశాల అధ్యక్షులు, ప్రధానులతో తుది సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ

- ఈ దిశగా వేగంగా చర్యలు తీసుకుంటున్న సీఎం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్‌ను సహించం
- వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వేగంగా చర్యలు తీసుకుంటున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో గత ప్రభుత్వాలు 60 ఏళ్లలో 3 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, తాము 9 ఏళ్లలో 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అతి తక్కువ సమయంలో మొత్తం 21 మెడికల్ కాలేజీలు ప్రారంభించి తమ ప్రభుత్వం దేశంలో రికార్డు సృష్టించిందన్నారు. పెద్ద మొత్తంలో మౌలిక వసతులు కల్పించి, వైద్య సిబ్బందిని నియమిస్తూ ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేసినట్లు చెప్పారు. ఇటీవల ఏకకాలంలో 1,061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించడం వల్ల టీచింగ్ ఆసుపత్రులు మరింత బలోపేతమైనట్లు తెలిపారు. సోమవారం మంత్రి బోధన ఆసుపత్రుల పనితీరుపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ లేకుండా చూడాలని, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా కాలేజీల్లో ప్రచారం చేయాలని సూచించారు. ర్యాగింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని స్పష్టం చేశారు. వైద్య విద్యార్థుల స్టయిపెండ్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్య పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కాగా, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఉదయం 9 గంటల కల్లా ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండాలని స్పష్టంచేశారు. కొత్తగా ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు వైద్యంతో పాటు బోధన, పరిశోధనపై దృష్టి సారించాలని సూచించారు.

ఐటీ రిటర్న్ పేరిట మోసాలు..!



సాక్షి, హైదరాబాద్: సుజయ్.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలంటూ అతడికి ఓ ఈ మెయిల్ వచ్చింది. అందులో 'మీరు రూ. 41,542 ఓవర్ డ్యూ రీఫండ్‌కు అర్హులు, కాకపోతే మీ అకౌంట్ వివరాల్లో తప్పులు ఉన్నాయి. వాటిని సరి చేసుకునేందుకు వెంటనే మేం పంపిన ఈ మెయిల్‌లో లింక్‌పై క్లిక్ చేసి, వివరాలు నమోదు చేయండి' అని ఉంది. అది ఆదాయపన్నుశాఖ నుంచి వచ్చిన ఈ-మెయిలని సుజయ్ భావించాడు. ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారిక లోగో, భారత ప్రభుత్వ ఆదాయ పన్నుశాఖ అని వివరాలు ఉండటంతో నమ్మేశాడు. కానీ.. నిశితంగా పరిశీలించి ఈ-మెయిల్ వచ్చిన అడ్రస్ మరేదో ఉండడంతో కంగు తిని వెంటనే విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చాడు. ఇలా.. అనేకమందికి సైబర్ మోసగాళ్లు ఆదాయ పన్నుశాఖ పంపుతున్నట్టుగా ఈ-మెయిల్స్ పంపి మోసాలు చేస్తున్నట్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. పన్ను చెల్లింపుల పేరిట వచ్చే ఏ ఈ-మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు నమ్మవద్దని, అధికారిక వెబ్ సైట్ ద్వారానే వివరాలు పొందాలని సూచిస్తున్నారు.

మోసపూరిత ఈ-మెయిల్స్ వస్తే ఏం చేయాలి..?

- ఆదాయపన్ను చెల్లింపు పేరిట వచ్చే నకిలీ ఈ-మెయిల్స్‌ను గుర్తించేందుకు ముందుగా మనకు వచ్చిన ఈ మెయిల్‌లో పంపిన వారి మెయిల్ అడ్రస్‌ను నిశితంగా పరిశీలించాలి.
- అది మోసపూరిత ఈ-మెయిల్ అని భావిస్తే.. మెయిల్స్‌లోని లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్, ఆధార్‌నంబర్ సహా ఏ వివరాలూ పంచుకోవద్దు.

వారం రోజుల్లో రాష్ట్రానికి నైరుతి

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల రాక ఈ ఏడాది కాస్త ఆలస్యమైంది. సాధారణంగా జూన్ మొదటివారం నాటికే రాష్ట్రానికి వచ్చే రుతుపవనాలు ఈసారి రెండు వారాలు గడుస్తున్నా జాడ లేదు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలకు వ్యాపించాయి. అదేవిధంగా కొంకణ్, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు వ్యాపించాయి. రుతుపవనాల కదలిక కాస్త నెమ్మదిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రానికి వచ్చేందుకు వారం రోజులు పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి. గాలుల తీవ్రత తగ్గితే రుతుపవనాలు చురుకుగా కదిలే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వానాకాలం ప్రారంభమైనా రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని అధికారులు చెబుతున్నారు.

సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ నుంచి 42డిగ్రీల సెల్సియస్ మధ్యన నమోదయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీ సెల్సియస్ మధ్యన నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ వివరించింది. సోమవారం రాష్ట్రంలో జగిత్యాల జిల్లా నేరెళ్లలో 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

సోమవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత	ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత
నేరెళ్ల (జగిత్యాల)	44.8	నల్లగొండ	41.5
కమాన్‌పూర్ (పెద్దపల్లి)	44.7	రామగుండం	41.4
అశ్వాపురం (కొత్తగుడెం)	44.5	హనుమకొండ	41.0
సారంగపూర్(జగిత్యాల)	44.5	మహబూబ్‌నగర్	40.2
తలమడుగు (అదిలాబాద్)	44.3	మెదక్	40.2
ఆదిలాబాద్	42.3	నిజామాబాద్	40.0
భద్రాచలం	42.2	దుండిగల్	38.8
ఖమ్మం	41.5	హైదరాబాద్	38.8

హరిరామజోగయ్యకు తెలంగాణ హైకోర్టు అక్షింతలు

- ఏపీ సీఎం జగన్‌పై దాఖలు చేసిన పిల్‌లో ప్రజాప్రయోజనం ఏముందంటూ మండిపాటు
- పబ్లిక్ న్యూసెన్స్ పిటిషన్ అంటూ ఆగ్రహం
- రాష్ట్రపతి, సీజేఐ పేరు చెప్పి కోర్టును భయపెట్టలేరని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: 'ఇదో 'పబ్లిక్ న్యూసెన్స్' పిటిషన్.. అసలు ఇందులో 'ప్రజా ప్రయోజనం (పబ్లిక్ ఇంట్రస్ట్)' ఏముంది? వ్యక్తిగత కక్షతోనే ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినట్లు కనిపిస్తోంది' అంటూ తెలంగాణ హైకోర్టు ధర్మాసనం మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలున్న సీబీఐ కేసులను త్వరగా విచారణ చేపట్టి, 2024 సాధారణ ఎన్నికలకు ముందే తీర్పు ఇవ్వాలని, ఆ మేరకు సీబీఐ కోర్టుకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హరిరామజోగయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై అభ్యంతరం లేవనెత్తిన రిజిస్ట్రీ కేసు నంబర్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఫైలింగ్ నంబర్‌పైనే విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలకు సిద్ధం కాగా ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై నమోదు చేసిన కేసుల విచారణ త్వరగా పూర్తి కావాలని సీబీఐ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారా? అలాంటిదేమీ చేయకుండా రాష్ట్రపతికి లేఖ రాశాం, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాం.. అంటారా? ఇదేం పద్ధతి? ఉన్నత స్థానాల్లో ఉన్న వారి పేర్లు చెప్పినంత మాత్రాన కిందిస్థాయి కోర్టులు భయపడి పని చేయవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీ పిటిషన్‌లో ఎక్కడన్నా ప్రజాసక్తి ఉందని మీకు అనిపిస్తోందా? వ్యక్తిగత ద్వేషంతో కోర్టులను ఆశ్రయించి.. కోర్టుల సమయాన్ని వృథా చేయవద్దు. ఈమధ్య తెలంగాణ గవర్నర్ చెప్పినట్లు ఇలాంటి పబ్లిక్ న్యూసెన్స్ కేసులు ఎక్కువయ్యాయి. కొందరికి ఇలాంటి పిటిషన్లు వేయడమే పరిపాటిగా మారింది. మీరు అడిగారు కదా అని వెంటనే విచారణ చేపట్టలేం' అని హైకోర్టు ధర్మాసనం హరిరామజోగయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తిన అంశాల కాపీని పిటిషనర్‌కు ఇవ్వాలని ఆదేశించింది. పిటిషన్‌ను నంబర్ చేయాలా వద్దా అనే విషయంపై విచారణను జూలై 6కు వాయిదా వేసింది.

'రెరా' చైర్మన్‌గా సీడీఎంఏ సత్యనారాయణ

- సభ్యులుగా లక్ష్మీనారాయణ జన్ను, కె.శ్రీనివాసరావు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జనవరిలో దరఖాస్తులు కోరిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్- రెరా) చైర్మన్‌గా పురపాలక శాఖ డైరెక్టర్ ఎన్. సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా వాణిజ్య పన్నుల శాఖ రిటైర్డ్ అదనపు కమిషనర్ లక్ష్మీ నారాయణ జన్ను, డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ (రిటైర్డ్) కె. శ్రీనివాస్‌రావులను ప్రభుత్వం నియమించింది. రెరాకు ప్రస్తుతం చైర్‌పర్సన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తాత్కాలిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆరు నెలల కసరత్తు తరువాత ప్రభుత్వం రెరాకు పూర్తి స్థాయిలో చైర్మన్, సభ్యులను నియమించింది.

జనవరిలో నోటిఫికేషన్-37 మంది దరఖాస్తు

టీఎస్ రెరా ఏర్పాటైన నాటి నుంచి ప్రభుత్వ ప్రధానకార్యదర్శులే చైర్‌పర్సన్‌లుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నారు. కాగా పూర్తి స్థాయి చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులను నియమించేందుకు గత జనవరి 16వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 3వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించగా, 37 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు చేసుకున్న వారిలో ఆరుగురు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో పాటు పలువురు సీనియర్ అధికారులు, గతంలో పట్టణాభివృద్ధి, రెవెన్యూ, వాణిజ్యపన్నుల శాఖల్లో విధులు నిర్వర్తించిన పలువురు అధికారులు కూడా ఉన్నారు. రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో పాటు మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ, పలువురు రిటైర్డ్ ఐఏఎస్‌లు, సివిల్ సర్వీసుల్లో వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్ అయిన వారు ఉన్నారు. అలాగే ఇద్దరు సభ్యుల నియామకం కోసం 59 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేసే బాధ్యత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీకి అప్పగించారు. హైకోర్టు సీజే నేతృత్వంలోని కమిటీ.. చైర్మన్ పదవి కోసం అర్హులైన నలుగురితో కూడిన ప్యానల్ జాబితాను, సభ్యుల జాబితాను ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. ఆ జాబితా నుంచి రెరా చైర్మన్‌గా మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ ను ప్రభుత్వం ఎంపిక చేసింది. పురపాలక శాఖలో ఆయన పరిపాలన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం.


మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగజీవితం ప్రారంభం..

1996వ సంవత్సరంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా కెరీర్ ప్రారంభించిన సత్యనారాయణ, పట్టణ పరిపాలనలో ఎన్నో ఆవిష్కరణలకు, ప్రయోగాలకు కేంద్రంగా మారారు. ఈ మున్సిపాలిటీ పరిధిలో 'పేదరికాన్ని తగ్గించే పురపాలక కార్యాచరణ ప్రణాళిక (ఎంపీపీ)'ని రూపొందించి అంతర్జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. జపాన్‌లోని ఒసాకా నగరంలో అంతర్జాతీయ నిధుల ఏజెన్సీ 'ఐసీఏ(జికా)'నిర్వహించిన ప్రతిష్టాత్మక శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడానికి భారత్ నుంచి వెళ్లిన ఏకైక నామినీగా గుర్తింపు పొందారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా, జోనల్ కమిషనర్‌గా కూడా విధులు నిర్వర్తించారు. 2009 బ్యాచ్ ఐఏఎస్‌గా ఎంపికైన తరువాత నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, ఇన్‌చార్జి కలెక్టర్‌గా, తెలంగాణ ఏర్పాటు తరువాత కామారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. మెప్మా ఎండీగా మూడేళ్లకుపైగా విధులు నిర్వర్తించిన ఆయన గత మూడేళ్ల ఐదు నెలలుగా సీడీఎంఏగా విధులు నిర్వర్తిస్తున్నారు.

అక్రమంగా ప్రవేశిస్తే.. మట్టుపెట్టేలా

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న నేవీ

- విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో నేవల్ యాంటీ డ్రోన్ సిస్టమ్ ఏర్పాటు
- శత్రు దేశాల డ్రోన్‌లను నాశనం చేసేలా స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ



సాక్షి, విశాఖపట్నం: శత్రుదేశాల కుయుక్తులను తిప్పికొట్టేందుకు భారత నౌకాదళం ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తోంది. ఇందులో భాగంగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌తో పాటు నేవీ ఎయిర్‌ఫీల్డ్‌ను మరింత పక్కాగా నిర్వహించే వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది. శత్రుదేశాల డ్రోన్‌లను మట్టుపెట్టేలా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన నేవల్ యాంటీ డ్రోన్ సిస్టమ్(ఎన్ఏడీఎస్)ను ఐఎన్ఎస్ డేగాలో సోమవారం తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా ప్రారంభించారు. భారీ డ్రోన్ల నుంచి తూనీగల పరిమాణంలో ఉన్న మైక్రో డ్రోన్ల వరకు దేన్నైనా సరే.. లేజర్ ఆధారిత కిల్ మెకానిజం సహాయంతో గుర్తించి వెంటనే మట్టుపెట్టేలా ఈ వ్యవస్థను రూపొందించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) సహకారంతో దీనిని తయారు చేశారు. యుద్ధ నౌకల్లో ఈ యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు భారత నౌకాదళం చర్యలు చేపట్టింది.

ఎయిర్‌స్టేషన్లకు రక్షణ కవచం

పఠాన్‌కోట్ తరహా ఉగ్రదాడులు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థను కవచంలా ఏర్పాటు చేసుకోవాలని భారత రక్షణ శాఖ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా మొత్తం 6 నేవీ ఎయిర్‌స్టేషన్లలో ఈ ఎన్ఏఐఎస్ఎస్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సోమవారం విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో ఈ కొత్త భద్రతా వ్యవస్థను ప్రారంభించారు. ఈ ఎయిర్‌స్టేషన్‌లో స్మార్ట్ ఫెన్స్‌ను అమర్చారు. దీనిని సీసీ కెమెరాలకు అనుసంధానం చేశారు. ఈ స్మార్ట్ ఫెన్స్ లోపలికి ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్‌తో సహా ఏది ప్రవేశించినా.. వెంటనే కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తుంది. సెకన్ల వ్యవధిలో మొత్తం వ్యవస్థకు సమాచారం ఇస్తుంది. అక్రమంగా లోపలికి ఎవరు ప్రవేశించాలని భావించినా వారిని మట్టుపెట్టేలా యాంటీ పెనిట్రేషన్, థర్మల్ సెన్సార్లతో పాటు డ్రోన్ల పర్యవేక్షణతో పహారా ఏర్పాటు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.